
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002



# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 23.07.2026 | సంపుటి : 13 సంచిక : 03 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## విద్యార్థులపై లాఠీఛార్జీపై ప్రధాని

# క్షమాపణ చెప్పాలి



### ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలి
### పన్నెండేళ్ల పాలన లీకుల పర్వం:రాహుల్

- ఇప్పటి వరకు మొత్తం 152 పరీక్షల పేపర్లు లీకయ్యాయి
- ఒక్క దాంట్లోనూ కూడా దోషులను తేల్చలేదు
- విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు
- వారి ఆశలు, ఆకాంక్షలను నాశనం చేస్తున్నారు
- మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది.
- మీడియా సమావేశంలో రాహుల్

**న్యూఢిల్లీ,జూలై22(జనంసాక్షి):** గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ మిగతా 2లో..

"గత పదేళ్లలో 152 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు జరిగాయి, కానీ ఒక్కరికి కూడా శిక్ష పడలేదు. అంటే ఎవరో ఒకరు లేదా ఒక బృందం మన విద్యా వ్యవస్థను, అంటే దేశపు అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేసి, మన విద్యార్థుల జీవితాలను దెబ్బతీశారు. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది? శిక్షలు మాత్రం పడడంలేదు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే. అలాగే, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం వ్యవహారంపై ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి. పరీక్షల విధానంలో మార్పులు తీసుకురావాలి. నిరసనలో జరిగిన గాయాల గురించి బాధపడటం లేదు, ఇంకా ఎన్ని దెబ్బలకైనా సిద్ధం. కానీ, విద్యార్థులకు జరుగుతున్న నష్టం విషయంలోనే బాధ కలుగుతోంది. అందుకే విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నాం. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తున్నారు, జలఫిరంగులు వాడుతున్నారు. ఆందోళన చేసేవాళ్లు, ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తులు కాదు. విద్యార్థులంటే మన దేశ భవిష్యత్, మన ఆశలు." - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## రాహుల్ అరెస్టుపై భగ్గుమన్న భారత్

**దేశవ్యాప్తంగా కదంతొక్కిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు**

- ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం కాదు.. నియంతృత్వ ప్రభుత్వం : ఖర్గే
- రోడ్లపై విద్యార్థులతో.. పార్లమెంట్‌లో మాతో కేంద్రం ఒకే వైఖరి అవలంబిస్తోంది : ప్రియాంక గాంధీ
- నలుపురంగు దుస్తులతో పార్లమెంట్ సమావేశాలకు కాంగ్రెస్ నేతలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలను మాట్లాడనీయడం లేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ అప్రజాస్వామికంగా నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై విద్యార్థులతో.. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలతో కేంద్రం ఒకే విధంగా ప్రవర్తిస్తోందని మండి పడ్డారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరస నలు చేస్తున్న వారిపై లాఠీ ఛార్జీ చేయించడం ప్రజా స్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులకు మద్దతు తెలిపినందుకు తమను కూడా పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి తరలించారన్నా రు. తమ విషయంలో ఏ విధంగా ప్రవర్తించినప్ప టికీ.. విద్యార్థుల హక్కులను కాలరాయడం సరైన చర్య కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఉన్నది ప్రజాస్వామ్య ప్రభుత్వం కాదని, నియంతృత్వ ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వ నేతలు పార్లమెంట్‌లో మిగతా 2లో..



## ధర్మేంద్ర ప్రదాన్‌ను బర్తరఫ్ చేయాలి

**భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారు : సీఎం రేవంత్ రెడ్డి**

### కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసనగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ర్యాలీ

**కొడంగల్(జనంసాక్షి):** భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని తెలం గాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా మిగతా 2లో..

### భాజపా, బీఆర్ఎస్ తప్పులు ప్రశ్నిస్తున్నందుకే నాపై కుట్ర

ఆ రెండు పార్టీలు వేరు కావొచ్చు.. కానీ, వాళ్ల లక్ష్యం మాత్రం ఒక్కటే

నన్ను నేరుగా ఎదుర్కోలేక కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు

కొడంగల్‌లో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

## మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

**విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ**

**న్యూఢిల్లీ,జులై22(జనంసాక్షి):**వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. మిగతా 2లో..

### మాకంత సమయమూ లేదు.. మీ సమయమూ
## వృథా చేసుకోవద్దు



- లాఠీఛార్జిపై సుప్రీం వ్యాఖ్య
- నిరసనలు పబ్లిసిటీ కోసం చేస్తారా..!
- విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు.నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ మిగతా 2లో..

### ప్రధాని ఇంటిముందు ధర్నాకు భాజపా
## కౌంటర్ ధర్నా

గాంధీభవన్ ఎదుట ఆ పార్టీ నాయకుల నిరసన

లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం

పరస్పరం దాడులతో ఉద్రిక్తత





కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు సొనవమ్ వాంగ్‌చుక్ లేఖ

### డిమాండ్లు ఆమోదిస్తేనే దీక్ష
## విరమిస్తా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దోషులను శిక్షించాలంటూ సీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు మద్దతుగా పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఆయన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు లేఖ రాశారు. ఆందోళనల్లో పాల్గొన్న యువతపై ఎటువంటి చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇస్తే దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు. ఆందోళన విరమించి ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిరసనకారులను మిగతా 2లో..

## నీట్‌పై చర్చకు సిద్ధం

**రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు : కేంద్రమంత్రి జేపీ నడ్డా**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేపర్ లీక్‌తో సంబంధమున్న అన్ని అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విపక్షాలు అడిగే ప్రశ్నలకు మిగతా 2లో..

### చర్చించాలనుకుంటే
## మా వద్దకే రండి

- జులై 20న జరిగిన నిరసనలు ట్రైలర్ మాత్రమే
- డిమాండ్లు అంగీకరించకపోతే ఢిల్లీకి లక్షలాది యువత తరలివస్తుంది : సీజేపీ
- విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంతోనే ఉద్రిక్తతలు జరిగాయని ఆరోపణ

2లో..

### ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో
## రెడ్కో డీఈ అరెస్ట్



- ముత్యం వెంకటరమణ నివాసంలో ఏసీబీ సోదాలు
- 2.09 కిలోల బంగారం, 3 కార్లు, బ్యాంకు ఖాతాల్లో రూ.52.02 లక్షల నగదు గుర్తింపు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. మాదాపూర్‌లోని డీఈ ఇల్లు సహా 8 ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సోదాలు చేశారు. ఆయనకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో నాలుగు ఫ్లాట్లు, కూకట్‌పల్లిలో మూడంతస్తుల వాణిజ్య భవనం, గుట్టల బేగంపేటలో ఐదంతస్తుల భవనం ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో 2.09 కిలోల మిగతా 2లో..



## ఇప్పట్లో ఇరాన్‌ను వదిలే ప్రసక్తే లేదు

- ఆ దేశం మళ్లీ అణుకార్యక్రమం మొదలుపెట్టాలని చూస్తోంది
- నతాంజ్ అణు కేంద్రం వద్ద పికాక్స్ పర్వతంపై భీకర దాడులు చేస్తాం
- నౌకలపై దాడి చేస్తే.. ఇరాన్‌లోని వంతెనలపై విరుచుకుపడతాం : ట్రంప్
- టెహ్రాన్‌పై అమెరికా భీకర దాడులు..
- ప్రతిగా ఖతార్, కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల వర్షం

9లో..

### 'పీఎంజే' తరహాలో కరీంనగర్‌లో
## మరో భారీ దోపిడీ

మంగళవారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి చొరబడిన ఆరుగురు దుండగులు

కత్తులు, తుపాకులతో బెదిరించి.. కుటుంబసభ్యులను బంధించి..66 తులాల బంగారం, రూ.21 లక్షల నగదు అపహరణ

రెండు ద్విచక్రవాహనాలను సైతం అపహరించిన ఆగంతకులు

ఘటనాస్థలిని పరిశీలించిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**కరీంనగర్ టౌన్(జనంసాక్షి):** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన భారీ దోపిడీ నగరంలో సంచలనం సృష్టించింది. ఆరుగురు దుండగులు మాస్కులు, గ్లౌజులు ధరించి ఓ ఇంటిలోకి చొరబడి తుపాకులు, మారణాయుధాలతో కుటుంబ సభ్యులను బెదిరించి సుమారు 66 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి, రూ.21 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం.. భగత్‌నగర్‌లో నివాసముంటున్న అజ్మత్ అలీ కుటుంబంతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మంగళవారం అర్ధరాత్రి ఆరుగురు దుండగులు మిగతా 2లో..



## పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం

అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే

గాంధీభవన్ ప్రజలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖాముఖి

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.మీ సేవ కేంద్రాలు, వాట్సాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్త దరఖాస్తులతోపాటు పాత దరఖాస్తులను కూడా సమగ్రంగా పరిశీలించి మిగతా 2లో..

### అవసరమైతే..
## ఢిల్లీ వెళ్తా ..

**ఆందోళనల్లో పాల్గొంటా: మమత**

**కోల్‌కతా(జనంసాక్షి):** దేశ రాజధాని నగరంలో 'చలో పార్లమెంటు' నిర్వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) విద్యార్థులపై పోలీసుల చర్యను ఖండించిన పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. అవసరమైతే దిల్లీకి వెళ్లి వారి ఆందోళనలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆందోళనకారులు పార్లమెంటు భవనానికి మిగతా 2లో..



## మాకంత సమయమూ లేదు.. మీ సమయమూ వృథా చేసుకోవద్దు

తరఫు న్యాయవాది ప్రస్తావించగా.."మాకు వీడియోలు చూసే సమయం లేదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు దిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి.

**.నిరసనలు పబ్లిసిటీ కోసం చేస్తారా..!:హైకోర్టు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన చలో పార్లమెంట్ ర్యాలీలో ఆందోళనకారులపై లాఠీ ఛార్జ్ చేసినందుకు దిల్లీ హైకోర్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పబ్లిసిటీ కోసం విద్యార్థులు నిరసనల్లో పాల్గొన్నారని పోలీసులు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. సీసీ కెమెరాలు, పోలీసుల బాడీ కెమెరాల ఫుటేజీలు.. నిరసనలకు సంబంధించిన అన్ని డిజిటల్ రికార్డులను భద్రపరచాలని ఆదేశించింది. నిరసనకారులతో అమానుషంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నాలుగు వారాల్లోగా పోలీసులు స్పందించాలని పేర్కొంది. సీజేపీ ఆందోళనకారులపై పోలీసుల లాఠీఛార్జ్‌ను సవాల్ చేస్తూ నమోదైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో విచారణను సెప్టెంబర్ 11కు వాయిదా వేసింది. శాంతియుతంగా నిరసన చేస్తున్న తమపై పోలీసులు బాష్పవాయు ప్రయోగం, లాఠీ ఛార్జి చేయడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయని ఆందోళనకారులు తమ పిటిషన్‌లలో పేర్కొన్నారు. పోలీసులే తమపై దాడి చేశారు కాబట్టి ఈ ఘటనపై దర్యాప్తును వారికి అప్పగించకుండా ప్రత్యేక దర్యాప్తు దళాన్ని (సామి)ను ఏర్పాటు చేయాలని కోరారు.

## డిమాండ్లు ఆమోదిస్తేనే దీక్ష విరమిస్తా

కూడా కోరతానన్నారు. "కేంద్ర మంత్రులు ఆసుపత్రికి వచ్చి నన్ను పరామర్శించి, దీక్ష విరమించాలని కోరినందుకు ధన్యవాదాలు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అవసరమైన పరిహారం ఇవ్వడం, విద్యాశాఖ మంత్రి రాజీనామా అంశాన్ని పరిశీలించడంతో పాటు పార్లమెంటులో దీనిపై చర్చ జరపాలన్న విజ్ఞప్తికి మీరు సానుకూలంగా స్పందించారు. మీ తర్వాత.. దీక్ష విరమించాలని కోరుతూ వివిధ పార్టీలకు చెందిన 65 మంది ఎంపీలు నాకు లేఖ రాశారు. వారితో నేను ఏకీభవించాను" అని వాంగ్‌చుక్ పేర్కొన్నారు."నేను కూడా జీవించాలని అనుకుంటున్నా. విద్యార్థుల కోసం ఎంతో చేయాల్సి ఉంది. అయితే, ఈ ఉద్యమం ఎవరికోసమైతే మొదలైందో, వారి జీవితాలను పణంగా పెట్టి అలా చేయలేను. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారిపై ఎటువంటి చర్యలు, చట్టపరమైన కేసులు, వేధింపులు ఉండవని హామీ ఇస్తే దీక్షను విరమిస్తా. లేదంటే నిరవధిక దీక్షను కొనసాగించాల్సి వస్తుంది. నిరసనకారులపై ఇకపై పోలీసు బలప్రయోగం ఉండదని ఆశిస్తున్నా" అని వెల్లడించారు.

## నీట్‌పై చర్చకు సిద్ధం

పార్లమెంటులో సమాధానాలు ఇస్తామన్నారు. అయితే, విపక్షాలు చీటికిమాటికి గోల్‌పోస్టు మారుస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్ గురించి తమకు పూర్తి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయ్యాయని, యూపీఏ హయాంలో ఎన్నో రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగాయని నడ్డా వ్యాఖ్యానించారు. విద్యార్థుల అంశాన్ని రాజకీయంగా వాడుకోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కొన్ని అంశాలనే టార్గెట్‌గా చేసుకుని రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగిందని, తెలంగాణలో ఇంటర్ పేపర్, కేరళ, తమిళనాడులో పేపర్లు లీక్ అయ్యాయని తెలిపారు. బంగాల్, కర్ణాటకలోనూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం బాధ్యయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనల నేపథ్యంలో నడ్డా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలియజేశారు.విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని నీట్ పేపర్ లీక్ ఆందోళనకారులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను విపక్షాలు కీలుబొమ్మలుగా చేసుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. నీట్ లీకేజీ, విద్యార్థుల నిరసనలపై పోలీసు చర్య వంటి అంశాలపై ప్రతిపక్ష పార్టీలు కేంద్రంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించింది. "విద్యార్థులే మాకు తొలి ప్రాధాన్యం. పేపర్ లీక్ విషయంలో సభలో సమగ్రచర్చ జరగాలని కోరుకుంటున్నాం" అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు."ప్రతిపక్ష నేతలు చెప్పాలనుకున్న విషయాలను చర్చ సందర్భంగా తెలియజేయొచ్చు. షరతులు విధిస్తున్నారంటే చర్చ అవసరం లేదని అర్థం. ప్రభుత్వం ఏ సమస్య నుంచి పారిపోదు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే పనులను ప్రజలకు తెలియజేయడం మన బాధ్యత. కాంగ్రెస్ పార్టీ కావొచ్చు.. అఖిలేష్ యాదవ్ కావొచ్చు.. ప్రతి ఒక్క సభ్యుడు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయొచ్చు. నిబంధనల ప్రకారమే చర్చ ఉంటుంది" అని స్పష్టం చేశారు.

స్పీకర్‌ను కలిసిన ధర్మేంద్ర ప్రధాన్..

నీట్ పేపర్ లీక్‌పై చర్చకు సిద్ధం అని ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఈ భేటీ జరిగింది. మరోవైపు చర్చ జరిగే తేది, వ్యవధిని నిర్ణయించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను ప్రభుత్వం కోరింది.

## చర్చించాలనుకుంటే మా వద్దకే రండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమతో చర్చలు జరపాలనుకుంటే ప్రభుత్వ ప్రతినిధులే తమ వద్దకు రావాలని, తమ షరతులకు కట్టుబడి ఉండాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా కొనసాగుతున్న తమ ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే మరింత భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) హెచ్చరించింది. జులై 20న నిర్వహించిన నిరసన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అవసరమైతే లక్షలాది మంది యువత దిల్లీకి తరలివస్తారని పార్టీ ప్రతినిధి అశుతోష్ రాంకా తెలిపారు. ఇదే సమయంలో దిల్లీలో జరిగిన ఆందోళనల నేపథ్యంలో పోలీసులు మొత్తం 10 ఎఫ్?ఐఆర్?లు నమోదు చేశారు. మరోవైపు నిరసనల నేపథ్యంలో అదనపు భద్రతా బలగాలను మోహరించారు. ఇదిలా ఉండగా భద్రతా కారణాల దృష్ట్యా, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు జన్‌పథ్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్లను మూసివేశారు.తమ ఉద్యమాన్ని స్వాతంత్ర్యం తర్వాత దేశంలో జరిగిన అతిపెద్ద ప్రజా ఉద్యమంగా అశుతోష్ రాంకా అభివర్ణించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ఈసారి మరింత భారీ స్థాయిలో నిరసనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. యువత ఆవేదనను కేంద్రం నిర్లక్ష్యం చేస్తే తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. తమ ఆందోళనలు పూర్తిగా శాంతియుతంగానే సాగుతున్నాయని స్పష్టం చేశారు.

# విద్యార్థులపై లాఠీఛార్జిపై ప్రధాని క్షమాపణ చెప్పాలి


ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బ్జడెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు

## రాహుల్ అరెస్టుపై భగ్గుమన్న భారత్

ఎంపీలను గౌరవించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులతో కొట్టించారని మండిపడ్డారు. అన్యాయాన్ని ప్రశ్నించకుండా విద్యార్థులు, ప్రతిపక్షాలను అడ్డుకోవడానికే వారు ఇటువంటి చర్యలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పోరాటాన్ని అణచివేయాలని చూస్తే.. లక్షలాది మంది ప్రజలు రోడ్లపైకి వస్తారని ఖర్గే హెచ్చరించారు.విద్యార్థులపై దాడిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష ఎంపీలు నేడు నలుపు రంగు దుస్తుల్లో లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాతో పాటు పలువురు విపక్ష ఎంపీలు నలుపు రంగు దుస్తుల్లో పార్లమెంట్ బయట నిరసన తెలిపారు. విద్యార్థులు లేవనెత్తుతోన్న న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆందోళన చేస్తోన్న అమ్మాయిల దుస్తులు చించేస్తారా..? అని ప్రశ్నించారు అమ్మాయిల దుస్తులు చించేశారు. విద్యార్థులను లాఠీలతో కొట్టారు. దాంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారితో ఇలాగేనా ప్రవర్తించేది..? ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. దీనిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలి. విద్యార్థుల సమస్యపై బయట మాట్లాడుతోన్న ప్రధాని.. సభలో ఎందుకు ప్రకటన చేయడం లేదు. మోదీ సభలో మాట్లాడేందుకు నిరాకరించడం వల్లే.. మేం ఆయన నివాసం వద్ద నిరసన చేయాల్సి వచ్చింది" అని అఖిలేశ్ అన్నారు.నీట్ పేపర్ లీక్‌పై చర్చించేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడంపై అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించారు. దీంతో అఖిలేశ్ అసహనానికి గుర య్యారు. "మీరు కాంగ్రెస్‌ను అనుమతించారు. భాజ పా నేతలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. మరి మా సంగతేంటి..? ఏదైనా ఒప్పందం కుదిరిందా..? పేపర్ లీకేజీ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, భాజపా సమస్య కాదు. అది విద్యార్థులకు సంబంధించిన సమస్య" అని వ్యాఖ్యలు చేశారు. రాహుల్ సహా పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రధాని నివాసం వద్ద నిరసనలో పాల్గొన్న ఆయన ఆ తరహా వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. కాంగ్రెస్‌తో ఆయన విభేదించారా? అనే ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, దీనిపై ఆయన స్పష్టతనిచ్చారు. తాను వాడిన 'డీల్' అన్న పదం.. ప్రభుత్వం, స్పీకర్ గురించేనని వెల్లడించారు. విపక్షాలు ఐకమత్యంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

## మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన



కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

## ప్రధాని ఇంటిముందు ధర్నాకు భాజపా కౌంటర్ ధర్నా

హైదరాబాద్,జులై22(జనంసాక్షి): కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, రాజనర్సింహ, పొంగులేటి అజారుద్దీన్, బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

## 'పీఎంజే' తరహాలో కరీంనగర్‌లో మరో భారీ దోపిడీ

ఇంటి ప్రహరీలోకి ప్రవేశించారు. ముందుగా ఇంటి ఆవరణలో ఉన్న లైట్లను ఆఫ్ చేసిన దుండగులు, బయటకు వచ్చిన అజ్మత్ అలీపై ఒక్కసారిగా దాడి చేసి నోరు మూసి ఇంట్లోకి లాక్కెళ్లారు.అనంతరం ఇంట్లో ఉన్న ముగ్గురు మహిళలను తుపాకులతో బెదిరించి వారి నోటిలో గుడ్డలు కుక్కి బంధించారు. ఎవరూ ప్రతిఘటించకుండా భయాందోళనకు గురిచేసిన అనంతరం ఇంట్లోని బీరువాలను తెరిచి అందులో ఉన్న 66 తులాల బంగారు నగలు, 10 తులాల వెండి వస్తువులు, రూ.21 లక్షల నగదును అపహరించినట్లు సమాచారం.దోపిడీ అనంతరం దుండగులు అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి రెండు ద్విచక్ర వాహనాలను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. బైపాస్ రోడ్డువైపు వెళ్లినట్లు సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.ఘటన విషయం తెలియగానే వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్వయంగా ఘటనాస్థలిని సందర్శించి బాధితులను పరామర్శించారు. సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.నగరం నడిబొడ్డున తుపాకులతో ఇంత భారీ దోపిడీ జరగడం స్థానికుల్లో తీవ్ర భయాందోళనకు గురిచేసింది. నిందితులను త్వరలోనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## అవసరమైతే ఢిల్లీ వెళ్తా ..

దగ్గరగా వస్తుండగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కారును వెనక్కుతిప్పి వెళ్లిపోయారన్నారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన టీఎంసీ అమరవీరుల వార్షిక ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. భాజపా సర్కారు హిట్లర్, స్టాలిన్‌ల నిరంకుశత్వ హద్దులను సైతం దాటిందని ధ్వజమెత్తారు.సొంత పార్టీలో తిరుగుబాటుదారులను ప్రస్తావిస్తూ.. ఆ ద్రోహులను ఎప్పటికీ మళ్లీ పార్టీలో చేర్చుకోబోనని స్పష్టం చేశారు. ఎంత ఎక్కువమంది వెళ్లిపోతే, నాకు అంత సంతోషమే. ఆయా స్థానాలను యువ నాయకులతో భర్తీ చేసుకుంటా" అని పేర్కొన్నారు.

## 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం

హైదరాబాద్,జులై22(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది.రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు."లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేంద్రప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు" అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు.ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అ:ఃూఇలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## భాజపా, బీఆర్ఎస్ తప్పులు ప్రశ్నిస్తున్నందుకే నాపై కుట్ర

కొడంగల్(జనంసాక్షి): భాజపా, బీఆర్ఎస్ తప్పులు ప్రశ్నిస్తున్నందుకే తనపై కుట్ర చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ రెండు పార్టీలు వేరు కావొచ్చు.. కానీ, వాళ్ల లక్ష్యం మాత్రం ఒక్కటేనన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణపై బీఎల్ఏలతో కొడంగల్‌లో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "ప్రతి పేదవాడికి మంచి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ క్రమంలో రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవట్లేదు. కొడంగల్‌లో నేరుగా ఎదుర్కోలేక నన్ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్‌కు ఓట్లు వేసినవాళ్ల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొడంగల్‌లో దెబ్బతీస్తే రాష్ట్ర స్థాయికి రాలేదు అని ఆలోచిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 90శాతం కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తారు. వారి ఓట్లు తొలగిద్దామని చూస్తున్నారు. కొడంగల్‌లో 78శాతం ఓటర్లు నమోదు చేసుకున్నారు. మిగిలిన 22 శాతం ఓట్లు నమోదు చేయించాలి. మిగిలిన ఓటర్లతో బీఎల్ఏలు ఎస్ఐఆర్ నమోదు చేయించాలి. బీఎల్‌వోలు ప్రభుత్వాధికారులు.. బీఎల్ఏలు పార్టీ కార్యకర్తలు. ఓటరు జాబితాలో లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావు. గతంతో పోలిస్తే సరైన వివరాలు లేకపోతే పక్కన పెడతారు. అనుమానాస్పదంగా ఉంటే సరైన ఆధారాలు చూపి ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే వారి జాబితా ఇప్పుడే నిర్ణయం అవుతోంది. కొడంగల్ నియోజకవర్గంలో అర్హులైన వారి ఓట్లు తొలగించేందుకు వీల్లేదు. ఈనెలాఖరు నాటికి కొడంగల్‌లో 100శాతం ఎస్ఐఆర్ పూర్తి చేయాలి. నాపై కుట్రలు చేసేవాళ్లను మీరే దెబ్బకొట్టాలి" అని సీఎం అన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం

అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యాప్‌లో వస్తున్న చిన్న, చిన్న సమస్యలను సరిదిద్దుతామని ప్రకటించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని, ఇప్పుడు ప్రతి వారం గాంధీభవన్‌లో మంత్రులు నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.భూములు, ఇండ్లు, రెవెన్యూ, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను బాధితులు నేరుగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే జిల్లా కలెక్టర్లకు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వంలో మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి వారం ఒక మంత్రి గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తూ నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గత ప్రభుత్వ నగరాలకు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించడం వల్ల ఉపాధి అవకాశాలు దూరమవుతాయనే కారణంతో చాలా మంది పేదలు ఆ ఇళ్లలో నివసించలేదని పొంగులేటి ఆరోపించారు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా పేదలు పుట్టి పెరిగిన ప్రాంతంలోనే నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టవర్లలో నిర్మించే ఫ్లాట్ల విలువ రూ.40 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉంటుందని, లబ్ధిదారులకు ఇంటి స్థలంలో వాటా హక్కు కూడా కల్పిస్తామని వివరించారు.



## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెడ్కో డీఈ అరెస్ట్

బంగారం, 3 కార్లు, బ్యాంకు ఖాతాల్లో రూ.52.02 లక్షలున్నట్లు తేలింది. ఆయన భార్య పేరుపై నాలుగు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ఉన్నట్లు గుర్తించారు. ఆ సంస్థల 10 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలకు శంకుస్థాపన

▫ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**వరంగల్ బ్యూరో, జూలై 22 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నూతనంగా నిర్మాణం చేసిన కలెక్టరేట్ భవనం వెనకాల బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 33/11 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, ఇంటర్ లింక్ లైన్లో ప్రారంభాలను చేశారు. సుమారు 10.2 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణాలు జరుగుతాయని సంబంధిత అధికారులకు తెలిపారు. దీంతో ఓవర్ లోడ్ రిలీఫ్ పొందే సబ్‌స్టేషన్లు ఫోర్ట్ రోడ్, ఏజె మిల్స్ ఉన్నట్టు తెలిపారు. మొత్తం 21 460 వినియోగదారులు లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రధానంగా లబ్ధి పొందే ప్రాంతాలు చింతల్, ఆదర్శనగర్, యాకూబ్ పుర, టిఆర్టి కాలనీ, రామ్కి, గ్రీన్ మార్కెట్, ఎస్ఆర్టి కాలనీ, ఈస్ట్ ఫోర్త్, జాన్తీరీలు, వరంగల్ కలెక్టరేట్, స్తంభంపల్లి మిడిల్ ఫోర్ట్ కొంచెం మైదాన్ మండి బజార్ మొదలైనవి ఉంటాయి. వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తును అందించడంలో ప్రస్తుతం డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేసిన సబ్ స్టేషన్ లో ఎంతో ఉపయోగపడనున్నాయి. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్పాయ్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్రానికి జవాబుదారీతనం లేదు

▫ ఐదేళ్లలో మూడుసార్లు నీట్ పేపర్ లీక్

▫ బీజేపీ మాజీ నేత కే అన్నామలై



**చెన్నయ్ (జనంసాక్షి) :** ఐదేళ్లలో మూడుసార్లు నీట్ పేపర్ లీకైందని తమిళనాడుకు చెందిన మాజీ బీజేపీ నేత కే అన్నామలై ఆరోపించారు. అయినప్పటికీ ఎవరికీ జవాబుదారీతనం లేదని ఆయన విమర్శించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా భారీ నిరసనలు వెల్లువెత్తడంపై అన్నామలై స్పందించారు. ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఈ వైద్య ప్రవేశ పరీక్ష భారతదేశం అంతటా ఏకరూపతను తీసుకువస్తుందని, పేద వర్గాల విద్యార్థులకు వైద్యులు అయ్యే అవకాశం కల్పిస్తుందని తాను విశ్వసించడంతో నీట్‌కు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. అయితే గత ఐదేళ్లలో నీట్ యూజీ ప్రశ్నాపత్రం మూడుసార్లు లీక్ అయ్యిందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఎటువంటి బాధ్యతాయుతమైన చర్యలూ తీసుకోలేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. దీనివల్ల విద్యార్థుల దృక్పథంలో మార్పు వచ్చిందని, తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి వారు రోడ్లపైకి వచ్చారని పేర్కొన్నారు.

కాగా, ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ఒక ప్రాథమిక హక్కు అని అన్నామలై స్పష్టం చేశారు. అయితే పరిస్థితి ఉద్రిక్తంగా మారేంత వరకు నిరసనకారులతో చర్చలు జరపడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేసిందని ఆయన ప్రశ్నించారు. అలాగే స్వార్థ ప్రయోజనాలు గల వ్యక్తులు తమ నిరసనలను హైజాక్ చేయకుండా నిరోధించాల్సిన బాధ్యత విద్యార్థులకు, వారి నాయకులకు ఉందన్నారు. మరోవైపు విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అర్థవంతమైన చర్చలు జరుపాలని, పారదర్శకతను పాటించాలని అన్నామలై కోరారు. ప్రభుత్వం త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం చేస్తే ఉద్యమమే

▫ టీజీఎస్‌పీడీసీఎల్ ఎదుట మహాధర్నా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులకు నష్టం కలిగించేలా ప్రభుత్వం, యాజమాన్యం వ్యవహరిస్తే ఊరుకునేది లేదని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏఈజేఏసీ) హెచ్చరించింది. ఆర్టిజన్ కార్మికులకు అడ్జస్టింగ్ (ఏపీఎస్ఈబీ) సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట మాస్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో పనిచేసిన సుమారు 23,600 మంది కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించి బేసిక్ కేటాయించినప్పటికీ, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌కు బదులుగా 1947 నాటి ఐడీ యాక్ట్ స్టాండింగ్ ఆర్డర్స్ అమలు చేసి మోసం చేశారని మండిపడ్డారు. దీనికి నిరసనగా గతంలో జరిపిన సమ్మె సమయాన, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్యవర్తిత్వంతో ఏప్రిల్ 17న సమ్మె విరమించామని గుర్తుచేశారు. కానీ తమకు అన్యాయమే జరుగుతోందని, ఉన్నతాధికారులను కలిసినా సరైన సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆర్టిజన్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సరికాదని దుయ్యబట్టారు. ఆర్టిజన్ కార్మికులకు తక్షణమే ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, నిరసనలపై ప్రభుత్వం స్పందించక పోతే భవిష్యత్తులో సమ్మెకు వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్, టీవీఏఈజేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి, కో చైర్మన్ శ్రీధర్ గౌడ్, కన్వీనర్లు, సాయిలు, చంద్రారెడ్డి, కో-కన్వీనర్ చందర్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన సెల్‌ఫోన్ బ్యాటరీ

▫ ఆటలాడుతుండగా బ్యాటరీ పేలి బాలుడు మృతి



**చింతలమానేపల్లి, జూలై 22 (జనంసాక్షి) :** పాత సెల్‌ఫోన్ బ్యాటరీతో ఆటాడుతుండగా పేలడంతో బాలుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. బుధవారం రోజున చింతలమానేపల్లి ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం గూడెం గ్రామంలో పాడైపోయిన సెల్ ఫోన్ బ్యాటరీ పేలి గ్రామానికి చెందిన నికాడే గణేష్ సంధ్యల కుమారుడు నికాడే లోకేష్ (14) ఉదయం పాడైపోయిన ఎలక్ట్రానిక్ బ్యాటరీ మరియు ఇతర పరికరాలతో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశత్తు బ్యాటరీ పేలి నోటి భాగం పూర్తిగా పగిలిపోయాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో బాలుడు చనిపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఛలో పార్లమెంట్ హక్కుపై అమిత్‌షా దాడి

▫ పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణ రావు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఛలో పార్లమెంట్ హక్కుపై అమిత్‌షా దాడి చేస్తున్నాడని పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణ రావు అన్నారు. జులై 20, 2026న జరిగిన ఛలో పార్లమెంట్ విద్యార్థుల ఊరేగింపుపై మోడి ప్రభుత్వం విచక్షనా రహితంగా లాఠీ చార్జిని నిర్వహించిందని, టియర్ గ్యాస్ సెల్స్ మహిళలపై వికృతమైన దాడితో సభ్యసమాజం తలదించుకుంటున్నదని, చివరికి నిన్న సాయంత్రం రాహుల్ గాంధితోపాటు ప్రధాన కాంగ్రెస్ నేతలంతా మోడీ ఇంటి ముందు ధర్నా నిర్వహించడం మొత్తంగా నీట్ పేపర్ లీకేజ్ ఘటన వలన 23 మంది విద్యార్థుల ఆత్మహత్యలు, ఆ క్రమంలో సాగిన నిరాహార దీక్ష నిరసన హక్కు అయిన ఛలో పార్లమెంట్‌పై దాడిని ఖండిస్తూ కొనసాగిన కాంగ్రెస్ ధర్నాతో కనీసంగానైనా ప్రజల్లో ప్రతిపక్ష పార్టీ ఉందనే స్పృహ వెలువడిందని తెలిపారు. ఇప్పుడు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య దాడులుగా కొనసాగుతూ అసలు విషయం కనుమరుగై సూచనలు కనిపిస్తున్నాయని, ఇప్పటికే సోనం వాంగ్‌చుక్‌ను చైనా ఏజెంట్ అని ఆ ఉద్యమాన్ని బలపరుస్తున్న ప్రకాశ్ రాజ్, సినీ నటి షబానా హాజ్మి, నసీరుద్దీన్‌షా, ఇంకా కొంత మంది ప్రముఖులు బుద్ధి జీవులందరిని చైనా ఏజంట్లని అర్బన్ నక్సల్ అని ప్రచారం చేస్తూ ఉద్యమ బలాన్ని తగ్గించే విధంగా బిజెపి పార్టీ ఆర్ఎస్ఎస్ వాళ్ళు ప్రకటనలు చేస్తున్నారు. కాని విద్యార్థి లోకం మీ ఇంట్లో ఎవరైనా పేపర్ లీకేజ్ వలన ఆత్మ హత్య చేసుకుంటే ఆ పరిస్థితి మీ ఇంట్లో తెలిసేదని చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారని తెలిపారు. మరొక వైపు పేపర్ లీక్ విషయంలో ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాలని మంత్రులు బాధ్యత వహించాలని కొనసాగిన శాంతియుత పార్లీమెంటు ఊరేగింపుపై అత్యంత అమానుషమైన లాఠీ చార్జి కొనసాగించడం ఆ లాఠీలకు మేకులు కూడా పెట్టుకొని రావడం, ఇది నిజంగా ఒక ప్రజాస్వామిక దేశమా అని అనుమానం వస్తోందని తెలిపారు. నిజాయితీగా నిబద్ధతతో నీట్ ప్రవేశ పరీక్షను నిర్వహించగలిగితే విద్యార్థులకు ప్రజలకు విశ్వాసం కలిగితే లోపాలు లేకుండా జరిగినట్లయితే 23 మంది విద్యార్థులు తమ జీవించే హక్కును రద్దు చేసుకునేవాళ్ళు కాదని, ఆ 23 మంది ప్రాణాల గురించి ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లయినా లేదని, ఆ మరణాలకు ఎవరు బాధ్యత వహించాలని అన్నారు. హక్కుల సంఘం మాట్లాడినట్లయితే మొత్తం మోడి అమిత్‌షాల, ధర్మేంద్ర ప్రధాన్‌లతో సహ అందరూ రాజీనామా చేయాలని, సమాజంలో వైద్య వృత్తికి ఉన్నటువంటి ప్రాధాన్యత గౌరవం మరే వృత్తికి లేదని, దేవుని తరువాత దేవునిగా ఇచ్చే గౌరవాన్ని పొందగలుగుతున్నారని, సమాజం ఇస్తోందని, అలాంటి వైద్య విద్యార్థులను పరోక్షంగా హత్య చేసిన వాళ్ళకు నైతికంగా పాలన చేసే హక్కు ఎలా ఉంటుందని మనం భావిస్తామని, ఇప్పుడు మళ్ళీ రాహుల్ గాంధీ ఎంట్రీ అయ్యాక ఇది అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య జరుగుతున్న గొడవగా మార్చకుండా ఇది ఒక విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే విధంగా అందులో భాగమైన అర్హత పరిక్షల పట్ల ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించే విధంగా బాధ్యత పడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడంలో భాగంగా జరుగుతన్న ఆందోళనకు పూర్తి మద్దతు ప్రకటిస్తూనే విద్యావైద్యాలను ప్రైవేటీకరించకుండా అన్ని కూడా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగితేనే ఇటువంటి లోపాలు జరగవని విద్యార్థుల జీవించే హక్కు కాపాడబడుతుందని ప్రకటిస్తున్నామని తెలిపారు.




## ఎంపీ డాక్టర్ కడియం కావ్య నిరసన

**వరంగల్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈ సందర్భంగా నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను సహించబోము అన్నారు. పేపర్ లీకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## అడుప మహేష్ కుటుంబానికి మంత్రి కొండా సురేఖ పరామర్శ



**వరంగల్ ఈస్ట్, జూలై 22 (జనం సాక్షి) :** వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఎనుమాముల 14వ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన పెట్రోల్ దాడిలో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త అడుప మహేష్ కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మహేష్ కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మంత్రి వెంట వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయుబ్, రాష్ట్ర యువ నాయకులు గోపాల నవీన్ రాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదోళ్లకు మెరుగైన వైద్య సేవలు అందాలి..

▫ ఆధునిక పరికరాలు కొరకు ప్రతిపాదనలు పంపాలి..

▫ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పేదోళ్లకు మెరుగైన వైద్య సేవలు అందాలని, మెరుగైన వైద్య సేవలకు అవసరమైన ఆధునిక పరికరాలు కొరకు ప్రతిపాదనలు పంపాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కోరారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాళీ పోస్టులు నింపాలని, డిప్యుటేషన్ పై వెళ్లిన సిబ్బందిని తిరిగి రప్పించాలని కమిటీ సమావేశం తీర్మానం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న లోపాలను సరిచేయాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిని 100 నుండి 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు పంపినున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రసూతి, ఆర్థో, ఆప్తమాలజీ, అనస్థీషియో, డెంటల్, రేడియాలజీ, అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ సేవలకు అవసరమైన పరికరాలు, సెంట్రల్ ఆక్సిజన్, రక్త నిల్వల గది, సిబ్బంది కొరత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనస్థీషియో 8 పోస్టులకు ఇద్దరు మాత్రమే ఉన్నారని, వైద్యుల కొరత వల్ల సేవలకు ఇబ్బందులు వస్తున్నాయని వైద్యులు తెలిపారు. అలాగే గైనకాలజీ సిబ్బంది 8 మంది ఉండాల్సి ఉండగా ఇద్దరు ఉండటం వల్ల సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి నెల ఎన్ని ప్రసవాలు, ఆపరేషన్లు జరుగుతున్నాయని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నెలవారీగా 190 ప్రసవాలు జరుగున్నాయని వైద్యులు తెలిపారు. ప్రసవ సమయంలో పర్యవేక్షణ చేసేందుకు అనస్థీషియా వైద్యులు అవసరం ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రి సేవలకు బ్లడ్ బ్యాంక్ సేవలు చాలా కీలకమని తెలిపారు. బ్లడ్ బ్యాంక్ 24 గంటలు నడుస్తూనే ఉండాలని తెలిపారు. విద్యుత్తు అంతరాయం ఏర్పడితే తక్షణమే విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు. అంతరాయం లేకుండా నిరంత రాయంగా విద్యుత్తు సరఫరా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అంబులెన్స్ లు మరమ్మతులు చేపించాలని సూచించారు. అలాగే అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎం ఆర్ ఐ సేవలకు టెక్నీషియన్ నియామకానికి ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో యూడిఐడి రూము ఏర్పాటు చేయాలని, ఆయా విభాగాల సేవలకు అవసరమైన పరికరాల కొరకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రధాన వైద్యశాల పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఆసుపత్రి ఉప పర్యవేక్షకులు డా వెంకటరత్నం, అన్ని విభాగాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోతి కరిచి వ్యక్తికి తీవ్ర గాయాలు




**పాలకుర్తి, జూలై 22 (జనంసాక్షి) :** మండల కేంద్రానికి చెందిన పెను గొండ బిక్షపతి అనే వ్యక్తిని కోతి కరవగా, తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జరిగింది. బాదితుడు బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ముందు కూర్చొని ఉండగా ఇంటిపై నుంచి దూకి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గట్టిగా అరుస్తుండడంతో ఇంటి పక్కన వారు వచ్చి కోతిని కర్రలతో వెళ్లగొట్టారు. రక్తస్రావంతో ఉన్న బిక్షపతిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎం జీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## గ్రానైట్ బండలు దింపుతుండగా ప్రమాదం

▫ ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలు







**నెక్కొండ జూలై 22 (జనం సాక్షి):** నెక్కొండ మండలం కేంద్రంలోని చిన్న కొర్పోలు గ్రామ పరిధిలో బొలెరో వాహనం నుండి గ్రానైట్ బండలు దింపుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మండలంలోని రామన్నకుంట తండాకు చెందిన కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఇస్లావత్ మోహన్‌పై గ్రానైట్ బండ పడటంతో అతని కాలు విరిగింది. అలాగే రామచంద్రు, భాస్కర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించగా, సమాచారాన్ని అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పైలెట్ వైనాల నాగరాజు, ఈఎంటీ ప్రవీణ్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## మోకాల్లో లోతు బుడద స్కూల్ పిల్లలకు నరకయాత్ర



**నెక్కొండ జులై 22 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలోని రామనకుంట తండా గ్రామపచాయతీ లో రేసుల బోర్డు తండా, వెళ్లే ప్రధాన రహదారిపై బురద మయంగా మారిన పట్టించుకోని పలకులు స్కూల్ పిల్లలకు చాలా ఇబ్బంది పడుతున్న బురదలో దిగబడుతూ స్కూల్ కి వెళ్లాల్సిన పరిస్థితి , కనీసం పట్టించుకోన పరిపాలకులు అధికారులు స్కూల్ కెళ్లే పిల్లల కోసమేనా మొరం పోయించి బురద లేకుండా చూస్తారని పిల్లలు వేడుకుంటున్నారు, ద్విచక్ర వాహనదారులు లోపలే దిగబడే బుడదలో గాయాల పాలవుతున్నారు, ఆర్ అండ్ బి అధికారులు సంబంధిత అధికారులైన సమస్యను పరిష్కారం చూపుతానని వేడుకుంటున్నారు.

## పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు శారీరక పరీక్షల నిర్వహణ

▫ అర్హత పొందిన విద్యార్థులకు వసతితో కూడిన శిక్షణ తరగతులు

▫ అంది వచ్చిన అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి అని పిలుపు

▫ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్



**ములుగు ప్రతినిధి, జులై 22(జనంసాక్షి) :** రాబోయే పోలీస్ శాఖ నోటిఫికేషన్ కోసం ములుగు జిల్లా యువత కోసం ఉచిత వసతితో కూడిన శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా ఇట్టి ఉచిత శిక్షణ శిబిరం కోసం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో దరఖాస్తులు ఆహ్వానించగా, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు ములుగు జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకాన్ ఆదేశాల మేరకు అధికారులు శారీరిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇట్టి శారీరక పరీక్షలలో సఫలీకృతమైన వారికి ఉచిత వసతితో కూడిన శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ములుగు జిల్లా నిరుద్యోగ యువత ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని, తమ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సదానందం, ములుగు సీఐ సురేష్, ఆర్ఐ లు స్వామి, తిరుపతి, వెంకటనారాయణ, శ్రీకాంత్, ఆర్ఎస్ఐలు సిబ్బంది మరియు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

సంపాదకీయం

# రక్షకుల చేతుల్లోనే రక్తపు ముద్రలు..!

నీట్ పేపర్ లీక్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిన వేళ, న్యాయం కోరుతూ పార్లమెంట్ వైపు శాంతియుతంగా అడుగులు వేసిన యువతపై ఢిల్లీ పోలీసులు ప్రదర్శించిన క్రూరత్వం ప్రజాస్వామ్య చరిత్రలో మచ్చగా మిగిలిపోతుంది. ప్రశ్న అడిగినందుకు విద్యార్థులను శత్రువుల్లా తరుమడం, లాఠీలతో విరుచుకుపడడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, బారికేడ్ల వెనుక బంధించి బలప్రయోగానికి దిగడం రాజ్యాంగ విలువలపై జరిగిన ప్రత్యక్ష దాడి. ప్రజల పన్నులతో జీతాలు తీసుకునే రక్షక భటులు ప్రజల పిల్లలనే శత్రువులుగా చూడడం అత్యంత విషాదకరం.


నీట్ పేపర్ లీక్ అనేది కేవలం ఒక పరీక్షలో జరిగిన లోపం కాదు. అది దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతపై పడిన భారీ మచ్చ. పరీక్ష రాయడానికి ఏళ్ల తరబడి కష్టపడిన విద్యార్థుల కలలను కొందరి అవినీతి, ప్రభుత్వ వైఫల్యం ఛిద్రం చేశాయి. ఈ కుంభకోణం కారణంగా ఎన్నో కుటుంబాలు కన్నీరు మున్నీరయ్యాయి. కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన విషాద ఘటనలు దేశాన్ని కలచివేశాయి. అలాంటి సమయంలో బాధ్యులను శిక్షించాలని, విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేయడం నేరమా? అదే ప్రజాస్వామ్య స్ఫూర్తి కాదా?

మేకులు అమర్చిన కర్రలతో విద్యార్థులను కొట్టారన్న ఆరోపణలు, గాయాలతో విలవిల్లాడుతున్న యువత దృశ్యాలు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. తల్లికి ఫోన్ చేసి "నన్ను కొట్టారు... చాలా రక్తం వచ్చింది..." అంటూ ఏడ్చిన విద్యార్థి ఆర్తనాదం ప్రతి తల్లిదండ్రి గుండెను పిండేసింది. అలాంటి దృశ్యాలను కూడా "పబ్లిసిటీ స్టంట్"గా కొట్టిపారేయడం అధికార యంత్రాంగం ఎంత మానవత్వం కోల్పోయిందో చెప్పడానికి చాలు. తప్పు చేసిన వారిని కాపాడుతూ, ప్రశ్నించిన వారినే నిందితులుగా మలచే ప్రయత్నం అధికార అహంకారానికి పరాకాష్ట.

ఢిల్లీ హైకోర్టు పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం ఈ ఘటన తీవ్రతను చాటుతోంది. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన రాజ్యాంగబద్ధమైన హక్కు. ఆ హక్కును లాఠీలతో అణచివేయడం రాజ్యాంగానికే అవమానం. ఈ ఘటనపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపి, అధిక బలప్రయోగానికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. వారి భవిష్యత్తుపై నేరస్తుల ముద్ర వేయడం మరో అన్యాయం. ప్రభుత్వాలు విమర్శలను వినాలి, సమాధానాలు చెప్పాలి. కానీ ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం వేరే. ప్రశ్నిస్తే లాఠీ... నిరసన తెలుపితే కేసు... న్యాయం అడిగితే టియర్ గ్యాస్... ఇదే ప్రజాస్వామ్యమా? దేశ భవిష్యత్తైన యువతను శత్రువుల్లా చూసే పాలన ఎంతకాలం కొనసాగుతుంది? అధికార అహంకారం ప్రజాస్వామ్యాన్ని భర్తీ చేసే రోజు వస్తే, రేపు అదే లాఠీ ప్రతి పౌరుడి స్వేచ్ఛపై పడుతుంది. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిని కఠినంగా శిక్షించడం, పరీక్షా వ్యవస్థను పారదర్శకంగా మార్చడం, బాధిత విద్యార్థులకు న్యాయం చేయడం ప్రభుత్వ తొలి బాధ్యత. ప్రశ్నించే గొంతులను రక్తంతో ముంచడం కాదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ముందుగా యువత గొంతును కాపాడాలి. లేకపోతే చరిత్ర క్షమించదు... ప్రజలు మరచిపోరు.

# యువత ప్రశ్నిస్తే లాఠీనా? న్యాయం కోరితే నేరమా?

## బహుజన యువత పోరాటంపై అణచివేత ఇంకెన్నాళ్లు?



ఇటీవలి నీట్ పరీక్షల లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసింది. సంవత్సరాల శ్రమ, తల్లిదండ్రుల ఆశలు, విద్యార్థుల భవిష్యత్తు ఒక్కసారిగా అనిశ్చితిలో పడింది. ఇలాంటి పరిస్థితిలో బాధ్యత వహిస్తూ విద్యా వ్యవస్థపై నమ్మకం పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు మొదలైనవి. ఈ నేపథ్యంలో ప్రముఖ విద్య వేత్త, సామాజిక వేత్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష తలపెట్టారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష భగ్నం చేసే ప్రయత్నం చేశారు. వాంగ్‌చుక్ దీక్షకు కొనసాగింపుగా కాక్రిచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు, దళిత యువకుడ అభిజిత్ దీప్కే దీక్ష మొదలుపెట్టాడు. ఈ ఇరువురి దీక్షలు దేశంలో పోటీ పరీక్షల విశ్వసనీయతపై, ప్రభుత్వ జవాబుదారీతనంపై లక్షలాది మంది విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనకు ప్రతిబింబంగా నిలిచాయి. ఈ దీక్ష పౌర సమాజం నుంచి వ్యక్తమైన పలు ప్రశ్నలను సంధించింది. ముఖ్యంగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని, పరీక్షా నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలని, విద్యార్థుల భవిష్యత్తును రక్షించేలా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని విస్తృతంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశ విద్యా వ్యవస్థకు బాధ్యత వహిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత స్వీకరించి తన పదవికి రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే, విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కూడా పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యవస్థగత లోపాలపై ఢిల్లీలో "ఛలో పార్లమెంట్" పేరుతో యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అగ్రవర్ణ ఫాసిస్ట్ ప్రభుత్వాల అణిచివేత ఆందోళన కలిగిస్తుంది.

**ఈ అణివేత ఇంకెన్నాళ్ళు?**

దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని ప్రతి వేదికపై ప్రభుత్వాలు చెబుతుంటాయి. కానీ అదే యువత ఉద్యోగాలు, విద్య, పారదర్శకత, న్యాయం కోసం ప్రశ్నించినప్పుడు బలప్రయోగం, అరెస్టులు, నిర్బంధాలు ఎదురవుతుంటే మన ప్రజాస్వామ్యం ఏ దిశగా సాగుతోందనే మేధావులు ప్రశ్నలు లేవనెత్తున్నారు. ఏ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనకు స్థానం ఉండాలనే సూత్రం ముఖ్యమైనది. ఈ సందర్భంగా యువతపై జరిగిన పోలీసు చర్యల దృశ్యాలు దేశ ప్రజాస్వామ్య మనస్సాక్షిని కదిలించాయి. దేశ వ్యాప్తంగా అనేక ప్రశ్నలను లేవనెత్తాయి. ఈ ఘటనలు అణగారిన వర్గాల స్వరాన్ని అణచివేయడంతో పాటు సామాజిక–రాజకీయ ఆధిపత్యానికి ప్రతీకగా కనిపిస్తున్నాయి. ఈ మానవ హక్కుల ఉదంతంపై సుప్రీం కోర్టు స్పందించకపోవడం బాధాకరం. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందు కు సుప్రీంకోర్టు నిరాకరించింది. మాకు ఆ వీడియోలపై ఇంట్రెస్ట్ లేదని పేర్కొన్నది. ఈ సంఘటనపై సుప్రీం కోర్టు తీరు ఆందోళన కలిగిస్తుంది. గతేడాది ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్షత పెరుగుతున్న నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపకుల రక్షణ కోసం యూజీసీ రూపొందించిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలపై అగ్రకుల విద్యార్థుల పోరాటంపై దాఖలైన పిటిషన్లపై వెంటనే స్పందిస్తూ అత్యవసర స్టే విధించింది. ఈ పరిణామాలు రాజ్యాంగం ప్రతిష్ఠించిన సమానత్వం, సామాజిక న్యాయం సూత్రాల ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులకు సంబంధించిన అంశాల్లోనూ న్యాయవ్యవస్థ సమాన ప్రాధాన్యం ఇస్తున్నదా? అనే ప్రశ్నలు లేవనెత్తున్నాయి.

**నికార్సైన పోరాటమే విముక్తి మార్గం.**

రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నలను స్వీకరించడం, విమర్శలను గౌరవించడం, వాటిని ప్రజాభిప్రాయంగా ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగం. కానీ నేడు దేశ యువత అడుగుతున్న ప్రశ్నలపై ఉక్కుపాదం, వారి పోరాటంపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో యువత తమ భవిష్యత్తు గురించి మాట్లాడితే వారిని వినే ప్రభుత్వం కావాలా? లేక తమ స్వరాన్ని అణచివేసే వ్యవస్థ కావాలా?" అని నిర్ణయించుకోవాల్సిన సందర్భం ఇదీ. ఈ క్రమంలో ఢిల్లీలో "ఛలో పార్లమెంట్" పేరుతో నిర్వహించిన విద్యార్థుల నిరసన ర్యాలీపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండించిన బీసీ ఎస్సీ ఎస్టీ విముక్తి ఉద్యమ సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రజల్లో చర్చకు దారితీసింది. నీట్ పరీక్షల వివాదంపై న్యాయం కోరుతూ, తమ భవిష్యత్తు కోసం గొంతెత్తిన 90 శాతం బీసీ, ఎస్సీ యువతకు సమాధానం ఇవ్వాల్సింది పోయి, వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి తగిన చర్య కాదన్నారు. బహుజన యువతపై ఈ అణచివేత రాజకీయాలు ఇంకా ఎన్నాళ్లు? మా కన్నీళ్లు, మా రక్తం ఈ దేశ ప్రజాస్వామ్యానికి ఇంకెన్ని పరీక్షలు పెట్టాలి? అని ప్రశ్నించారు. ఈ క్రమంలోహొ ఆధిపత్య కులాల అరాచకాలపై అణగారిన కులాల నికార్సైన పోరాటమే నేటి బీసీ ఎస్సీ ఎస్టీ యువత కర్తవ్యం కావాలి. దీనికి భారత రాజ్యాంగ ఆయుధాలతో పూలే అంబేద్కర్ కాన్సిరాం ఆలోచనలు పునాది కావాలి.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# 'ఘోర పాపం"

*(ఒక ఆధునిక రాజ్యంలోని వ్యంగ్య గాథ)*

ఒకానొక కాలంలో "విశ్వగురు రాజ్యం" అనే ఒక గొప్ప సామ్రాజ్యం ఉండేది. ఆ రాజ్యంలో ప్రతి రోజు డప్పులు మోగేవి. రాజ్యం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైందని, అత్యంత నీతిమంతమైందని, అత్యంత పురాతన సంస్కృతి కలిగిందని రాజదర్బారు గాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గానం చేసేవారు. ఆ రాజ్యం లో విద్యను దేవతగా పూజించేవారు. పరీక్షలను యజ్ఞాలుగా చెప్పేవారు. పిల్లలకు "చదువుకుంటే భవిష్యత్తు బంగారమవుతుంది" అని ఉపదేశించేవారు. కానీ ఒక రోజు ఆ రాజ్యంలో విచిత్రమైన సంఘటన జరిగింది. దేశంలోని అత్యంత కీలకమైన పరీక్ష ప్రశ్నాపత్రం, పరీక్ష కేంద్రాలకు చేరకముందే కొంతమంది చేతుల్లోకి చేరింది. అది రహస్య పత్రం కాదు, దాదాపు బహిరంగ వ్యాపార వస్తువుగా మారిపోయింది. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల కష్టంతో సిద్ధమవుతుంటే, కొందరు డబ్బు, సంబంధాలు, మాఫియా బలంతో పరీక్షను ముందుగానే జేబులో పెట్టుకున్నారు.

వార్త బయటకు వచ్చింది. దేశం కుదేలైంది. అమ్మలు ఏడ్చారు. తండ్రులు తలలు పట్టుకున్నారు. విద్యార్థులు నిరాశలో మునిగిపోయారు. కొందరు తమ కలలు చిద్రమవడాన్ని తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నారు. ప్రజలు ఒక్కసారిగా ప్రశ్నలు అడగడం ప్రారంభించారు.

"ఇది ఎలా జరిగింది?"
"దీనికి బాధ్యులు ఎవరు?"
"ఎవరు రాజీనామా చేస్తారు?"
"ఎవరిపై చర్య తీసుకుంటారు?"

అందరూ రాజును చూశారు.

రాజు కొంతకాలం మౌనంగా ఉన్నాడు. ఆ తర్వాత తన దివ్యమైన స్వరంతో ప్రకటించాడు:
"ఇది ఒక ఘోర పాపం!"
రాజదర్బారు ఒక్కసారిగా చప్పట్లతో మార్మోగిపోయింది.
"అహా! ఎంత గొప్ప మాట!" "ఎంత ఆధ్యాత్మిక స్పందన!" "ఎంత సున్నితమైన హృదయం!"

రాజభక్తులు వెంటనే రాజు మాటలను శ్లోకాలుగా ముద్రించడం ప్రారంభించారు. కానీ ప్రజలు మాత్రం ఇంకా అయోమయంలోనే ఉన్నారు. ఒక విద్యార్థి ధైర్యం చేసి అడిగాడు:
"మహారాజా! పాపం అంటే సరే... కానీ నేరం ఎవరు చేశారు?"
రాజభక్తులు వెంటనే అతడిని దేశద్రోహిగా ప్రకటించారు.
మరొక విద్యార్థి అడిగాడు:
"పరీక్షను కాపాడలేకపోయినవారు తమ బాధ్యతను అంగీకరిస్తారా?" అతడిని విదేశీ కుట్రలో భాగమని ప్రకటించారు.
మరొకరు అడిగారు:
"లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నవారు పదవుల్లోనే కొనసాగుతారా?"
ఈసారి రాజదర్బారు కోపంతో వణికిపోయింది.
"ఎంత ధైర్యం! రాజును ప్రశ్నిస్తావా?"
"రాజును ప్రశ్నించడం అంటే రాజ్యాన్ని ప్రశ్నించినట్లే!" "రాజ్యాన్ని ప్రశ్నించడం అంటే దేశాన్ని ప్రశ్నించినట్లే!"
అలా ప్రశ్నలు అడిగిన విద్యార్థులు ఒక్కసారిగా "అశాంతి శక్తులు", "దేశ వ్యతిరేకులు", "రాజకీయ కుట్రదారులు"గా మారిపోయారు.

ఇంతలో విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు.
వారు పెద్దగా ఏమీ కోరలేదు.
"మాకు న్యాయం కావాలి." "మా భవిష్యత్తును కాపాడండి." "బాధ్యులపై చర్య తీసుకోండి."
అంతే. కానీ రాజ్యంలోని గస్తీ దళాలు ఈ నినాదాలను చాలా ప్రమాదకరంగా భావించాయి. విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉన్నాయి. పోలీసుల చేతుల్లో లాఠీలు ఉన్నాయి.
విద్యార్థుల వద్ద ప్రశ్నలు ఉన్నాయి. అధికారుల వద్ద పెల్లెట్లు ఉన్నాయి. విద్యార్థుల వద్ద కలలు ఉన్నాయి. వ్యవస్థ వద్ద గాయాలు మాత్రమే ఉన్నాయి. తలలు పగిలాయి. చేతులు విరిగాయి.
నెత్తురు కారింది. కానీ రాజదర్బారు మరుసటి రోజు ఇలా ప్రకటించింది: "రాజ్యంలో శాంతి భద్రతలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి."

ఇంకా విచిత్రం ఏమిటంటే, పేపర్ లీక్ చేసిన వారిని వెతకడం కంటే, పేపర్ లీక్ గురించి ప్రశ్నించిన వారిని వెతకడం వేగంగా జరిగింది.
ప్రశ్నాపత్రం బయటకు ఎలా వచ్చిందో



తెలియదు. కానీ నిరసనకు వచ్చిన విద్యార్థి పేరు, చిరునామా, సోషల్ మీడియా ఖాతా మాత్రం వెంటనే దొరికిపోయాయి.

రాజ్యంలోని మేధావులు మెల్లగా గుసగుసలాడటం ప్రారంభించారు. "ఇక్కడ నేరం కంటే ప్రశ్న ప్రమాదకరమైంది."
"వైఫల్యం కంటే విమర్శ పెద్ద అపరాధమైంది."
"బాధ్యత కంటే ప్రచారం ముఖ్యమైంది."
ఇంతలో రాజభక్తులు కొత్త సిద్ధాంతం చెప్పారు:
"పాపం జరిగిపోయింది. ఇప్పుడు ముందుకు సాగాలి." అప్పుడు ఒక వృద్ధ ఉపాధ్యాయుడు నవ్వుతూ అన్నాడు:
"ఒక విద్యార్థి పరీక్షలో కాపీ కొడితే జీవితాన్ని నాశనం చేస్తారు. కానీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినప్పుడు 'పాపం' అని చెప్పి ముందుకు సాగమంటారా?"

రాజదర్బారు మళ్లీ నిశ్శబ్దమైంది.
ఎందుకంటే ప్రతి సామ్రాజ్యం ఒక విషయం మరిచిపోతుంది. ప్రజలు కొంతకాలం మౌనంగా ఉండవచ్చు. భయపడవచ్చు. భరించవచ్చు.

కానీ వారి పిల్లల భవిష్యత్తుతో ఆటలాడితే, వారి కలలను ధ్వంసం చేస్తే, వారి కన్నీళ్లను "కర్మ"గా, వారి ఆగ్రహాన్ని "అశాంతి"గా చిత్రిస్తే.. ఒక రోజు వారు మళ్లీ ప్రశ్నించడం ప్రారంభిస్తారు. అప్పుడు చరిత్ర అడిగే ప్రశ్న చాలా సరళమైనది:
"పాపం జరిగిందని అందరికీ తెలుసు. కానీ దానికి బాధ్యత ఎవరు వహించారు?"
ఎందుకంటే ప్రజాస్వామ్యంలో పాలకులకు "పాప విమోచనం" అనే ప్రత్యేక హక్కు ఉండదు.
అక్కడ ఒకే ఒక ధర్మం ఉంటుంది.
అది.. జవాబుదారీతనం.
ఒకే ఒక ప్రాయశ్చిత్తం ఉంటుంది. అది..
ప్రజల ముందు బాధ్యత వహించడం.
మరియు ఒకే ఒక అంతిమ తీర్పు ఉంటుంది.
అది.. ప్రజల తీర్పు.

***(ఈ కథలోని పాత్రలు, సంఘటనలు, సంభాషణలు పూర్తిగా కల్పితం. కానీ పాఠకులకు ఇవి ఎక్కడో చూసినట్లుగా, విన్నట్లుగా అనిపిస్తే, దానికి రచయిత బాధ్యుడు కాదు, కాలమే బాధ్యుడు.)***

- మామిండ్ల రమేష్ రాజా,
7893230218

# ఛలో పార్లమెంట్ హక్కుపై అమిత్‌షా దాడి

జులై 20, 2026న జరిగిన ఛలో పార్లమెంట్ విద్యార్థుల ఊరేగింపుపై మోడి ప్రభుత్వం విచక్షనా రహితంగా లాఠీ చార్జిని నిర్వహించింది. టియర్ గ్యాస్ సెల్స్ మహిళలపై వికృతమైన దాడితో సభ్యసమాజం తలదించుకుంటున్నది. చివరికి నిన్న సాయంత్రం రాహుల్ గాంధితోపాటు ప్రధాన కాంగ్రెస్ నేతలంతా మోడీ ఇంటి ముందు ధర్నా నిర్వహించడం మొత్తంగా నీట్ పేపర్ లీకేజ్ ఘటన వలన 23 మంది విద్యార్థుల ఆత్మహత్యలు, ఆ క్రమంలో సాగిన నిరాహార దీక్ష నిరసన హక్కు అయిన ఛలో పార్లమెంట్‌పై దాడిని ఖండిస్తూ కొనసాగిన కాంగ్రెస్ ధర్నాతో కనీసంగానైనా ప్రజల్లో ప్రతిపక్ష పార్టీ ఉందనే స్పృహ వెలువడింది. ఇప్పుడు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య దాడులుగా కొనసాగుతూ అసలు విషయం కనుమరుగై సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సోనం వాంగ్‌చుక్‌ను చైనా ఏజెంట్ అని ఆ ఉద్యమాన్ని బలపరుస్తున్న ప్రకాశ్ రాజ్, సినీ నటి షబానా హాజ్మి, నసీరుద్దీన్‌షా, ఇంకా కొంత మంది ప్రముఖులు బుద్ధి జీవులందరిని చైనా ఏజంట్లని అర్బన్ నక్సల్ అని ప్రచారం చేస్తూ ఉద్యమ బలాన్ని తగ్గించే విధంగా బిజెపి పార్టీ ఆరఎసఎస్ వాళ్ళు ప్రకటనలు చేస్తున్నారు. కాని విద్యార్థి లోకం మీ ఇంట్లో ఎవరైనా పేపర్ లీకేజ్ వలన ఆత్మ హత్య చేసుకుంటే ఆ పరిస్థితి మీ ఇంట్లో తెలిసేదని చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. మరొక వైపు పేపర్ లీక్ విషయంలో ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాలని మంత్రులు బాధ్యత వహించాలని కొనసాగిన శాంతియుత పార్లీమెంటు ఊరేగింపుపై అత్యంత అమానుషమైన లాఠీ చార్జి కొనసాగించడం ఆ లీఠీలకు మేకులు కూడా పెట్టుకొని రావడం, ఇది నిజంగా ఒక ప్రజాస్వామిక దేశమా అని అనుమానం వస్తుంది.

2018లో భీమా కొరెగావ్ ఉపా కుట్ర కేసు సందర్భంగా ఆనాడున్న సుప్రీం కోర్టు జస్టిస్ చంద్రచూడ్ నిరసన అనేది ప్రజాస్వామ్యంలో ప్రెజర్ కుక్కర్ వంటిది అని దానిని ప్రభుత్వాలు ఆహ్వానించాలని అలా చేయడం ద్వారానే ప్రజాస్వామిక హక్కులను విలువలను ప్రభుత్వం నిలబెట్టగలిగే ఆస్కారం ఉంటుందని మాట్లాడారు. హక్కుల సంఘం మాట్లాడినట్లయితే మొత్తం మోడి అమిత్‌షాల, ధర్మేంద్ర ప్రధాన్‌లతో సహ అందరూ రాజీనామా చేయాలి. సమాజంలో వైద్య వృత్తికి ఉన్నటువంటి ప్రాధాన్యత గౌరవం మరే వృత్తికి లేదు. దేవుని తరువాత దేవునిగా ఇచ్చే గౌరవాన్ని పొందగలుగుతున్నారు. సమాజం ఇస్తుంది. . కాబట్టి ఇప్పుడు మళ్ళీ రాహుల్ గాంధీ ఎంట్రీ అయ్యాక ఇది అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య జరుగుతున్న గొడవగా మార్చకుండా ఇది ఒక విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే విధంగా అందులో భాగమైన అర్హత పరిక్షల పట్ల ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించే విధంగా బాధ్యత పడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడంలో భాగంగా జరుగుతన్న ఆందోళనకు పౌరహక్కుల సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తూనే విద్యావైద్యాలను ప్రైవేటీకరించకుండా అన్ని కూడా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగితేనే ఇటువంటి లోపాలు జరగవని విద్యార్థుల జీవించే హక్కు కాపాడబడుతుందని ప్రకటిస్తున్నాం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి,
పౌరహక్కుల సంఘం

# కొత్త పౌర చైతన్యం: నూతన భారతానికి తక్షణ అవసరం



స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచాయి. రాజ్యాంగం అమలైంది. ప్రజాస్వామ్యం పేరున ఎన్నికలు జరిగాయి. కానీ ఒక్కసారి ఆగి, నిజాయితీగా అడుగుకో ఈ జాతి నిజంగా స్వతంత్రంగా ఆలోచిస్తోందా? లేదా ఓట్లు వేసి, చేతులు దులుపుకుని, మళ్ళీ నిద్రలోకి జారిపోతోందా?ఇది కేవలం రాజకీయ విమర్శ కాదు. ఇది ఒక జాతి యొక్క అంతరాత్మకు చేసే హెచ్చరిక మరియు లోతైన ప్రశ్న. పౌర చైతన్యం అంటే ఏమిటో మనం పూర్తిగా మరచిపోయాం. మనకు హక్కులు గుర్తున్నాయి కానీ బాధ్యతలు మాత్రం పూర్తిగా మరిచాం. గొంతు విప్పే ధైర్యం ఉంది కానీ తప్పు అయినప్పుడు నిలబడే నిజాయితీ మరియు నైతికత మాత్రం నేడు లేదు.నేటి భారతం ఒక విచిత్రమైన సంక్షోభంలో ఉంది. ఒక వైపు అద్భుతమైన ప్రతిభ, అపూర్వమైన జ్ఞానం, సాంకేతిక నైపుణ్యం మరో వైపు, అదే ప్రజలు రోజువారీ జీవితంలో అవినీతిని సహిస్తున్నారు, అన్యాయాన్ని మూగగా భరిస్తున్నారు, వ్యవస్థ వైఫల్యాలను అలా అయిపోతుంది అని సమర్థిస్తున్నారు. ఈ మానసిక వైరుధ్యమే నేటి భారతపు అతి పెద్ద విషాదం.మనం ఒక భయంకరమైన వాస్తవాన్ని అంగీకరించాలి మన విద్యా వ్యవస్థ పరీక్షల క కోసం విద్యార్థులను తయారుచేస్తోందే తప్ప, బాధ్యతాయుతమైన పౌరుల కోసం కాదు. మన పిల్లలు కేవలం అంకెలు, సూత్రాలు, తేదీలు నేర్చుకుంటున్నారు. కానీ ఓటు ఎందుకు వేయాలి, పన్ను ఎందుకు కట్టాలి, న్యాయం కోసం ఎలా పోరాడాలి ఇవి నేర్చుకోవడం లేదు. విద్య కేవలం జ్ఞానాన్ని ఇస్తోంది,వివేకాన్ని ఇవ్వడం లేదు. సమాచారాన్ని ఇస్తోంది, సంస్కారాన్ని మాత్రం ఇవ్వడం లేదు. విద్య పరీక్షాకేంద్రికంగా మారడం వల్ల నైతిక, పౌర విలువలు వేగంగా తగ్గిపోవడం , సామాజిక మాధ్యమాల వల్ల ఉపరితల సమాచారం పెరిగి, లోతైన ఆలోచన పూర్తిగా తగ్గిపోవడం, జాతి, మతం, ప్రాంత విభేదాలు పౌర ఐక్యతను పూర్తిగా చీల్చివేయడం , నాయకత్వం పైన అంధ విశ్వాసం ,వారు చూసుకుంటారు అనే నిష్క్రియాత్మకత సమాజ సమస్యలను నా సమస్య కాదు అని భావించి దూరంగా ఉండటం .సామాజిక మాధ్యమాల యుగంలో మనం ప్రపంచాన్ని కేవలం చూస్తున్నాం కానీ అర్థం చేసుకోవడం పూర్తిగా మానేశాం. ఒక వీడియో వైరల్ అయితే చాలు అందరూ నిపుణులు అయిపోతున్నారు. ఒక హ్యాష్‌ట్యాగ్ పెడితే చాలు పెద్ద విప్లవకారులు అయిపోతున్నారు. కానీ పది ఏళ్ళుగా తమ ఊరి నీళ్ళ సమస్య పరిష్కారం కావడం లేదంటే, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఘోరమైన వైరుధ్యం మనల్ని ఎక్కడికి తీసుకువెళ్తుందో అర్థమవుతోందా?అవినీతిని సహించే ప్రతి నిమిషం, మనం కూడా ఆ అవినీతికి సమాన భాగస్వాములమవుతున్నాం మాట్లాడకపోవడమూ ఒక సమాజ నిర్ణయమే అవుతుంది.తెలుగు ప్రజలు ఆంధ్ర, తెలంగాణ రెండింటా చారిత్రాత్మకంగా అద్భుతమైన పోరాట స్ఫూర్తికి సంకేతాలు. అల్లూరి సీతారామరాజు పోరాటం, వందేమాతరం ఉద్యమం, రైతు పోరాటాలు, తెలంగాణ విమోచన సమరం ఈ నేల వీరుల రక్తంతో తడిసినది. కానీ ఈ చరిత్ర కేవలం పాఠ్య పుస్తకాల్లో, విగ్రహాల కింద మూలుగుతోంది. ఆ స్ఫూర్తి నేడు ఎక్కడ ఉంది? ఆ నిప్పు నేడు ఎవరి గుండెల్లో రగులుతోంది?రాష్ట్రాలు రెండుగా విడిపోయాయి. కానీ రెండు రాష్ట్రాల్లోనూ ఒకే సమస్య పునరావృతమవుతోంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, నిరుద్యోగులు వలస వెళ్తున్నారు, మహిళలపై హింస ఆగడం లేదు, ప్రభుత్వ పాఠశాలలు కూలిపోతున్నాయి. ఈ సమస్యలకు లకు రాజకీయ పరిష్కారాన్ని ఆశించేంత కాలం నిజమైన పరిష్కారం రాదు ఎందుకంటే ఈ సమస్యలను నిలబెట్టుకోవడంలోనే నేటి రాజకీయానికి ప్రయోజనం ఉంది.నేను ఒక వ్యవస్థను కేవలం తిట్టడానికి ఇక్కడ రాయడం లేదు. ఒక ఉమ్మడి మార్గాన్ని సూచించడానికి రాస్తున్నాను. నూతన పౌర చైతన్యం అంటే పెద్ద విప్లవం కాదు, హింస కాదు, కఠిన సిద్ధాంతం కాదు. అది చాలా సాధారణమైనది, కానీ అత్యంత శక్తివంతమైనది.మొదటిది స్థానిక స్థాయిలో చురుకుదనం ప్రదర్శించడం. మీ గ్రామ పంచాయతీ సమావేశానికి ఎప్పుడైనా వెళ్ళారా? మీ వార్డులో డ్రెయిన్ పని ఎవరు చేస్తున్నారో తెలుసా? దానికి బడ్జెట్ ఎంత వచ్చిందో అడిగారా? ఈ సాధారణ ప్రశ్నలే అసాధారణమైన మార్పుకు ప్రారంభం. రెండవది ఆర్థిక పారదర్శకత డిమాండ్ చేయడం. పన్ను చెల్లించే ప్రతి పౌరుడికి లెక్క అడిగే పూర్తి హక్కు ఉంది. ఆ హక్కును నమ్రంగా, కానీ అత్యంత గట్టిగా వినియోగించుకోవాలి.మూడవది సత్యాన్ని మరియు న్యాయాన్ని ప్రేమించడం. ఇది అత్యంత కష్టమైనది, కానీ అత్యావశ్యకమైనది. మనకు ఇష్టమైన నాయకుడు తప్పు చేసినా తప్పే అని చెప్పే ధైర్యం, మన కులం తప్పు చేసినా తప్పే అని నిలబడే నిజాయితీ ఇదే నిజమైన పౌర చైతన్యం యొక్క బలమైన మూలస్తంభం.ఒక్క మేల్కొన్న పౌరుడు వందమంది నిద్రపోతున్న ఓటర్లకంటే ఈ మొత్తం వ్యవస్థకు ఎక్కువ సవాలు విసురుతాడు ఇదే చరిత్ర మనకు నేర్పిన నిత్య సత్యం.ఈ వ్యాసాన్ని కేవలం చదివి, బాగా రాశారు అని చెప్పి పక్కన పెట్టకు. అది చాలా సులభం. అది మనకు చాలా సౌకర్యంగా ఉంటుంది. కానీ నేను నిన్ను సౌకర్యంగా ఉండమని చెప్పడం లేదు నేను నిన్ను ప్రతిక్షణం జాగృతపరచడానికి రాస్తున్నాను. మన నిష్క్రియాత్మకత దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది.నేటి భారతం ఒక చారిత్రాత్మక మలుపులో నిలబడి ఉంది. ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతోంది, సాంకేతికత సమాజాన్ని తలక్రిందులు చేస్తోంది, ప్రపంచ శక్తుల మధ్య భారతం యొక్క స్థానం కొత్తగా నిర్ణయమవుతోంది. ఈ సంధి సమయంలో పౌరుల చైతన్యం లేకుండా పోతే, అత్యుత్తమ నాయకత్వమూ, అద్భుతమైన విధానాలూ ఏమీ పని చేయవు.మహాత్మా గాంధీ చెప్పాడు మీరు మీలో మీరు మార్పు కావాలనుకుంటే, మీరే ఆ మార్పు అవ్వండి. బాబాసాహెబ్ అంబేద్కర్ హెచ్చరించాడు రాజకీయ ప్రజాస్వామ్యం సాఫల్యమవ్వాలంటే సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా ఉండాలి. ఈ మహోన్నతమైన మాటలు నేడు ఎంత సత్యంగా ఉన్నాయో ఒక్కసారి ఆలోచించు.నూతన భారతానికి కొత్త పౌర చైతన్యం అవసరం ఇది కేవలం ఒక నినాదం కాదు, ఇది మన తక్షణ అవసరం. ఇది ఒక పార్టీకి సంబంధించినది కాదు, ఒక ప్రాంతానికి సంబంధించినది కాదు, ఒక మతానికి సంబంధించినది కాదు. ఇది ఖచ్చితంగా నీకు సంబంధించినది, నాకు సంబంధించినది, ఈ పవిత్ర నేలపై జన్మించిన ప్రతి ఒక్కరికీ సంబంధించినది.మేల్కో. ప్రశ్నించు. న్యాయం వైపు నిలబడు. ఇదే ఈ కాలపు పరమ ధర్మం.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

ఆణి ముత్యాలు - కథ


# మాయ

నిన్నటి సంచిక తరువాయి

దీన్నేమంటారు? మీరు మాయను ప్రేమకు పర్యాయపదంగా వాడుతున్నట్లు రేమిటి?" ఆశ్చర్యపోతూ నిలదీసింది మాయ.
మేధకు చర్చస్థాయి అందినట్లులేదు. ఏదో కొత్త విషయాలు వింటున్నట్లుగా అన్పిస్తోంది అంతే. మాయ గట్టి పిల్లే అని మెచ్చుకోలుగా చూసింది మహామాయ. తన వివరణలో ఎక్కడో పొరపాటు దొర్లిందని ఆలోచనలో పడ్డాడు నాగార్జున. ఆయన మౌనంగా ఉండటంతో మరికొంచెం ధైర్యం పుంజుకొంటూ మళ్ళీ నిలదీసింది మాయ.
"బుద్ధుడు మాయలో పడకుండానే ప్రజల్ని ప్రేమించాడు. మాయతో పనిలేకుండానే ప్రపంచాన్ని ప్రేమించడం ఎలాగో నేర్పాడు. కాదంటారా? శంకరాచార్య మాయను వదిలించబోయి ప్రేమను వదిలేశాడు. మీరేమో ప్రేమను పట్టుకోబోయి మాయనే ప్రేమంటూ పట్టేసుకున్నారు. స్వచ్ఛమైన బలంగా, స్వచ్ఛమైన ప్రేమ ఎక్కడా ఉండబోదంటారు. ఇదేనా మీరు చెప్ప దల్చుకుంది?"



మాయ అప్పుడే తడిసి ఆరిన మందారంలా మెరిసిపోతున్నది. ఇంత స్వచ్ఛమైన మనస్సు, హృదయం ఎన్నాళ్ళకో చూసినట్లనిపించింది. మాయ యొక్క స్వచ్ఛతను చూసి హర్షాతిరేకంతో ముద్దుపెట్టుకోవాలనిపించింది నాగార్జునగారికి. ఇదేమిటి ఇలాంటి ఆలోచన కలిగిందిమేమిటి అని సిగ్గుపడ్డాడు. మేధ నాన్నగారి జవాబు చెప్పలేని అవస్థ చూసి కిలకిలా నవ్వింది.
"మమకారంలో నిర్మమకారంగా, నిశ్చయంలో నిష్కామంగా, ప్రేమలో నిర్మలంగా ఉండడం ప్రేమ. అవి ఆశాపాశాలకు, మాయామోహాలకు అనువుగా కుదించబడ్డం మాయ అంది మహామాయ. మళ్ళీ "ఈ మాయ మన కోడలైతే ఎంత బాగుంటుందో" నవ్వుతూ అంది మహామాయ.
"ఆంటీ–మొదట చెప్పింది ప్రేమ. ఈ మీ చివరి వాక్యం మాత్రం మాయ!" అంటూ నవ్వింది మాయ. అందరూ ఆ నవ్వుతో శృతి కలిపారు. మాయ, ప్రేమ తమను ప్రేమిస్తున్నామని ప్రేమలేఖలు రాసిన వారిలో ప్రేమెంత మాయెంత అని ఎవరికి వారు మనస్సులో బేరీజు వేసుకోవడం ప్రారంభించారు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# కరీంనగర్‌లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

## కేంద్ర మంత్రి కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించి నిరసన
- ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు





**కరీంనగర్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళన బాటలోనే, కరీంనగర్‌లోనూ కాంగ్రెస్ నేతలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ కార్యాలయం ముట్టడికి యత్నించడంతో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కరీంనగర్ పార్లమెంటు కార్యాలయం వైపు దూసుకొచ్చిన కాంగ్రెస్ శ్రేణులను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, కేంద్ర మంత్రి కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా స్పందిస్తూ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నిరసనలను వ్యతిరేకిస్తూ బీజేపీ శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఉనికి కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తోందని గంగాడి కృష్ణారెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని రాహుల్ గాంధీ రాజకీయ లబ్ధి కోసం దేశ వ్యతిరేక శక్తులతో కలిసి ఆందోళనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

నీట్ పరీక్ష విషయంలో తప్పులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం రీ-ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించినప్పటికీ, ఢిల్లీలో విధ్వంసకర ఆందోళనలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన పేరుతో అరాచక రాజకీయాలకు పాల్పడటం హేయనీయమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ కుట్రపూరిత ఆందోళనలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో బీజేపీ ముందుకు వెళ్తుందని, ఇలాంటి చౌకబారు బెదిరింపులకు బీజేపీ కార్యకర్తలు భయపడరని, బీజేపీతో పెట్టుకుంటే తడాఖా చూపిస్తామని, ఖబర్దార్ అని గంగాడి కృష్ణారెడ్డి హెచ్చరించారు.

### బీజేపీ జోలికి వస్తే వదిలిపెట్టం.. దీటుగా బదులిస్తాం

నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు కాంగ్రెస్ అనవసర రాజకీయాలు చేస్తుందని, బీజేపిని ఎదుర్కొనే దమ్ము లేక విద్రోహ శక్తులతో కలిసి దేశంలో అశాంతి అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తుందని, బీజేపీ జోలికి వస్తే వదిలిపెట్టేది లేదని, దీటుగా బదులిస్తామని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులు ఘాటుగా హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయాన్ని కాంగ్రెస్ శ్రేణులు ముట్టడించడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు చెప్పారు. పనికిమాలిన రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని, దీటుగా గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించేది లేదు

**పేపర్ లీకేజీలను అరికట్టాలి : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.**



**యాలాల జూలై 22 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా యాలాల్ మండలంలోని లక్ష్మినారాయణపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా నిరసన కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు మనం ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదు మన విద్యార్థుల భవిష్యత్తు కోసం. విద్యార్థులకు మద్దతుగా నిల్చిన రాహుల్ గాంధీపై పోలీసులతో దాడి చేయించడం పూర్తిగా ఖండిస్తూ తాండూర్ కాంగ్రెస్ పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు, డాక్టర్ కావాలనే తమ కలను సాకారం చేసుకునేందుకు రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. అయితే పేపర్ లీకేజీలు, పరీక్షల్లో అవకతవకల కారణంగా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం జరిగితే మనం చూస్తూ ఊరుకోబోం. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించేది లేదు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఈ వ్యవహారానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్రంగా చర్చ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 77 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్కాజిగిరి జూలై 22 (జనంసాక్షి) :** నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ్ నగర్ నుండి గౌతమ్ నగర్ వరకు 77 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం పనులను గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి బుధవారం ఆయన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గౌతమ్ నగర్ డివిజన్ తో పాటు మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉన్న అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గుత్తేదారులు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు డిఈ లౌక్య,ఏఈ దివ్య జ్యోతి, వర్క్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం కాలనీ వాసులు, బెనర్జీ, టీన్ సాయి గౌడ్, నందకుమార్, మహేష్, అచ్యుత్ రావు, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, కరుణాకర్, బిఆర్ఎస్ సినియర్ నాయకులు రాముయాదవ్, బైరు అనిల్, కాటంరాజు, నర్సింగ్, నగేష్ గౌడ్, చిట్టి బాబు, మర్రి శ్రీనివాస్, శెంకర్, ఎస్వీఆర్ వెంకట్, భాను, సూర్యాప్రకాష్, హబీబ్,కిషన్, అశోక్, రాజా, మల్లేష్, లక్ష్మణ్ యాదవ్, భచ్చి మల్లేశ్, యాదవ్, రాజేష్, భారత్, సతీష్, వాసుదేవరావు, గణేశ్ నాయక్, దేవ్, మహేష్ దత్తు, విజయ్, ఏవీ ప్రసాద్, హరీశ్, శేషిధర్, శ్రీనివాస్, ప్రదీప్, విఘ్నేష్, సోను తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ భూములపై మంత్రి దుద్దిల్ల శ్రీధర్ రెడ్డి కీలక సమావేశం

### రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రంగారెడ్డి, జూలై 22 (జనంసాక్షి) : ఫార్మాసిటీ ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వని నాలుగు గ్రామాల రైతుల సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్‌తో కలిసి బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు 2,000 ఎకరాల భూమి మినహాయింపు అంశంపై రైతుల అభ్యర్థనలను మంత్రి పరిశీలించారు. భూములను ఏ విధంగా మినహాయించవచ్చనే అంశంపై టీజీఐఐసీ అధికారులు, జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సమగ్రంగా చర్చించి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, త్వరలో మరోసారి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం ప్రకటిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సమావేశంతో భూమి మినహాయింపు అంశంపై రైతుల్లో మరోసారి ఆశలు చిగురించాయి.

## విధులను అడ్డుకున్నారంటూ కానిస్టేబుల్ ఫిర్యాదు

### కేసు నమోదు చేసిన చందానగర్ పోలీసు అధికారులు

**శేరిలింగంపల్లి, జూలై 22 (జనంసాక్షి) :** తన ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఇద్దరు వ్యక్తులపై కొల్లూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీస్ అధికారులు బుధవారం కేసును నమోదు చేశారు. చందానగర్ ఇన్స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం... సంతోష్ కుమార్ అనే కొల్లూర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ నల్లగండ్ల ఎస్‌బిఐ బ్యాంక్ సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహిస్తుండగా వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించాడు. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు, ఫుట్ పాత్ పై మూసివేసిన మట్టిని హైడ్రా సిబ్బందితో తొలగింపజేసి నిల్వవున్న భారీ నీటిని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తాత్కాలికంగా మళ్ళించడానికి ప్రయత్నిస్తుండగా సదరు ఖాళీ స్థలం యజమాని డాక్టర్ శరత్ బాబు మరియు ఆయన కుమారుడు అక్కడికి వచ్చి నీటిని తమ స్థలంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుని అనవసరమైన రాద్ధాంతం చేయడం జరిగింది. తాను ట్రాఫిక్ కానిస్టేబుల్ అని, ట్రాఫిక్ సమస్యను తొలగించడానికి నీటిని తాత్కాలికంగా మళ్లించేందుకు మాత్రమే ప్రయత్నిస్తున్నానని పలుమార్లు విన్నవించినప్పటికీ వారు వినకుండా పబ్లిక్ న్యూ సైన్స్ ను క్రియేట్ చేసి తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తేందుకు పరోక్షంగా దోహదపడడంతో అనవసరంగా తన విధులను ఆటంకపరిచి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంతో పాటు పబ్లిక్ న్యూ సెన్స్ కు పాల్పడిన వైనాన్ని ఉటంకిస్తూ కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు డాక్టర్ శరత్, అతని కుమారుడి పై కేసును నమోదు చేయడం జరిగింది.

## కామారెడ్డి జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఈ)గా డాక్టర్ శ్రీనివాస్ నియామకం

**కామారెడ్డి, జూలై 22 (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ – డీసీహెచ్ఈ)గా డాక్టర్ శ్రీనివాస్ నియమితులయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ, వైద్య సేవల సమన్వయం, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాల కల్పన, ఆరోగ్య సేవల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది డాక్టర్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేస్తానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే వైద్య సిబ్బందితో సమిష్టిగా పనిచేస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



## మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

- ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



**మహేశ్వరం,జూలై 22(జనంసాక్షి):** మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. బుధవారం సిపిఎం నాయకులతో కలిసి మహేశ్వరం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ...మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మహేశ్వరంలో పోస్టుమార్టం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తాలేరన్నారు. కుక్క,పాము కాటుకు అవసరమైన మందులు అందుబాటులో లేవన్నారు. మహేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 పడకల ఆసుపత్రిగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుబ్బాక రామచందర్,గోరింకల నర్సింహ, మహేశ్వరం మండల కార్యదర్శి శేఖర్, కందుకూరు మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్, అలువాల రవికుమార్,శ్రీనివాస్, కుమార్,గోదాస్ నరసింహ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రశాంత్,సిపిఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోండి

- ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం పిలుపు
- సీబీసీ నిజామాబాద్ ఆధ్వర్యంలో గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 22: జనం సాక్షి :** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), నిజామాబాద్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిజామాబాద్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం. సోమనాథం, డీఎస్పీ, ఈగల్ ఫోర్స్, నిజామాబాద్ మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మంచి స్నేహాలను ఎంచుకుని విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, కఠిన అమలు చర్యలను సమర్థవంతంగా కొనసాగిస్తోందని తెలిపారు. కేవలం సరదాగా మాదకద్రవ్యాలను ఒకసారి వినియోగించినా అది వ్యసనానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఐదు నుంచి ఏడు సంవత్సరాలను విద్య, నైపుణ్యాభివృద్ధికి అంకితం చేసి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని, సానుకూల స్నేహ వాతావరణాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి రాయబారులుగా మారాలని పిలుపునిచ్చారు. తోటి వారి ఒత్తిడికి లొంగకుండా కుటుంబ సభ్యులు, సమాజంలో అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రతీ ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ సాధనలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని కోరారు.

శివచరణ్ రెడ్డి, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, సీబీసీ, నిజామాబాద్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై యువతలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి ఆచరణలో పెట్టి నషా ముక్త్ భారత్ అభియాన్ విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సందీప్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఈగల్ ఫోర్స్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా సమకూరే నిధులు నేర, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు నహీదా బేగం, అధ్యాపకులు, మోహన్ దాస్, ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్, ఆకాశవాణి, అలాగే 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## ఢిల్లీ లాఠీచార్జీని ఖండిస్తూ ఈనెల 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

### మేడ్చల్ జిల్లా యూఎస్ఎఫ్ఐ అధ్యక్షులు ఏం చంద్రకాంత్




**నిజాంపేట్ జూలై 22 జనం సాక్షి :**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తూ ఈనెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చినట్లు యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా లాఠీచార్జీ చేయించడం దుర్మార్గం అని తెలిపారు. విద్యార్థుల గొంతును అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనకు నిరసనగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని కళాశాలలు, యూనివర్సిటీలు, పాఠశాలలను బంద్ చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువజనులు, అధ్యాపకులు ఈ బంద్ ను జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి" అని ఎం. చంద్రకాంత్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఢిల్లీ లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు చేపట్టి విద్యార్థుల డిమాండ్ల వెంటనే పరిష్కారం చేయాలని అలాగే విద్యార్థి హక్కుల పరిరక్షణ లో భాగంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# 23వ వార్డులో డ్రైనేజీ సమస్యను తీర్చాలి






- గత నెల రోజులుగా ఆర్మూర్ మున్సిపాలిటీకి ఫిర్యాదు
- డ్రైనేజీ సమస్యను పర్యవేక్షించిన అధికారులు

**ఆర్మూర్,జూలై 22 (జనంసాక్షి):** ఆర్మూరు మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో డ్రైనేజీలో సమస్య తీవ్రతరంగా మారింది. గత నెల రోజులుగా ఆర్మూర్ మున్సిపాలిటీకి కాంగ్రెస్ నాయకుడు సడక్ ప్రమోద్ గత నెలరోజులుగా వార్డు డ్రైనేజీ సమస్యను తీర్చాలంటూ మున్సిపాలిటీకి మొర పెట్టుకున్నాడు. గత 10 ఏళ్లుగా కాలనీలో డ్రైనేజీలు కాలువలు సరిగా లేక ఇంటి నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందని చెప్పుకున్నారు. వర్షాకాలం వస్తే ఆయా అవార్డుల్లో కుటుంబాల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. రాత్రి అయితే పాములు, విషపూరిత జీవులు సంచరించి భయభ్రాంతులకు గురవుతున్నామని చెప్పారు. మొత్తం డ్రైనేజీని పూర్తి చేయకుండా సగంలోనే ఆపివేసి వార్డు ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా వాటర్ పైపులు వేసి గత పాలకులు చేతులు దులుపుకున్నారని చెప్పారు.

దీంతో మున్సిపాలిటీ అధికారులు డ్రైనేజీ సమస్యను తీర్చేందుకు బుధవారం పర్యవేక్షించి పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను తీర్చేందుకు గుంత తవ్వి పూడికతీత పనులను ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు సరైన చొరవ చూపి వార్డు ప్రజల ఇళ్లల్లోకి నీరు చేరకుండా డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కోరుతున్నారు.

### ప్రోటోకాల్ పాటించని కౌన్సిలర్లు..



ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పలు వార్డులలో కౌన్సిలర్లు ప్రోటోకాల్ పాటించడం లేదని తెలుస్తుంది. సాధారణంగా ప్రోటోకాల్ ప్రకారం వారి వారి వార్డులలోని సమస్యలు,నిర్మాణాలు ఏలాంటివైనా పూర్తి యజమాయిషి ఆయా వార్డు కౌన్సిలర్‌కే ఉంటుంది. కాగా కొందరు కౌన్సిలర్లు అత్యుత్సాహం తో ఇతర వార్డులలో చొరబడి చొరవ తీసుకుంటూ అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారని తెలుస్తుంది. కొందరు తమ నేత అండ ఉన్నాడనే అండతో తమ పేరు చెబితే పనైపోతుందని తమకు తామే గొప్పలు చెప్పుకుంటున్నారు. పలుచోట్ల నిర్మాణాలు ఇతర వార్డుల్లో జరిగితే వాటిల్లో జోక్యం చేసుకొని డబ్బులు దండుకుంటున్నారని ఆలస్యంగా తెలిసింది. కాంగ్రెస్, బిజెపి పార్టీల నుండి టికెట్ తెచ్చుకుని నానా తంటాలు పడి గెలిచిన అధికార పార్టీ కౌన్సిలర్లు అత్యుత్సాహం చూపి చొరబడి పనులు చేయడం ఏంటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. డ్రైనేజీ సమస్యకు సైతం ఆయా వార్డు కౌన్సిలర్ కనబడకుండా ఇతర వాడు కౌన్సిలర్లు కనిపించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి కౌన్సిలర్ల తీరు మారుతుందా లేదా అనేది చూడాలి.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం:మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి

- మండల,మున్సిపల్ అధ్యక్షులకు రంజిత్ రెడ్డి దిశ నిర్దేశం
- కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి



**శంకర్ పల్లి, జూలై 22 (జనం సాక్షి) :**
శంకర్‌పల్లి మండల అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు మడ పతి చంద్రమౌళి కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డిని బుధవారం వారి నివాసాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బొల్లారం వెంకట్‌రెడ్డికి, మున్సిపల్ అధ్యక్షులు మడపతి చంద్రమౌళికి మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చురుకుగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బొల్లారం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని మరింత పటిష్టం చేస్తూ,కార్యకర్తలతో సమన్వయం కల్పించి కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయకుల సూచనలు, సలహాలను పాటిస్తూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు చేకూర్త గోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, కావలి గోపాల్, కౌన్సిలర్స్ ఎర్ర ఆనంద్, గణేష్,నాయకులు కాంత్ రెడ్డి,నరేందర్ రెడ్డి,పలువురు కార్యకర్తలు ఉన్నారు.

## మిల్లర్లు సిఎంఆర్ వడ్ల బకాయిలు చెల్లించాలి

**అదనపు కలెక్టర్ మధుమోహన్**



**గద్వాల నడిగడ్డ,జులై 22(జనం సాక్షి) :** జిల్లాలోని రైస్ మిల్లర్లు 2022-23 రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన వడ్లకు సంబంధించిన బకాయిలను చెల్లించాల్సి ఉందని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు.బుధవారం ఐడిఓసిలోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. మూడేళ్ల కిందట 36,814.800 మెట్రిక్ టన్నుల వడ్లను రైతుల నుంచి సేకరించి జిల్లాకు చెందిన 33 మంది మిల్లర్లకు అప్పగించడం జరిగిందన్నారు. ఇందులో ఒక మిల్లర్ మాత్రమే పూర్తిగా ధాన్యానికి సంబంధించిన పూర్తి డబ్బులు చెల్లించారని, మిగతావారు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. ఆ సీజన్ లో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యం చాలా వరకు నాణ్యత బాగోలేదనే విమర్శలు రావడంతో ప్రభుత్వం కొంతకాలానికి వేలంపాట ద్వారా అమ్మేందుకు నిర్ణయించిందన్నారు. వేలంపాటలో హక్కులు దక్కించుకున్న వ్యక్తి కొంత ధాన్యం మాత్రమే తీసుకోవడంతో మిగిలిన ధాన్యముకు సంబంధించిన బకాయిలను మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశాలు ఇవ్వగా చాలామంది మిల్లర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ప్రభుత్వం క్వింటాల్ కు రూ.2236 చొప్పున వడ్ల డబ్బులు చెల్లించాలని ఆదేశించగా, మిల్లర్లు రూ.1830 మాత్రమే చెల్లిస్తామనడం సరికాదన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యానికి సంబంధించిన బకాయిలను చెల్లించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, ఎన్ ఫోర్స్ మెంట్ డిటి ప్రశాంత్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగేశ్వర కామ్లే, తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో తాగునీటి కటకట



**హాలియా (జనంసాక్షి) :** నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొని విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన 10 రోజులుగా తాగడానికి, కనీస అవసరాలకు కూడా నీరు లేక బాలికలు అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ గురువారం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి కొరత కారణంగా బకెట్లతో మూడో అంతస్తుకు కింది నుంచి నీరు మోసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇది విద్యార్థినుల ఆరోగ్యం, చదువుపై ప్రభావం చూపుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు ఈ సమస్యపై ఇప్పటికే సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసినా స్పందన రాలేదని పేర్కొన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో లకుమాల మధు బాబు, లకుమాల లింగయ్య, సర్పంచ్ పిల్లి ఉమా రాణి అభినయ్, రాయనబోయిన రామలింగయ్య, లక్ష్మణ్, మొహ్మద్ తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు

# సామాన్యుడి సొంతింటి కలకు 'రిజిస్ట్రేషన్' ఊతం

**సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జోరుగా క్రయవిక్రయాలు • రోజూ 162 స్లాట్లలో 150కిపైగా రిజిస్ట్రేషన్లు**

**సంగారెడ్డి, జులై 21 (జనంసాక్షి)**

సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే మధ్యతరగతి, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, పెట్టుబడిదారుల ఆసక్తితో సంగారెడ్డి జిల్లా, కంది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం ప్రజలతో సందడిగా మారింది గత కొంతకాలంగా ప్లాట్ల క్రయవిక్రయాలు ఊపందుకోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ప్రతిరోజూ కార్యాలయంలో అందుబాటులో ఉండే 162 ఆన్‌లైన్ స్లాట్లలో 150కుపైగా రిజిస్ట్రేషన్లు పూర్తవుతుండటం రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న చురుకుదనానికి నిదర్శనంగా నిలుస్తోంది. సంగారెడ్డి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, బీహెచ్‌ఈఎల్ పరిసర ప్రాంతాలు, ఇస్నాపూర్, రుద్రారం, బొల్లారం, కాజీపల్లి, పటేల్‌గూడ, ముత్తంగి తదితర ప్రాంతాల్లో నివాస ప్లాట్లు, వాణిజ్య స్థలాలు, ఇండ్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల కొనుగోలు, విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ లావాదేవీలతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచే ప్రజల రద్దీ కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం ద్వారా ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కార్యాలయానికి చేరుకునే విధానం ఉండటంతో ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగుతోంది. రోజువారీ స్లాట్లలో అత్యధికం వినియోగంలో ఉండటమే కాకుండా కొన్ని రోజుల్లో దాదాపు అన్ని స్లాట్లు నిండిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది.



**సామాన్యుడి కలకు రియల్ ఎస్టేట్ తోడ్పాటు**

సొంత ఇంటి కోసం స్థలం కొనుగోలు చేయాలనే కల ప్రతి కుటుంబంలో ఉంటుంది. ఆ కలను నెరవేర్చుకునేందుకు అనువైన ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉద్యోగ విరమణ చేసినవారు, ఐటీ ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, కూడా పెట్టుబడిగా ప్లాట్ల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. భవిష్యత్‌లో ఆస్తి విలువ పెరుగుతుందనే అంచనాతో చాలామంది స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి, హైదరాబాద్‌కు సమీపం, మెరుగైన రోడ్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండటం వల్ల ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ పెరిగింది.

**వివిధ రకాల రిజిస్ట్రేషన్లు**

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కేవలం ప్లాట్ల రిజిస్ట్రేషన్లే , ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు, గిఫ్ట్ డీడ్లు, సెటిల్‌మెంట్ డీడ్లు, మార్టేజ్, లీజ్, విల్‌కు సంబంధించిన పత్రాలు, భాగస్వామ్య ఒప్పందాలు వంటి వివిధ రకాల రిజిస్ట్రేషన్లు కూడా కొనసాగుతున్నాయి. దీంతో ప్రతి రోజు కార్యాలయం సందడిగా కనిపిస్తోంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతోంది. స్లాట్ బుకింగ్, పత్రాల ధృవీకరణ, బయోమెట్రిక్ నమోదు, ఫోటో, వేలిముద్రలు, డిజిటల్ రికార్డుల భద్రపరిచే ప్రక్రియ వేగంగా పూర్తవుతోంది. ఈ విధానం వల్ల సమయం ఆదా కావడంతో పాటు అవినీతికి కూడా అడ్డుకట్ట పడుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే సర్వర్ సమస్యలు లేదా ఇంటర్నెట్ అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్లకు స్వల్ప అంతరాయం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు. అలాంటి సందర్భాలను మినహాయిస్తే మిగతా రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు.

**గతంతో పోలిస్తే పెరిగిన క్రయవిక్రయాలు**

కొన్నేళ్ల క్రితం రియల్ ఎస్టేట్ రంగంలో మందగమనం కనిపించినప్పటికీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. ముఖ్యంగా పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం కావడం, పరిశ్రమల విస్తరణ, కొత్త నివాస కాలనీలు ఏర్పడటం, పెట్టుబడిదారుల ఆసక్తి పెరగడం వంటి కారణాలతో భూముల క్రయవిక్రయాలు గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చే ఆదాయం కూడా ఈ లావాదేవీలతో పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రతిరోజూ అధిక సంఖ్యలో పత్రాలు నమోదు కావడం ద్వారా ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో మంచి ఆదాయం సమకూరుతోంది. స్థలం కొనుగోలు చేసి వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ముందస్తు స్లాట్ బుకింగ్ ద్వారా సమయానికి పని పూర్తవుతుండటంతో చాలా మంది ఈ విధానాన్ని స్వాగతిస్తున్నారు. అవసరమైన అన్ని పత్రాలు సిద్ధంగా ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తవుతోందని కొనుగోలుదారులు పేర్కొంటున్నారు. పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ మాట్లాడుతూ, "ప్రతిరోజూ అందుబాటులో ఉండే 162 స్లాట్లలో 150కుపైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్లాట్లు, ఇండ్లు, వ్యవసాయ భూములు తదితర అన్ని రకాల పత్రాల నమోదుకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. సర్వర్ లేదా ఆన్‌లైన్ సమస్యలు తలెత్తిన సందర్భాల్లో మాత్రమే స్వల్ప అంతరాయం ఏర్పడుతుంది. మిగతా సమయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం క్రయవిక్రయాలు గణనీయంగా పెరిగాయి" అని తెలిపారు.



## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి వేగవంతం

**మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా రూ.16.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**బీరంగూడ అభివృద్ధికి రూ.9.03 కోట్ల మంజూరుకు ప్రత్యేక కృతజ్ఞతలు : శశిధర్ రెడ్డి**



**అమీన్పూర్, జులై 22 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి వేగవంతం అయిందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. అమీన్‌పూర్ సర్కిల్-47 పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.16.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, ప్రజా రవాణా, తాగునీటి అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరంగా పనిచేస్తుందన్నారు. పట్టణీకరణ రోజు రోజుకి ఆధునిక హంగులతో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలో అన్ని వార్డుల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధికి నాయకులంతా సహకరించాలన్నారు. పటాన్చెరు నియోజకవర్గం దాదాపు పూర్తిస్థాయి లో పట్టణీకరణ చెందిందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, బీరంగూడ డివిజన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.9.03 కోట్లను మంజూరు చేయడం పట్ల మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ సూచనలు, సలహాల మేరకు బీరంగూడ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులతో పాటు స్మశానవాటిక అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే డివిజన్‌కు మరిన్ని అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, గడ్డం వివేక్ వెంకటస్వామి మరియు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్లకు శశిధర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని వేగవంతం చేస్తోందన్నారు. బీరంగూడ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం" అని శశిధర్ రెడ్డి స్పష్టం చేశారు.



## మేళ్లచెరువులో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పోలీసుల దాడులు

**నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో ముమ్మర తనిఖీలు**

**మేళ్లచెరువు (జనంసాక్షి) :** మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పోలీసులు బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మేళ్లచెరువు పోలీసుల నేతృత్వంలో జిల్లా డాగ్ స్క్వాడ్ సిబ్బంది నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' సహాయంతో మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. రహదారి వెంట ఉన్న దాబాలు, హోటళ్లు, కిరాణా షాపులు, టీ దుకాణాలు, పాన్ డబ్బాలు, మెడికల్ షాపులతో పాటు పలు పాఠశాలల ప్రాంగణాలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు జరుగుతున్నాయా అని నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేళ్లచెరువు ఎస్ఐ మాట్లాడుతూ, యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది, మేళ్లచెరువు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనాజిపురం-ఎర్రగుంట కట్ట మెట్ల నిర్మాణంలో నాణ్యత లోపం

- కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్న ఏఈపై చర్యలు తీసుకోవాలి
- పనులను తక్షణమే నిలిపివేసి నాణ్యత తనిఖీ చేయాలి



**మోత్కూరు జూలై 22 (జనం సాక్షి) :** మోత్కూరు మండల కేంద్రంలో అనాజిపురం ఎర్రగుంట కట్ట మెట్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలను పూర్తిగా తుంగలో తొక్కుతూ సాగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాసిరకం మెటీరియల్ వాడుతున్నా, నిర్మాణంలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతూ మౌనం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కట్ట మెట్ల నిర్మాణం ప్రజల భద్రతకు సంబంధించిన కీలకమైన పని అయినప్పటికీ, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నాడని, ఏఈ మాత్రం తనిఖీలు చేయకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడని మండిపడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల మెట్లు పగుళ్లు, అసమానతలు, సిమెంట్ పనుల్లో లోపాలు కనిపిస్తున్నాయని, ఇలా కొనసాగితే ప్రమాదాలు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రజాధనం ఖర్చు చేసి చేపడుతున్న పనుల్లో నాణ్యత లేకపోవడం దారుణమని, దీనికి బాధ్యులైన కాంట్రాక్టర్‌తో పాటు వత్తాసు పలుకుతున్న ఏఈపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పనులను నిలిపివేసి, ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ఇకనైనా సంబంధిత శాఖ స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మోత్కూరు మండల ప్రజలు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

## విద్యార్థుల కోసం సొంత ఖర్చుతో పోలీసులే నిర్మించిన భవనం

**బక్కచింతలపాడులో పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎస్పీ రోహిత్ రాజు**



**చర్ల, జూలై 22 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామంలో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని జిల్లా ఎస్పీ డా. రోహిత్ రాజు బుధవారం ప్రారంభించారు. పాఠశాల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "విద్య అనేది ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాది"లి అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత, క్రమశిక్షణ, విద్యార్థుల నైతిక విలువలు, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, వీటి ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. అనారోగ్యం వస్తే మూఢనమ్మకాలను నమ్మకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డెంగీ, మలేరియా లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమం చివర్లో వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఎస్బి 2 ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ, యంఈఓ రమణ, కాంట్రాక్టర్ సంతోష్, సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయురాలు సౌజన్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి

- గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 22 (జనంసాక్షి) :** త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. 1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో 'సీతారామ' ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు.ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు. పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు.

ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్-2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇర్రిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం




**హనుమకొండ ప్రతినిధి/ కాజీపేట, జూలై 22 (జనం సాక్షి) :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ పర్యటన నిమిత్తం ఎన్ఐటి గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలకు ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, తదితరులు పుష్ప గుచ్ఛాలు, పూలమొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. ఎన్ఐటీ గెస్ట్ హౌజ్ కు చేరుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొద్దిసేపు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డిసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ రవి, డీఆర్వో శ్రీనివాస్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలాగే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కి ఎన్ఐటీ అతిథి గృహం వద్ద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య , శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి , కేఆర్ నాగరాజు , రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య , టీపీసీసీ నేతలు ఈవీ శ్రీనివాస్ రావు బొద్దులెడ్డి ప్రభాకర్ రెడ్డి బత్తిని శ్రీనివాస్ రావు నామిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేలేరును అభివృద్ధి చేస్తా

- గండి రామారం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి గోదావరి జలాలు తీసుకువస్తా
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు జూలై 22 (జనం సాక్షి) :** వేలేరు మండలాన్ని అన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు వేలేరు మండల రైతులకు గోదావరి జలాలతో రెండు పంటలకు సాగు నీరు అందించే బాధ్యత నాదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. వేలేరు మండలం మద్దెలగూడెం, వేలేరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మద్దెలగూడెం గ్రామంలో 43 లక్షల 40 వేల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లతో పాటు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వేలేరు మండల కేంద్రంలో 45 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, 22లక్షల 30 వేల రూపాయలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ, 10 లక్షలతో నిర్మించిన వివో భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.... వేలేరు మండల కేంద్రంలో నెల రోజులలలో ఎమ్మార్వో, ఎంపిడివో కార్యాలయాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల క్రితమే 2కోట్ల 20లక్షలతో తహసీల్దార్ కార్యాలయం, 2కోట్లతో ఎంపిడివో కార్యాలయాల భవనాలు మంజూరు అయ్యాయని తెలిపారు. గండి రామారం ఎత్తిపోతల పనులు పూర్తి చేసి వేలేరు మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ఒక పెద్ద మనిషి అయన గ్రామానికి నీళ్లు వచ్చే పనులు మాత్రమే చేసుకొని మిగతా పనులను వదిలేశాడని విమర్శించారు. 8 కోట్లతో వేలేరు నుండి కొమ్ముగుట్ట వరకు డబుల్ రోడ్డు, 4కోట్ల 50లక్షలతో వేలేరు నుండి శాలపల్లి వరకు బిటీ రోడ్డు, హ్యామ్ రోడ్ల అభివృద్ధికి 13 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. 10 నెలలలో ఈ రోడ్లన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. మద్దెలగూడెం గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు మద్దెలగూడెం గ్రామంలో గంగిరెద్దుల వాళ్లకు ఇండ్లు ఇచ్చానని, పీచర నుండి కొమ్ముగుట్ట వరకు బిటీ రోడ్డుతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మళ్ళీ 20ఏళ్ల తర్వాత నేను ఎమ్మెల్యే అయిన తర్వాతనే మద్దెలగూడెం గ్రామానికి 20 ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు వచ్చాయని అన్నారు. త్వరలోనే పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, 3కోట్లతో పీచర నుండి కొమ్ముగుట్ట వరకు బిటీ రోడ్డు అభివృద్ధి పనులు చేయిస్తానని 6 నెలలలో రోడ్డు పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. రెండవ విడతలో మరో 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, రెండు ఏళ్లలోనే 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డ్ సృష్టించిందని కొనియాడారు. రానున్న రోజులల్లో త్రాగు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాగు నీరు అందించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే కొంత మంది మాత్రం ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని అన్నారు. 10 ఏళ్ళు అధికారంలో ఉండి తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్న సొమ్ము పంపకాలలలో విభేదాలు వచ్చి కవిత బయటకు వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కల్వకుంట్ల కుటుంబ సభ్యురాలే 10 ఏళ్ళ అధికారంలో అవినీతి ద్వారా వచ్చిన 1400 కోట్ల బిఆర్ఎస్ పార్టీ ఫండ్ ఉద్యమకారులకు పంచాలని, హరీష్ రావు అవినీతి వాళ్లే కాళేశ్వరం కుంగిపోయిందని స్వయంగా కవితే ఆరోపిస్తుందని విమర్శించారు. మళ్ళీ వాళ్లే అధికారం కోల్పోయామనే అక్కసుతో రాష్ట్ర ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని, బిఆర్ఎస్ చెప్పే మాయ మాటలు నమ్మవద్దని ప్రజలను, రైతులను కోరారు. పేదల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు బిల్లా యాదగిరి, హన్మకొండ మనోజ్, తహసీల్దార్, ఎంపిడివో, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఇతర అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### వేలేరుకు మరో 50 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

వేలేరు గ్రామపంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మంజూరైన రెండు (2) కోట్ల విలువ గల వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం మరియు గ్రామపంచాయతీ సర్పంచ్ యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా సమావేశానికి, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. వేలేరు గ్రామపంచాయతీ కి రెండో విడత లో 50 ఇంద్రరమ్మ ఇండ్లు, మరియు గ్రామంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం మరొక 2 (రెండు) కోట్ల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మార్వో, ఎంపీడీవో, గ్రామంలో మిగిలిపోయిన రెండు వి.వో బిల్డింగులు, మండల సమైక్య భవనం, ప్రభుత్వ పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణాల కు త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## వరంగల్ జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ భవనాల కూల్చివేత




- నూతన భవనాల నిర్మాణానికి జరుగుతున్న పనులు
- ఆర్పిఎఫ్ క్వార్టర్లలోకి మార్చిన జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్

**వరంగల్ ఈస్ట్, జూలై 22 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని రైల్వే స్టేషన్ లో గల జి.ఆర్.పి, ఆర్ పి ఎఫ్ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన భవనాలను కూల్చివశారు. వీటి స్థానంలో కొత్తగా సుమారు మూడు కోట్ల వ్యయంతో నూతన భవనాలను నిర్మించేందుకు కావలసిన పనులు జరుగుతున్నాయి. చాలా సంవత్సరాలుగా ఇరికిరుకుగా ఉన్నటువంటి జి ఆర్ పి ఆర్ పి ఎఫ్ భవనాలను రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలోనే కూల్చివేస్తారని ప్రచారం జరిగింది. కానీ అప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ప్రస్తుతం రైల్వే స్టేషన్ కు తగిన విధంగా ఉండేలా విశాలంగా భవనాలు నిర్మించి మరింత మెరుగైనటువంటి సేవలను అందించే విధంగా భవన నిర్మాణాలు జరుపాలని రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు రెండు భవనాలను కూల్చివేసిన తర్వాత సేవలను అందించేందుకు ఎదురుగా ఉన్నటువంటి ఆర్ పి ఎఫ్ రైల్వే క్వార్టర్లలోకి జి ఆర్ పి, ఆర్ పి ఎఫ్ పోలీస్ స్టేషను ను మార్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నూతన భవనాలు నిర్మాణం పూర్తయ్యే వరకు సుమారు ఒక ఏడాది అయిన పట్టే సమయం ఉంది కాబట్టి అప్పటివరకు ఈ కార్యాలయాల్లో విధులు నిర్వహించనున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా చారిత్రక వరంగల్ రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న ఆర్పిఎఫ్ ,జి ఆర్ పి పోలీస్ స్టేషన్లో కోసం రెండు నూతన భవనాలు నిర్మాణం చేపట్టడం ఎంతో ఉపయోగకరం.

## రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లిలో కాంగ్రెస్ నేతల నిరసన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విద్యార్థుల న్యాయమైన సమస్యల సాధన కోసం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపడితే, వారికి మద్దతు తెలిపిన కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, నల్గొండ ఎమ్మెల్సీ, పార్లమెంటు ఇంచార్జి శంకర్ నాయక్, ఏఐసీసీ నాయకులు, జిల్లా ఇంచార్జీలు హుస్సేన్, సిరాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినాలే తప్ప, బలప్రయోగంతో నిరసనలను అణచివేయకూడదని సూచించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దేశంలోని యువత ఎదుర్కొంటున్న సమస్యలు, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై ప్రధానమంత్రి నుండి సమాధానం కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల తరుపున ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుడిపై భౌతికంగా దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ పేపర్ లీకేజీలు చేస్తున్న బీజేపీకి రానున్న రోజుల్లో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికీ స్వేచ్ఛ ఉంటుందని, కాని బీజేపీ ప్రభుత్వంలో ఆ స్వేచ్ఛ లేదని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ పార్టీకి చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గూట్ల తిరుపతి, మూల శంకర్ గౌడ్, ఏకు రవి, మట్టవాడ సురేష్, రజనీకాంత్, జంపన్న, బడితల రాజయ్య, కోటగిరి సతీష్, అక్బర్ ఖాన్, ఆకుతోట కుమారస్వామి, సదవల్లి, సురేష్, రాజిరెడ్డి, వెంకీ యాదవ్, లక్ష్మి, పరమేశ్వరి, పులియాల గాంధీ, శ్రీహరి, కొండ రాజమ్మ, మమత, రజిత, జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### మొసలిని వరంగల్ జూపార్కుకు తరలించిన ఫారెస్ట్ అధికారులు

**చెన్నారావుపేట, జూలై 22 (జనంసాక్షి):** వ్యవసాయ బావిలోని మొసలిని బయటకు తీసి వరంగల్ జూ పార్కుకు తరలించినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ తెలిపారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామ శివారులోని మగ్దంపురం ఊర చెరువు సమీపంలో పడిదం మల్లయ్యకు చెందిన వ్యవసాయ బావిలో ఉన్న మొసలిని బుధవారం గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, గ్రామస్తుల సమక్షంలో బయటికి తీశారు. వరంగల్ రెస్క్యూ టీం సభ్యులు స్వామి, శంకర్, కొమురయ్య, క్రిష్ణ, అసిస్టెంట్ సాంబరాజు, బేస్ క్యాంప్ సిబ్బంది చందూలాల్, రవి, శివ, మహేష్ లు వ్యవసాయ బావిలోకి దిగి మొసలిని బయటకి తీశారు. తీసిన మొసలిని వరంగల్ జూ పార్కుకు తరలిస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ తెలిపారు.

### బాసర అమ్మవారి ఆలయంలో వరుణ యాగం

**బాసర, జూలై 22 (జనంసాక్షి) :** వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో బుధవారం వరుణ యాగం నిర్వహించారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు, జీవరాశులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ యాగాన్ని నిర్వహించినట్లు ఆలయ జూ అంజని దేవి తెలిపారు. ఆలయ అర్చకులు, వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో ఉదయం నుంచే వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం ప్రారంభమైంది. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు పండాలని, దేశ ప్రజలందరూ ఆనందంగా ఉండాలని యాగంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ూజూ గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శివరాజ్, సంజీవ రావు, స్థానాచార్యులు, ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలే లక్ష్యం



- బాసర త్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

**బాసర, జూలై 22(జనం సాక్షి) :** బాసర త్రిపుల్ ఐటీ విద్యార్థులు చదువు పూర్తయ్యేలోపే మంచి ఉద్యోగాలు పొందేలా నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. బుధవారం కలెక్టర్ బాసర త్రిపుల్ ఐటీ క్యాంపస్ లో పర్యటించి విశ్వవిద్యాలయ అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించాలి. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో పోటీపడేలా తీర్చిదిద్దాలి” అని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. 24 గంటల విద్యుత్ సరఫరా, సురక్షిత తాగునీరు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన క్యాంపస్ వాతావరణం, అకాడమిక్, డిజిటల్, క్రీడా సౌకర్యాల విస్తరణ విద్యార్థుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని, అధ్యాపకులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

### జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది

త్రిపుల్ ఐటీ క్యాంపస్ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం బాసరలో ప్రతిపాదిత నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సమీక్షలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఉపకులపతి గోవర్ధన్, ూాణ మురళీ దర్శన్, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలి

- రాజకీయ పార్టీల సహకారంతో ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు నమోదు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 22(జనంసాక్షి) :** 109-ములుగు ఎస్టీ శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, 2026 జూన్ 25 నుంచి బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రతి ఓటరు నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో సుమారు 83.03 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో మిగిలి ఉన్న ఓటర్లను మరోసారి సంప్రదించి, పెండింగ్‌లో ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటైజేషన్‌ను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓ యాప్ ద్వారా వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటైజ్ చేసిన ఫారాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అవసరమైన చోట రీ-విజిట్ నిర్వహించి, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఓటర్ల పేర్ల చేర్పు, సవరణలు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని స్పష్టం చేశారు. ఓటరు మరణించినా లేదా ఇతర కారణాలతో పేరు తొలగించాల్సిన సందర్భాల్లో కూడా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, డిడబ్ల్యూఓ ప్రేమలత, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల సిబ్బంది సలీం, నితీష్, రమాదేవి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## లక్ష్మీ బ్యారేజీకి భారీగా వరద



**మహదేవపూర్, జూలై 22 (జనంసాక్షి) :** మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ప్రణహిత నదిలో భారీ వరద నీరు చేరి మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి భారీగా వరద ప్రభావం కొనసాగుతుంది. బుధవారం బారేజ్ లో 22,290 క్యూసెక్కుల నీటి ప్రవాహం రాగా. బారేజ్ లోని మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## లాభసాటి పంటలపై రైతులు మొగ్గుచూపాలి

- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



**నిర్మల్ రూరల్, జూలై 22(జనం సాక్షి) :** లాభసాటిగా ఉండే వాణిజ్య పంటలపై రైతులు మొగ్గు చూపాలని మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని బంగాల్‌పేట్ మహాలక్ష్మి వాడ శివారులో సాయి దీక్ష సేవ సమితి జిల్లా అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి తన ఐదు ఎకరాల పొలంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మొక్కల పెంపకం కార్యక్రమంలో ఇంద్రకరణ్ రెడ్డి హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంప్రదాయ పంటలకు భిన్నంగా, లాభసాటిగా ఉండే వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాకాల రామచందర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలి

- లింగాపూర్, సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 22(జనంసాక్షి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, బుధవారం లింగాపూర్, సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణపై సబ్ ఇన్స్పెక్టర్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, పెండింగ్ కేసులు, ఆయుధాగారం, లాక్అప్, పరిశుభ్రత, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరును పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనరల్ డైరీ (జీడీ )ను ప్రతిరోజూ క్రమం తప్పకుండా నమోదు చేయడంతో పాటు, బయటి విధులకు వెళ్లే ప్రతి పోలీసు సిబ్బందికి డ్యూటీ పాస్ జారీ చేసి వారి రాకపోకల వివరాలను నమోదు చేయాలని సూచించారు. అన్ని కేసులను సకాలంలో సీసీటీఎన్ ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి ఎలాంటి ఎంట్రీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ 24 గంటల పెట్రోలింగ్ నిర్వహించాలని, సైబర్ నేరాలు, అనుమానాస్పద వ్యక్తులు, రాత్రి వేళల్లో నిఘా పెంచాలని సూచించారు. అలాగే స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణలో నాణ్యత పాటిస్తూ ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ఈ తనిఖీలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ , జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు సురేష్, కొమురయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 జూలై 2026

# ఉపాధ్యాయులున్నా.. పాఠాలు చెప్పేది ఒక్కరే..!

- ఏడుగురు ఉపాధ్యాయుల్లో నలుగురు వివిధ కారణాలతో దూరం
- లో విజన్ సమస్యతో ఇద్దరు ఉపాధ్యాయులు
- టీచర్ స్థానంలో గ్రామ యువకుడితో బోధన

**అచ్చంపేట, జూలై 22 (జనంసాక్షి)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఇప్పలపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. పాఠశాలలో మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ, విద్యార్థులకు ప్రత్యక్షంగా పాఠాలు చెప్పే పరిస్థితిలో కేవలం ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రమే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు డిప్యూటేషన్‌పై మారడుగు, మద్దిమడుగు పాఠశాలలకు బదిలీ చేశారు. మరోవైపు ప్రధానోపాధ్యాయురాలు వైద్య సెలవులో ఉండగా, ఇంకొక ఉపాధ్యాయుడు విద్యా సెలవు పొందారు. దీంతో పాఠశాలలో మిగిలిన ముగ్గురు ఉపాధ్యాయులపై బోధనా బాధ్యతలు పడాల్సి ఉండగా, వారిలో ఇద్దరు లో--విజన్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అంధత్వంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడు**

మిగిలిన ఉపాధ్యాయుల్లో చంద్రమౌళి అనే ఉపాధ్యాయుడు పూర్తి అంధత్వ సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం. దీంతో ఆయన విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితిలో లేరు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో దివ్యాంగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక సహాయకులను నియమించి బోధన కార్యక్రమాలు కొనసాగేలా చూడాల్సి ఉంటుంది. అయితే ఇప్పలపల్లి పాఠశాలలో అలాంటి ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

**టీచర్ స్థానంలో గ్రామ యువకుడు**

విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా చూడాలనే ఉద్దేశంతో మండల విద్యాశాఖాధికారి




(ఎంఈఓ), కాంప్లెక్స్ హెచ్‌ఎం రామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఓ యువకుడిని ఉపాధ్యాయుడి స్థానంలో నియమించి పాఠాలు చెప్పిస్తున్నట్లు తెలిసింది. అయితే సంబంధిత యువకుడికి విద్యాశాఖ నుంచి ఎలాంటి అధికారిక నియామక ఉత్తర్వులు లేకపోవడం, విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే బోధన బాధ్యతలు అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**నిబంధనలకు విరుద్ధమేనా..?**

విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమితులైన వారే విద్యార్థులకు బోధన చేయాలి. ఒకవేళ దివ్యాంగ ఉపాధ్యాయులకు సహాయం అవసరమైతే ప్రభుత్వం ప్రత్యేక సహాయక సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కానీ ఇప్పలపల్లి పాఠశాలలో మాత్రం ఉపాధ్యాయుడి స్థానంలో గ్రామానికి చెందిన యువకుడిని తీసుకువచ్చి తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తల్లిదండ్రుల్లో ఆందోళన**

ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతులు, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలను అమలు చేస్తుందని ప్రైవేటు పాఠశాలను ముయించామని , మరోవైపు ఉపాధ్యాయుల కొరత, డిప్యూటేషన్లు, సెలవులు, ఆరోగ్య సమస్యల కారణంగా బోధన దెబ్బతినడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థుల చదువులు దెబ్బతినకుండా వెంటనే శాశ్వత ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)ను వివరణ కోరగా, విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే తాత్కాలికంగా గ్రామ యువకుడిని నియమించి బోధన కొనసాగిస్తున్నామని తెలిపారు. అయితే ఈ నియామకానికి సంబంధించి ఉన్నతాధికారుల అనుమతి ఉందా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వ పాఠశాలలో ఏకంగా ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రమే అందుబాటులో ఉండటం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. పరిస్థితిపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, విద్యార్థుల విద్యకు భంగం కలగకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రహదారి భద్రత

**జాతీయ రహదారులపై ఆక్రమణలు, అనధికార పార్కింగ్ తొలగించాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు**




**వనపర్తి, బ్యూరో జూలై 22 (జనంసాక్షి) :** జిల్లాలోని జాతీయ రహదారులపై అక్రమ ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌ను తక్షణమే తొలగించి, రహదారి భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ, జాతీయ రహదారి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై ఎలాంటి ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌కు అవకాశం ఇవ్వకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పెద్దమందడి మండలం వెల్టూర్ నుంచి పెబ్బేరు మండలం రంగాపూర్ వరకు జాతీయ రహదారి పరిధిలో ఉన్న ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఉన్న దాబాలు, వ్యాపార సంస్థల వద్ద అనధికార పార్కింగ్‌ను నియంత్రించేందుకు అవసరమైన చోట పార్కింగ్ స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు పార్కింగ్ బేలను అభివృద్ధి చేయాలని తెలిపారు. రహదారులకు ఇరువైపులా 20 మీటర్ల పరిధిలో ఎలాంటి ఆక్రమణలు అనుమతించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, ఆక్రమణలు గుర్తించిన వెంటనే తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయా లేదా సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర ప్యాట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ప్రమాదకర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫుడ్ ప్లాజాలు, విశ్రాంతి కేంద్రాల వద్ద కూడా రహదారి భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. వెల్టూర్, కనిమెట్ట, తోమలపల్లి ప్రాంతాల్లో అండర్‌పాస్ పనులను వేగవంతం చేయాలని, ముమ్మళ్లపల్లి సర్వీస్ రోడ్డు పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మోజెర్ల, పాలెం క్రాస్‌రోడ్ల వద్ద అండర్‌పాస్ నిర్మాణం లేదా ప్రత్యామ్నాయ భద్రతా చర్యలను పరిశీలించాలని హైవే అధికారులకు సూచించారు. కొత్తకోట మదర్ తెరిసా జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు ఫుడ్ పిరమిడ్ ప్రాంగణంలోని పార్కింగ్ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకునేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల అధికారులు, ఆర్‌అండ్‌బీ, రవాణా, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నా అవయవాలను దానం చేయండి

- సూసైడ్ నోట్ రాసిన విద్యార్థి
- నర్సాపూర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి
- తన చావుకు ఎవరు కారణం కాదని సూసైడ్ నోట్

**నర్సాపూర్ జులై 22 (జనం సాక్షి) :** నా ఆత్మహత్య అనంతరం నా అవయవాలు పనిచేస్తే అవసరమైన వారికి దానం చేయాలని, అలా కాకుండా మృతి చెందినట్లయితే నా శరీరాన్ని శాస్త్రీయ పరిశోధన మరియు ప్రయోగాలకు విరాళంగా ఇవ్వాలని ఓ ఇంజనీరింగ్ విద్యార్థి సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లింగోజి తాండ కు చెందిన మేతిపోలే శివశంకర్ (20) నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీ వీ ఆర్ ఐ టి కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతనితోపాటు ముగ్గురు స్నేహితులు నర్సాపూర్ పట్టణంలోని సిటీ ప్యాలెస్ వద్ద రూమ్ లో అద్దెకు ఉంటున్నారు. మంగళవారం నాడు శివకుమార్ రూమ్ లో స్నేహితులు లేని సమయంలో నైలాన్ తాడుతో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు శివశంకర్ తన మిత్రుడికి ఇన్స్టాగ్రామ్ లో సూసైడ్ నోట్ పంపించడం జరిగింది. అందులో చాలా కాలం నుండి చనిపోవాలని విఫలమయ్యానని పేర్కొన్నాడు. తన ఇష్టానుసారంగానే చనిపోతున్నానని, తన తల్లిదండ్రులు చాలా సపోర్ట్



చేశారని, తనకు ప్రేమ జీవితం కూడా లేదని, ఎందుకు చనిపోవాలనుకుంటున్నాను వివరించలేనని చెప్పుకొచ్చాడు. ఆత్మహత్య అనంతరం బ్రతికి ఉంటే అవయవాలు ఏవైనా పనిచేస్తుంటే వాటిని అవసరమైన వారికి దానం చేయాలని, ఒకవేళ మరణిస్తే శరీరాన్ని శాస్త్రీయ పరిశోధన మరియు ప్రయోగాలకు విరాళంగా ఉచితంగా ఇవ్వాలని పేర్కొన్నాడు. నేను తీసుకున్న ప్రతి నిర్ణయానికి చింతిస్తున్నానని, ఒక నిర్ణయం కూడా మంచిది కాదని చెప్పుకొచ్చాడు. మృతుడు తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ వెల్లడించారు.

# కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

**నాణ్యమైన విద్య, భోజనంపై ఎంఈఓ ఆదేశాలు**

**తెలకపల్లి, జులై 22, (జనం సాక్షి):** మండల కేంద్రంలోని రాకొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను(కేజీబీవి) మండల విద్యాధికారి (ఎంఈఓ) సి. శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థనలో పాల్గొని విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ఆరో తరగతి సాంఘిక శాస్త్రం బోధనను పరిశీలించి, విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. విద్యార్థినుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై కలెక్టర్ ఆదేశాలను వివరించారు. పాఠశాలలో విద్యార్థులతో సాధ్యమైనంత వరకు ఆంగ్ల భాషలోనే సంభాషించాలని, స్పోకెన్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అన్ని సబ్జెక్టుల సిలబస్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎల్ఐపీ ప్రారంభ పరీక్షలు నిర్వహించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా ఎఫ్ఏ--1 పరీక్షలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. 30 మంది సిబ్బందిలో 27 మంది హాజరుకావడంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎంఈఓ, 435 మంది విద్యార్థుల్లో 390 మంది మాత్రమే హాజరుకావడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తర్వాత ప్రత్యేక అధికారి హసీనా, వంటమాతలతో సమావేశమై విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని ఆదేశించారు.



మెనూను తప్పనిసరిగా అమలు చేయడంతో పాటు బియ్యాన్ని శుభ్రపరిచి, తాజా కూరగాయలు, గడువు ముగియని వంటసామగ్రిని మాత్రమే వినియోగించాలని, వంటశాల, వంట పాత్రల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎస్ఓపీని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు పాఠశాల యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి హసీనా, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# మామిళ్లపల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

**సర్పంచ్ ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**ఉప్పునుంతల, జూలై 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామ శివారులోని నల్లకుంట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం అక్రమంగా తవ్వకాలు జరిపిన ఘటనపై ఉప్పునుంతల పోలీసులు కేసు నమోదు చేశారు. మామిళ్లపల్లి గ్రామ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లకుంటలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు నిర్వహించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై పుట్ట మహేష్ మాట్లాడుతూ, గుప్తనిధుల పేరిట పురాతన ప్రదేశాలు, చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి అనుమానాస్పద ఘటనలు లేదా వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# వైన్స్ గోడకు కన్నం.. 48 గంటల్లోనే దొంగ కటకటాల్లోకి

**శ్రీ మహాలక్ష్మి వైన్ షాప్ చోరీ కేసు ఛేదించిన కల్వకుర్తి పోలీసులు**

**రూ.1.75 లక్షల నగదు, డీవీఆర్, చోరీకి ఉపయోగించిన పనిముట్లు స్వాధీనం**

**కల్వకుర్తి,జూలై 22(జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని శ్రీ మహాలక్ష్మి వైన్ షాప్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.1.75 లక్షల నగదు, డీవీఆర్‌తో పాటు చోరీకి ఉపయోగించిన సుత్తి, కట్టింగ్ ప్లయర్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 19, 20 తేదీల మధ్య రాత్రి నిందితుడు షాపు వెనుక గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించాడు. అనంతరం సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి నగదు రూ.1.75లక్షలు,డీవీఆర్‌ను అపహరించి పరారయ్యాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో గాంధీనగర్‌కు చెందిన సిమ్ముల మల్లికార్జున్ రెడ్డి అలియాస్ చిన్నను అనుమానాస్పదంగా అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో నేరాన్ని అంగీకరించడంతో అతడిని అరెస్టు చేశారు.




నిందితుడి వద్ద నుంచి రూ.1.75 లక్షల నగదు, డీవీఆర్, నేరానికి ఉపయోగించిన సుత్తి, కట్టింగ్ ప్లయర్లను స్వాధీనం చేసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును వేగంగా ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన కల్వకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భీము కుమార్,సబ్ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి,పోలీసు సిబ్బంది చిరంజీవి, నజీరుద్దీన్‌లను జిల్లా పోలీసు అధికారి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఉప పోలీసు అధికారి వెంకట్ రెడ్డి అభినందించారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి

**సంగారెడ్డి బ్యూరో, జూలై 22( జనం సాక్షి):**

సంగారెడ్డి జిల్లాలో పీసీఆర్, పీఓఏ చట్టాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలపై జరిగే వివక్ష, అట్రాసిటీ ఘటనలను




అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించడంతో పాటు, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. 2022 నుంచి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు సుమారు రూ.2.58 కోట్ల ఆర్థిక ఉపశమనం అవసరమవగా, ఇప్పటివరకు రూ.1.74 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ.68.87 లక్షలు విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు కూడా ఆర్థిక సహాయం అందించే ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. పెండింగ్ కేసుల దర్యాప్తుపై డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ... అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని కోరారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ... 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో 31 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, అందులో 12 కేసులు దర్యాప్తులో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్టప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఏసీపీలు, డీఎస్పీలు, ఆర్డీవోలు రాజేందర్, దేవుజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల హబ్‌గా గద్వాల

**ఒకేచోట అన్ని ప్రభుత్వ సేవలు**

**సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీ ఊతం**

**మారుతున్న జోగులాంబ జిల్లా రూపురేఖలు**

**వైద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీ ఊతం**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి,జులై 22(జనం సాక్షి)**

గద్వాల జిల్లా కేంద్రంలో పరిపాలనా సౌలభ్యం, ప్రజా సేవలను మరింత వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ భవనాల నిర్మాణం కోసం రికార్డు స్థాయిలో 35 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేటాయింపుతో గద్వాల నియోజకవర్గ రూపురేఖలు మారడమే కాకుండా, ప్రజలందరికీ ఒకే చోట అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ భారీ భూకేటాయింపుపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు రాష్ట్రమంత్రిమండలికి ఆయన గద్వాల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో వైద్యం, విద్యుత్, రవాణా, విద్య మరియు ఉపాధి రంగాలు గణనీయంగా బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతిపాదిత 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ఒక అధునాతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తారు. వాహనదారులు, ప్రజల రవాణా సేవల కోసం అధునాతన వసతులతో కూడిన ఆఫీస్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుంది. మహిళా సాధికారతకు మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి, ఉపాధి శిక్షణకు వేదికగా జిల్లా



మహిళా సమాఖ్య భవనం నిర్మిస్తారు. ఉపాధి కల్పనకు గ్రామీణ యువతకు స్వయం ఉపాధిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ భవనాన్ని ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు.విద్యార్థులకు అండగా వెనుకబడిన తరగతుల విద్యార్థుల ఉన్నత చదువులకు, పోటీ పరీక్షల సాధనకు వీలుగా ఒక బీసీ స్టడీ సెంటర్ రూపుదిద్దుకోనుంది.వ్యవసాయ వసతులు మరియు రైతుల ప్రయోజనాల కోసం భవనం, ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు విద్యుత్ శాఖకు సంబంధించిన సామాగ్రిని భద్రపరిచేందుకు ప్రత్యేక గిడ్డంగులు నిర్మిస్తారు.ఈ ప్రాజెక్టులన్నీ త్వరలోనే పట్టాలెక్కనున్నాయని, వీటి నిర్మాణాలు పూర్తయితే జిల్లా ప్రజలకు రవాణా, వైద్యం, పరిపాలన సేవలు ఎంతో సులభతరం అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

**అభివృద్ధికి పునాది :** గద్వాల నియోజకవర్గంలో మౌలిక వసతుల కోసం ఈ 35 ఎకరాల స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 8, 2025న అధికారికంగా కేటాయించింది.రాష్ట్రంలో పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిపాలనా సౌలభ్యాన్ని పెంచే వ్యూహాత్మక చర్యల్లో భాగంగా ఆగస్టు 2025 మొదటి వారంలో ఈ భూమిని మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది.

**ఎమ్మెల్యే చొరవ :** గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్థానిక అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ భూసేకరణ మరియు కేటాయింపు ప్రక్రియ వేగంగా పూర్తయింది.ప్రస్తుత పురోగతితో భూమి కేటాయించినప్పటి నుంచి ఆయా ప్రభుత్వ విభాగాలు రవాణా,విద్యుత్, సంక్షేమ శాఖలు తమ భవనాల లేఅవుట్ ప్లాన్లు మరియు వ్యయ అంచనాలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమైన అధికారులు.

**జిల్లా ప్రజలకు అధునాతన వైద్య సేవలు..**

స్థానిక విద్యార్థులకు వైద్య విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం గద్వాల ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేట్ భాగస్వామ్యం లేకుండా పూర్తి ప్రభుత్వ రంగంలో మంజూరు చేసింది. గద్వాలలో మెడికల్ కాలేజీ మరియు అనుబంధ హాస్పిటల్ హాస్టల్ భవనాల నిర్మాణానికి గాను ప్రభుత్వం సుమారు రు 91.26 కోట్లను మంజూరు అయ్యాయి. ఇందులో కాలేజీ భవనాలతో పాటు రోగుల సేవల కోసం అదనంగా 10 ఎకరాలను టీచింగ్ హాస్పిటల్ కొరకు కేటాయించారు. నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతితో ప్రతి సంవత్సరం 50 ఎంబీబీఎస్ సీట్లతో ఈ కాలేజీలో తరగతులు విజయవంతంగా,అనుబంధగా 100 పడకల హాస్పిటల్ మరియు విద్యుత్ సబ్‌స్టేషన్, 35 ఎకరాల స్థల కేటాయింపులో భాగంగా, ఇక్కడ ప్రతిపాదించిన 100 పడకల అదనపు హాస్పిటల్ బ్లాక్ లోపల నిరంతరాయంగా 24 గంటల పవర్ సప్లై ఉండేలా ప్రత్యేకంగా ఒక 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు.




# ఎటర్నల్‌ లాభం నాలుగింతలు..

## రూ.20,211 కోట్ల ఆదాయం




జొమాటో, బ్లింకిట్‌ పేరిట ఫుడ్‌ డెలివరీ, క్విక్‌ కామర్స్‌ వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటర్నల్‌ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నాలుగింతలకుపైగా నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.25 కోట్లుగా ఉన్న లాభం.. ఈ ఏడాది రూ.92 కోట్లకు పెరిగింది. ఈ మేరకు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. తకార్యకలాపాల వల్ల వచ్చే ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే రూ.7,167 కోట్ల నుంచి రూ.20,211 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ఖర్చులు రూ. 7,433 కోట్ల నుంచి రూ.20,314 కోట్లకు పెరిగాయి. ఫుడ్‌ డెలివరీ విభాగం జొమాటో నెట్‌ ఆర్డర్‌ వాల్యూ ఏడాది ప్రాతిపదికన 20 శాతం వృద్ధి చెంది రూ.10,769 కోట్లకు చేరింది. క్విక్‌ కామర్స్‌ బ్లింకిట్‌ నెట్‌ ఆర్డర్‌ వాల్యూ 86 శాతం పెరిగి రూ.17,132 కోట్లకు చేరింది. పేటీఎం నుంచి కొనుగోలు చేసిన టికెటింగ్‌ ప్లాట్‌ఫామ్‌ డిస్ట్రిక్ట్‌ నెట్‌ ఆర్డర్‌ వాల్యూ 60 శాతం పెరిగి రూ.3,218 కోట్లుగా ఉంది. ఈ ఏడాది తొలి త్రైమాసిక ఫలితాలు సానుకూలంగానే ఉన్నాయని ఎటర్నల్‌ సీఈఓ, బ్లింకింట్‌ వ్యవస్థాపకుడు అల్బిందర్‌ సింగ్‌ ధిండ్సా అభిప్రాయపడ్డారు. నెట్‌ ఆర్డర్‌ వాల్యూ ఆశించిన స్థాయిలో వృద్ధి చెందిందని తెలిపారు. కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి, వ్యాపారం, ఉత్పత్తుల విస్తరణపై దృష్టి సారించనున్నామని తెలిపారు. క్విక్‌ కామర్స్‌ విభాగంలో గడిచిన నాలుగేళ్లలో రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని, రాబోయే రోజుల్లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తామన్నారు. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వల్ల ముడి సరకుల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఎదురైనా ఉత్పత్తి, సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదని చెప్పారు.

# మూడో రోజూ నష్టాల్లోనే..

## మళ్లీ 24 వేల దిగువకు నిఫ్టీ

**ముంబయి(జనంసాక్షి):** దేశీయ స్టాక్‌ మార్కెట్‌ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్‌ ధరలు భారీగా పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్‌, రియాల్టీ స్టాక్స్‌ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ 24 వేల మార్కు దిగువకు చేరింది. మూడు ట్రేడింగ్‌ సెషన్లలో కలిపి సెన్సెక్స్‌ 1400, నిఫ్టీ 300 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్‌ ఉదయం 77,384.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,470.11) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆపై మరింత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,641.19 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 715.06 పాయింట్ల నష్టంతో 76,755.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 191.45 పాయింట్ల నష్టంతో 23,996.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్‌ 30 సూచీలో ఇండిగో, యాక్సిస్‌ బ్యాంక్‌, ఇన్ఫోసిస్‌, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్‌ సిమెంట్‌ షేర్లు



ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్‌ యూనిలీవర్‌, పవర్‌గ్రిడ్‌ కార్పొరేషన్‌, ఎన్టీపీసీ, టైటాన్‌, ఏషియన్‌ పెయింట్స్‌ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌ క్రూడ్‌ బ్యారెల్‌ ధర 94.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర ఔన్సు 4117.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# వచ్చే ఏడాది స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ ధరలు మరింత పైకి!

మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు కారణంగా గ్లోబల్‌ టెక్‌ కంపెనీలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే యాపిల్‌, శాంసంగ్‌ వంటి పలు కంపెనీలు స్మార్ట్‌ఫోన్‌, ల్యాప్‌టాప్‌ ధరలను పెంచాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచంలోనే నంబర్‌వన్‌ చిప్‌ తయారీ సంస్థ తైవాన్‌ సెమీకండక్టర్‌ మాన్యుఫాక్చరింగ్‌ కంపెనీ (టీఎస్‌ఎంసీ) చిప్‌ ధరలను (టాఓఅ అప్త్రతిజూ ఖతీతిఇవ ఊతినివ)పెంచేందుకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాదిలో వీటి ధరలను 10 శాతం మేర పెంచే యోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీంతో రానున్న రోజుల్లో స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఏఐ పరికరాల ధరలు ఆకాశన్ని తాకుతాయనడంలో సందేహం లేదు. 6 ఎన్‌ఎం కంటే తక్కువ ఉండే చిప్‌లతో పాటు 28 ఎన్‌ఎం, 16ఎన్‌ఎం, 12ఎన్‌ఎం చిప్‌లు ధరలూ పెరగనున్నాయి. దీంతో వచ్చే ఏడాది కూడా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ధరలకు రెక్కలొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్‌ | వరంగల్‌ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్‌

| ₹ 1,54,928 (22 క్యారెట్లు) | ₹ 1,69,014 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్‌

₹ 2,45,000

# జాబ్‌ మార్కెట్‌ హబ్‌..

## 'సిటీస్‌ ఆన్‌ ది రైజ్‌' నివేదికలో విశాఖ టాప్‌




దేశంలో ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో విశాఖపట్నం అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ ప్రొఫెషనల్‌ నెట్‌వర్కింగ్‌ సర్వీస్‌ లింక్డిన్‌ తాజాగా విడుదల చేసిన 'సిటీస్‌ ఆన్‌ ది రైజ్‌' రెండో ఎడిషన్‌ జాబితాలో ఈ విషయం వెల్లడైంది. విశాఖ తర్వాతి స్థానాల్లో వరుసగా లుధియానా, సూరత్‌, వడోదర, ప్రయాగ్‌రాజ్‌, రాజ్‌కోట్‌, జబల్‌పూర్‌, రాంచీ, రాయ్‌పూర్‌, విజయవాడ నిలిచాయి. లింక్డిన్‌ నివేదిక ప్రకారం.. అత్యంత బలమైన జాబ్‌ మార్కెట్‌ కలిగిన, బయటకు వెళ్లేవారికంటే లోపలికి వచ్చే ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఇందులో భాగంగా 10 నాన్‌ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించారు. ఈ నగరాల్లో ప్రతి ఖాళీ పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిందని ఈ నివేదిక తెలిపింది. దేశ వృద్ధి మరింత విస్తరిస్తోందని, అభివృద్ధి చెందుతున్న నగరాలు తమకంటూ ప్రత్యేకమైన, బహుళ రంగాలతో కూడిన ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా ఈ నివేదిక స్పష్టం చేస్తోందని లింక్డిన్‌ కెరీర్‌ నిపుణురాలు నిరాజిత బెనర్జీ తెలిపారు. విశాఖపట్నం పోర్టు, ఫార్మా, తయారీ రంగంతో కూడిన ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా ఏఐ, డేటా సెంటర్‌, టెక్నాలజీ ఆధారిత పెట్టుబడులతో అనుసంధానిస్తుండగా.. లుధియానా తన తయారీ రంగానికి ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాలను జోడిస్తోందని నివేదికలో పేర్కొన్నారు. ఇకపోతే, సూరత్‌ టెక్స్‌టైల్‌, వజ్రాలకు అతీతంగా స్టార్టప్‌లు, ఎగుమతులు, రియల్‌ ఎస్టేట్‌ ద్వారా విస్తరిస్తుండగా.. వడోదర రసాయనాలు, యంత్రాలతో పాటు టెక్నాలజీ, ఇంజినీరింగ్‌, ఎంటర్‌ప్రైజ్‌ పెట్టుబడులను ఆకర్షిస్తోందని వివరించింది. మరోవైపు, విజయవాడ సైతం అదే పథంలో వెళ్తోందని.. ముఖ్యంగా ఐటీ, ఈ-గవర్నెన్స్‌ కంపెనీల నుంచి పెరుగుతున్న ఆసక్తి ఆ నగర వాణిజ్య ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని పేర్కొంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్‌ సర్వీసులు ఉండగా.. మిగతా నగరాల్లో బ్యాంకింగ్‌, ఆర్థిక సేవలు ఉన్నాయని పేర్కొంది.

# దేశీయ భాగస్వామ్యానికి ఫోక్స్‌వ్యాగన్‌ సై!


## జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో సంప్రదింపులు

### ఆర్థిక ఇబ్బందులతో జర్మనీలో ప్లాంట్లు మూసివేస్తున్న నేపథ్యం

జర్మనీకి చెందిన ఫోక్స్‌వ్యాగన్‌ గ్రూప్‌, కొన్నేళ్లుగా మనదేశంలో ప్రయాణికుల వాహన (పీవీ -కార్లు, ఎస్‌యూవీల) విపణిలో పట్టు కోసం ప్రయత్నిస్తోంది. స్థానికంగా వాహనాల తయారీకి పెట్టుబడి పెట్టి, మనదేశానికి ప్రత్యేకమైన ఉత్పత్తులనూ అభివృద్ధి చేసింది. తన ఇంజినీరింగ్‌ విభాగాన్ని ఇక్కడ విస్తరించింది. బ్రాండ్‌ల ప్రచార వ్యూహాలనూ మార్చింది. రెండు దశాబ్దాల పాటు ఇంతగా ప్రయత్నించినా కూడా దేశీయ కార్ల విపణిలో భారీ వాటా సంపాదించుకోలేకపోయింది. ఈ పరిస్థితి మార్చేందుకు దేశీయ సంస్థతో జట్టుకట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. గ్రూప్‌ ఆధీనంలో ఫోక్స్‌వ్యాగన్‌, స్కోడా, బెంట్లీ, లంబోర్గిని, పోర్షే వంటి బ్రాండ్లున్నాయి. ఇప్పుడు స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్‌ ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడి కోసం, దేశీయ సంస్థ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో ఫోక్స్‌వ్యాగన్‌ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. స్కోడా ఇండియాలో నియంత్రణ వాటాను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌ దక్కించుకునే అవకాశం ఉందనీ చెబుతున్నారు. ఇందుకోసం కంపెనీ విలువ, పెట్టుబడి పరిమాణం, భవిష్యత్తులో పెట్టాల్సిన మూలధనం వంటి అంశాలపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం కుదిరితే, 2007లో మన దేశంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఫోక్స్‌వ్యాగన్‌కు ఇదే అతిపెద్ద వ్యూహాత్మక మార్పుగా నిలుస్తుందని సమాచారం.

# ప్రీమియంకే ఓటు

## ఆ రకం ఇళ్లకే అధిక డిమాండ్‌ • 71% రూ.కోటి పైబడినవే!



**దిల్లీ:** దేశంలో ప్రీమియం ఇళ్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుత క్యాలెండర్‌ సంవత్సరం తొలి అర్ధ భాగంలో రూ.కోటిన్నర నుంచి రూ.3 కోట్ల ధర కలిగిన నివాస గృహాల విక్రయాలు.. ఏడాది క్రితంతో పోలిస్తే 58 శాతం పెరిగాయి. ఆరు నెలల వ్యవధిలో మొత్తం 51,231 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఈ మేరకు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రియల్‌ ఎస్టేట్‌ ట్రెండ్స్‌ను స్థిరాస్తి కన్సల్టెంట్‌ జేఎల్‌ఎల్‌ ఇండియా తాజాగా వెల్లడించింది. హైదరాబాద్‌, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె, ముంబయిలలో కలిపి ఈ ఏడాది జనవరి-జూన్‌ మధ్య 138,382 యూనిట్లు అమ్ముడైనట్లు తెలిపింది. కొత్తగా 1.68 లక్షల యూనిట్లు లాంచ్‌ అయినట్లు నివేదిక తెలిపింది. ఏడు ప్రధాన నగరాల్లో అమ్ముడైన ఇళ్లలో రూ.1 కోటి కంటే ఎక్కువ విలువైన ఇళ్ల వాటా 71 శాతానికి చేరినట్లు నివేదిక తెలిపింది. గతేడాది ఇదే సమయానికి ఈ వాటా 62 శాతంగా ఉంది. రూ.1.5-రూ.3 కోట్ల ధరల శ్రేణిలో విక్రయాలు 58 శాతం పెరిగినట్లు తెలిపింది. అదే సమయంలో అందుబాటు ధరలో ఇళ్ల మార్కెట్‌ అంతకంతకూ క్షీణిస్తోంది. రూ.50 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఇళ్ల విక్రయాలు 32 శాతం తగ్గగా.. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న ఇళ్ల అమ్మకాలు 20 శాతం పడిపోయాయి. మొత్తం ఇళ్ల విక్రయాల్లో గతేడాది 39 శాతంగా ఉన్న వీటి వాటా ఈ ఏడాది 28 శాతానికి తగ్గింది. ఇళ్ల విక్రయాల్లో బెంగళూరు నగరం ముందు వరుసలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 16 శాతం వృద్ధితో 35,017 యూనిట్లు ఈ నగరంలో అమ్ముడయ్యాయి. ఇక్కడ ఇళ్ల ధరలు గరిష్ఠంగా 15 శాతం మేర పెరిగాయి. 27 శాతం వృద్ధితో చెన్నై (8,587 యూనిట్ల) రెండో స్థానంలో నిలిచింది. పుణె (-14 శాతం), హైదరాబాద్‌ (-3), ముంబయి (-1) కోల్‌కతా (-1 శాతం) మాత్రం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ముంబయి, బెంగళూరు, పుణె, దిల్లీ-ఎన్‌సీఆర్‌ నగరాలే మొత్తం అమ్మకాల్లో 76 శాతం వాటాను కలిగి ఉన్నాయని నివేదిక తెలిపింది.

# హిట్లర్‌ పుట్టిన భవనం.. ఇప్పుడు పోలీసు స్టేషన్‌గా!

బెర్లిన్‌:జర్మన్‌ నియంత అడాల్ఫ్‌ హిట్లర్‌ జన్మించిన భవనం.. సుదీర్ఘ సంప్రదింపులు, చర్చల అనంతరం చివరకు ఓ కొత్త రూపు సంతరించుకుంది. పోలీస్‌ స్టేషన్‌గా మార్పు చేసుకొని, సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఆ భవనం నియో-నాజీలకు ఆరాధ్య కేంద్రంగా మారకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్న ఆస్ట్రియా ప్రభుత్వం పునరుద్ధరణ చేసి ఇలా మార్చింది. జర్మనీ-ఆస్ట్రియా సరిహద్దులోని బ్రౌనౌ ఆమ్‌ ఇన్‌ పట్టణంలో అడాల్ఫ్‌ హిట్లర్‌ 1889లో జన్మించారు. అనంతరం హిట్లర్‌ కుటుంబం అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత కొంతకాలం పాటు ఆర్ట్‌ గ్యాలరీగా పేరొందింది. హిట్లర్‌ జన్మస్థలం గురించి తెలిసిన వారు ఆ భవనాన్ని ప్రత్యేక ప్రదేశంగా చూసేవారు. కొన్నాళ్ల క్రితం వరకు ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఉన్న ఆ భవనంలో.. దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థను నడిపించారు. అయితే, 2017లో దీనిని కొనుగోలు చేసిన ఆస్ట్రియా ప్రభుత్వం పునరుద్ధరణ చేపట్టింది. హిట్లర్‌తో ఏ విధమైన సంబంధం లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆస్ట్రియా అంతర్గత వ్యవహారాలశాఖ వెల్లడించింది. ఆయన నేరాలు యావత్‌ ప్రపంచానికి తెలుసునని పేర్కొంది.







# ఎల్‌ఐసీ, ఈపీఎఫ్‌వో అన్‌క్లెయిమ్డ్‌ నిధులు ఇతర అవసరాలకు వాడబోం: కేంద్రం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ, ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్‌వోలోఎవరూ క్లెయిమ్‌ చేయని నిధులకు సంబంధించి కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఆ ఖాతాల్లోని సొమ్మును ఇతర అవసరాలకు వినియోగించే ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్‌ చౌదరి ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఐఆర్‌డీఏఐ నిబంధనల ప్రకారం.. 10 ఏళ్లకు పైగా క్లెయిమ్‌ చేయకుండా ఉన్న బీమా నిధులను సీనియర్‌ సిటిజన్‌ వెల్ఫేర్‌ ఫండ్‌ (ూఅచిఈ)కు బదిలీ చేయాల్సి ఉంటుందని పంకజ్‌ చౌదరి తెలిపారు. వాటిని ఇతర అవసరాలకు వినియోగించుకునే ఉద్దేశమేదీ లేదన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఎల్‌ఐసీలో రూ.7,318.50 కోట్ల అన్‌క్లెయిమ్డ్‌ నిధులు ఉన్నాయని చెప్పారు. ఇందులో రూ.5,564.55 కోట్లు పాలసీదారుల అసలు కాగా, రూ.1,753.95 కోట్లు ఆ నిధులపై వచ్చిన వడ్డీ మొత్తం ఉందని వివరించారు. ఇక ఈపీఎఫ్‌ఓ ఖాతాల్లో రూ.9,330.56 కోట్ల అన్‌క్లెయిమ్డ్‌ నిధులు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ఎవరూ క్లెయిమ్‌ చేయని మొత్తాలను నామినీలకు చేర వేసేలా ఎల్‌ఐసీ, ఈపీఎఫ్‌ఓ తమ వంతు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈపీఎఫ్‌వోలో రూ.వెయ్యి లేదా అంతకంటే తక్కువ అన్‌క్లెయిమ్డ్‌ డిపాజిట్లు ఉన్న ఆధార్‌ వెరిఫైడ్‌ ఖాతాల్లోకి నేరుగా నిధులను బదిలీ చేసేలా పైలట్‌ ప్రాజెక్ట్‌ చేపట్టామని తెలిపారు. ఇందుకు ఎలాంటి డాక్యుమెంట్‌ వెరిఫికేషన్‌ చేయడం లేదని చెప్పారు. 'నిధి ఆప్‌కే నికత్‌' క్యాంపులు, సామాజిక మాధ్యమాలు, అధికారిక వెబ్‌సైట్‌, ఉత్తరాలు, లోకల్‌ ఏజెంట్లు, బీమా సఖిలు, క్రెడిట్‌ బ్యూరో ఏజెంట్ల ద్వారా పాలసీదారులను, నామినీలను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.

# ఇప్పట్లో ఇరాన్‌ను వదిలే ప్రసక్తే లేదు

వాషింగ్టన్‌(జనంసాక్షి):అమెరికా-ఇరాన్‌ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ మరో వార్నింగ్‌ ఇచ్చారు. ఇప్పట్లో ఆ దేశాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. నతాంజ్‌ అణు కేంద్రానికి సమీపంలో ఉన్న పికాక్స్‌ పర్వతంపై భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు. వాటి కింద ఉన్న రహస్య భూగర్భం (ఎతీజీనితిజీని నిబీఇశ్రీవజీతీ బతిబివ)లో ఆ దేశం అణు కార్యక్రమాలు తిరిగి ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. మళ్లీ అణ్వాయుధాలను తయారు చేయకుండా ఆపడానికి దానిని పూర్తిగా నాశనం చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఇరాన్‌పై జరిగిన దాడులు కేవలం ట్రైలర్‌ మాత్రమే అని.. త్వరలో సినిమా చూపిస్తామంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్‌ వద్ద దాదాపు 1,000 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియం ఉందని ట్రంప్‌ పేర్కొన్నారు. దానితో పికాక్స్‌ పర్వతం కింద తన అణు కార్యక్రమాన్ని చేపట్టడానికి ఆ దేశం చర్యలు తీసుకుంటున్నట్లు తమవద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. దానిని ధ్వంసం చేసి.. యురేనియం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడానికి త్వరలో సైనిక చర్య చేపడతామన్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో తీవ్ర విధ్వంసం తప్పదని హెచ్చరించారు.

**ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు..**

ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగిస్తోంది. రాజధాని టెహ్రాన్‌ సహా దేశంలోని పలు నగరాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్‌ సెంటర్లు, డ్రోన్‌ స్టోరేజీ సైట్లు, పలు పౌర నివాసాలపై అమెరికా బాంబు దాడులు చేసినట్లు తెలిపారు. చాబహార్‌ పోర్టుపై అగ్రరాజ్యం మళ్లీ క్షిపణులతో విరుచుకుపడింది. మరోవైపు అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఖతార్‌, కువైట్‌, బహ్రెయిన్‌పై ఇరాన్‌ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది.

**మునీర్‌కు మొజ్తబా ఖమేనీ రహస్య సందేశం..:** అమెరికా-ఇరాన్‌ శాంతి చర్చలకు పాకిస్థాన్‌ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఇరాన్‌ మంత్రి మొమేనీ.. పాక్‌ ఆర్మీ చీఫ్‌ మునీర్‌తో 50 నిమిషాలపాటు రావల్పిండిలో భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం మొజ్తబా ఖమేనీ పంపిన రహస్య సందేశాన్ని ఆయన మునీర్‌కు అందించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

**నౌకలపై దాడి చేస్తే.. ఇరాన్‌లోని వంతెనలపై విరుచుకుపడతా:ట్రంప్‌**

హర్మూజ్‌ జలసంధిలో ఇరాన్‌ ఇకనుంచి ఏదైనా నౌకపై దాడి చేసినప్పుడల్లా.. ఆ దేశంలోని ఓ వంతెన లేదా విద్యుత్‌ కేంద్రంపై బాంబులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ హెచ్చరించారు. టెహ్రాన్‌లో లేదా దాని సమీపంలో కూడా దాడి చేసే అవకాశం ఉందన్నారు. ఈమేరకు ట్రూత్‌ సోషల్‌లో ఆయన పోస్టు చేశారు. అమెరికా, ఇరాన్‌ మధ్య ఉద్రిక్తతలు ఇప్పటికే తీవ్రమయ్యాయి. ఇరుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న విషయం తెలిసిందే. పికాక్స్‌ పర్వతాన్ని ధ్వంసం చేస్తామని ఇటీవల ట్రంప్‌ హెచ్చరించిన నేపథ్యంలో ఇరాన్‌ కూడా దాడులను ముమ్మరం చేసింది. మరిన్ని దాడులకు పికాక్స్‌ పర్వతాన్ని సాకుగా వాడుకుంటున్నారని ఆరోపించిన ఇరాన్‌.. జోర్డాన్‌లోని పలు ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. అయితే, వాటిని సమర్థంగా అడ్డుకున్నామని జోర్డాన్‌ సైన్యం వెల్లడించింది. మరోవైపు, ఎర్ర సముద్రంలో సౌదీ నౌకలను దిగ్బంధనం చేస్తామని యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు హెచ్చరించిన విషయం తెలిసిందే.

# హెచ్‌సీఎల్‌ టెక్‌ సీఈఓ పారితోషికం రూ.175 కోట్లు

## భారత ఐటీ కంపెనీల సారథుల్లో విజయకుమార్‌కే ఎక్కువ

**న్యూఢిల్లీ:** హెచ్‌సీఎల్‌ టెక్నాలజీస్‌ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) సి.విజయకుమార్‌, గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 18.13 మిలియన్‌ డాలర్ల (సుమారు రూ.175 కోట్ల) పారితోషికాన్ని అందుకున్నారు. 2024-25 పారితోషికం కంటే ఇది 66.9% ఎక్కువ. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న విజయకుమార్‌... హెచ్‌సీఎల్‌ టెక్‌ అనుబంధ సంస్థ అయిన హెచ్‌సీఎల్‌ అమెరికా ఇంక్‌ ద్వారా వేతనాన్ని తీసుకుంటున్నారు. ప్రధానంగా దీర్ఘకాలిక ప్రోత్సాహకాలు (ఎల్‌టీఐ), స్టాక్‌ ఆప్షన్‌ల వల్లే ఆయన పారితోషికం బాగా పెరిగిందని కంపెనీ వార్షిక నివేదిక ఆధారంగా తెలుస్తోంది. 2025-26లో విజయకుమార్‌ అందుకున్న 18.13 మిలియన్‌ డాలర్ల పారితోషికంలో ఎల్‌టీఐ 3.94 మిలియన్‌ డాలర్లు కాగా.. రెస్ట్రిక్టెడ్‌ స్టాక్‌ యూనిట్స్‌ (ఆర్‌ఎస్‌యూ) ద్వారా లభించిన మొత్తం 9.40 మిలియన్‌ డాలర్లుగా ఉంది. మూలవేతనం 2.48 మిలియన్‌ డాలర్లు, పనితీరు ఆధారిత బోనస్‌ 2 మిలియన్‌ డాలర్లు, ఇతర ప్రయోజనాలు 3.1 లక్షల డాలర్లు చొప్పున ఉన్నాయి. ఎల్‌టీఐ, ఆర్‌ఎస్‌యూ విలువను మినహాయిస్తే.. విజయకుమార్‌ పారితోషికంలో పెరుగుదల 22.86 శాతానికి పరిమితం అవుతుందని కంపెనీ తెలిపింది. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థల సీఈఓలతో పోలిస్తే విజయకుమార్‌ పారితోషికమే అధికంగా ఉంది. 2025-26లో టీసీఎస్‌ సీఈఓ, ఎండీ కె కృతివాసన్‌కు రూ.28 కోట్లు, ఇన్ఫీ సీఈఓ సలీల్‌ పరేఖ్‌కు రూ.82.60 కోట్లు, విప్రో సీఈఓ శ్రీనివాస్‌ పల్లియాకు రూ.49.64 కోట్ల పారితోషికం లభించింది. హెచ్‌సీఎల్‌ టెక్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం ఉద్యోగుల మధ్యస్థ వేతన విలువతో పోలిస్తే విజయ్‌కుమార్‌ పారితోషికం 291.90 రెట్లు అధికంగా ఉంది.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 జూలై 2026

కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో నిర్వహించిన పరీక్షలలో 152 సార్లు పేపర్లు లీక్ కావడం దురదృష్టకరమన్నారు. ఇవన్నీ కూడా తప్పిదాలు జరిగాయన్నారు. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్, కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ ప్రభావం యువతపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత రంగంలో ముందడుగు వేయాల్సిన యువత తమ భవిష్యత్తును కోల్పోతారని తెలిపారు. నీట్ పరీక్షల ఓఎంఆర్ సీట్లను ఆడిట్ చేయాలని డిమాండ్ చేశారు. వాటిని బయటపెట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకులకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.




# నరేంద్ర మోడీపై నమ్మకం పోయింది

- తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు
- 12 ఏళ్లలో 152 సార్లు పేపర్ లీకులు
- పరీక్షలు రాసిన ఏడు కోట్ల 50 లక్షల మంది విద్యార్థులు
- నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించాలి - ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**రంగారెడ్డి, జూలై 22 (జనంసాక్షి) :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పై యువతకు, విద్యార్థులు, ప్రజలకు నమ్మకం పోయిందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. నీట్ పరీక్షల పేపర్ లీక్‌లకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనలో పోలీసుల లాఠీచార్జి ఏమైందని మండిపడ్డారు. లాఠీచార్జికి నిరసనగా కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ మద్దతుగా ఆందోళన చేస్తే, అరెస్టు చేసే విధానం సరికాదని మండిపడ్డారు.
అందుకు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థి లోకానికి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్ గూడాలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో బుధవారం 'ఛాత్రోన్ కి గూంజ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పరిధిలో నిర్వహించే నీట్ లీక్ కావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి కారకులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. మొదట నిర్వహించిన నీట్ ఎగ్జామ్ లీక్ తర్వాత రెండవసారి నిర్వహించిన నీట్ ఎగ్జామ్‌పై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా కేంద్ర హోం మంత్రి నోరు విప్పకపోవడం ఆందోళనకర మన్నారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి అటు పార్లమెంటులో ఇటు పార్లమెంటు బయట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు పక్ష నేత రాహుల్ గాంధీని సైతం అరెస్టు చేయడం ఏమైనా చర్యన్నారు.
తమకు 500 పైగా మార్కులు వస్తాయనుకున్న అనేక మంది విద్యార్థులకు 50, 60 మార్కులు మాత్రమే వచ్చాయని తెలిపారు. అందుకే విద్యార్థి లోకానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పై నమ్మకం పోయిందన్నారు. విద్యార్థులు రాసిన నీట్ పరీక్షల ఓఎంఆర్ సీట్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అందుకనే పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమస్త ప్రజలు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 28 కేంద్రాల్లో 'ఛాత్రోన్‌కి గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పేపర్ లీకేజీలపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు సికిందర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షులు సయ్యద్ ఖలీద్, యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు నాగార్జున, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌస్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులందరిని అన్‌ఫిట్ చేయాలి

- గనులు, డిపార్ట్మెంట్లపై అధికారులకు వినతి పత్రాలు



**గోదావరిఖని, జూలై 22 (జనంసాక్షి) :** సింగరేణిలో ఈనెల 17,18 తేదీలలో యాజమాన్యం నిర్వహించిన మెడికల్ బోర్డులో కేవలం 24 మందిని మాత్రమే అన్ ఫిట్ చేసిందని, ఇది సరైంది కాదని దుర్మార్గమైన చర్య అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మండిపడ్డారు. అనారోగ్యం తో బాధపడుతూ విధులు నిర్వహించలేని కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారందరిని అన్ ఫిట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్జీ వన్ ఏరియాలో ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మందిని బోర్డుకు పిలవగా వారిలో 28 గైర్హాజరయ్యారని, మిగిలిన 92 మందిలో 24 మందిని మాత్రమే కంపెనీ అన్‌ఫిట్ చేయటం బాధాకరమన్నారు. ఈ నెల జరిగిన మెడికల్ బోర్డు ను పునః సమీక్ష చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ నాయకులు బోగ సతీష్ బాబు, ఎస్ వెంకట్ రెడ్డి, దొంత సాయన్న, కే.శ్రీనివాస రావు, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, గోదిశల నరేష్, బలుసు రవి, బండి మల్లేష్, ఇజ్జగిరి రాజు, అటికేటి రాజు, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు రైతాంగానికి తీవ్ర నష్టం

## ఒప్పందాలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తాం : సంయుక్త కిసాన్ మోర్చా




**ముషీరాబాద్, జూలై 22 (జనంసాక్షి):** భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు రైతు, ప్రజా వ్యతిరేకమైనవని, వాటిని పూర్తిగా రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) తెలంగాణ రాష్ట్ర నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ నారాయణగూడ బ్రిడ్జి కింద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్లు తీగల సాగర్, పశ్య పద్మ, జక్కుల వెంకటయ్య, భగవంతు, వి. నాగిరెడ్డి, చంద్రారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు.
ఈ వారు మాట్లాడుతూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల అమలుతో విదేశీ సబ్సిడీ ఉత్పత్తులు దేశీయ మార్కెట్లోకి ప్రవేశించి భారత రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వ్యవస్థ, ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. రైతులు తమ సొంత విత్తనాలను వినియోగించే హక్కును కూడా కోల్పోయే పరిస్థితులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (ఔమో) నిబంధనలకు అనుగుణంగా రైతు ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి ఒప్పందాలపైనా కేంద్ర ప్రభుత్వం సంతకం చేయకూడదని వారు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు ఉత్పాదక వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని, చిన్న, సన్నకారు, కౌలు రైతుల వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, అరిబండి ప్రసాద్ రావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. వెంకటేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, సీఐటీయూ నాయకులు ప్రదీప్‌తో పాటు రైతు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ

# కేంద్ర ప్రభుత్వం దిగిపోవాలి

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, జూలై 22 (జనం సాక్షి) :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిని నిరసిస్తూ, ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పార్టీ కీలక నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి నేతృత్వంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి స్థానిక అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు మరియు జీవితాలతో ఆడుకునేలా ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం కనీస బాధ్యత లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. లోపాలను ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులతో అణచివేత చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి నేటి వరకు గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బ్రిటిష్ పాలనను తలపిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేశంలో మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొయినాబాద్ మున్సిపల్ కార్మికులకు సామాగ్రి ఇవ్వాలి

### సీఐటీయూజిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్




**మొయినాబాద్ జూలై 22 జనం సాక్షి :** మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు సామాగ్రి అందజేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు పారిశుద్ధ్య సామాగ్రి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు బుధవారం కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి శానిటేషన్ ఇన్ స్పెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం అల్లి దేవేందర్ మాట్లాడుతూ మొయినాబాద్ మున్సిపల్ కార్మికులకు సబ్బులు నూనెలు గ్లౌజులు ఇతర సామాగ్రి అందజేయకపోవడం సరికాదు అన్నారు. సామాగ్రి కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తున్న కాలయాపన చేస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్ పురపాలక సంఘం ఏర్పడి అనేక రోజులు గడుస్తున్న కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులు ఇవ్వలేరని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయడం లేదన్నారు వెంటనే మున్సిపల్ కార్మికులకు పారిశుద్ధ్య సామాగ్రి, వర్షాకాలపు రైన్ కోట్స్ ఇవ్వాలని లేని పక్షంలో విధులు బహిష్కరించి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో సీఐటీయూ మొయినాబాద్ మండల కన్వీనర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, మండల నాయకులు రామచందర్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు కృష్ణ, మున్సిపల్ కార్మికులు ఎలక్ట్రిషన్లు వాటర్ మ్యాన్లు పాల్గొన్నారు.



# గంగారం చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయండి : అరికెపూడి

**శేరిలింగంపల్లి, జూలై 22 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధి గంగారం చెరువు సుందరీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదేశించారు. గంగారం చెరువువద్ద కొనసాగుతున్న అభివృధి పనులను మియాపూర్ సర్కిల్ డిసి శ్రీనివాస్, హైడ్రా ఇన్స్పెక్టర్ యూనస్ మరియు హైడ్రా అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ గంగారం చెరువు సుందరీకరణ మరియు అభివృద్ధి పనులను పక్కా ప్రణాళికలతో ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనులలో వేగం పెంచాలని, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులకు తెలియచేశారు. గంగారం చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు చేపడుతున్నామని త్వరలోనే చెరువును అన్ని హంగులతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని గాంధీ వివరించారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, చెరువు చుట్టూ డ్రైనేజీ పైప్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుకూడా నిర్మిస్తామని, ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం అందించ డానికి కృషి చేస్తామన్నారు.
చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులపై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని చైర్మన్ గాంధీ తెలియచేశారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువుచుట్టూ ఫెన్సిగ్(కంచె) నిర్మాణం, చెరువు అలుగు నిర్మాణము, సుందరికరణ పను లను నాణ్యతా ప్రమాణాలతో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

### నార్సింగిలో డ్రెయిన్, సీసీ రోడ్ల పనులకు వేగవంతం చేయాలి

రాజేంద్రనగర్, జూలై22(జనంసాక్షి) నార్సింగి వార్డులో వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పర్యటించి బాలాజీ నగర్‌లో నీటి నిల్వ సమస్యలను శానిటేషన్ సూపర్వైజర్ లచ్చిరాంతో కలిసి పరిశీలించారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్రతిపాదించిన ఎస్ఎన్డిపి బాక్స్ డ్రెయిన్ పనులను వేగంగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అనంతరం శివపురి కాలనీ, గ్రీన్‌ల్యాండ్స్, మంచిరేవుల ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రీ-ఇన్స్పెక్షన్ నిర్వహించారు. త్వరలో పరిపాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు.

# మొండిగౌరెల్లిలో తీవ్రతరమైన భూ సేకరణ నిరసనలు

### మూడవరోజుకు చేరుకున్న నిరాహార దీక్ష



2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించకుంటే హైకోర్టును ఆశ్రయిస్తాం: తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు
యాచారం,జులై 22(జనం సాక్షి) : రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు కోసం చేపడుతున్న భూ సేకరణలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ చేపట్టిన నిరాహార దీక్ష బుధవారానికి మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షా శిబిరానికి గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పూర్తి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా గోడుకొండ్ల ప్రవీణ్ మాట్లాడుతూ... "సర్వే నంబర్లు 19, 68, 127లలోని 677.29 ఎకరాల భూమి సేకరణ ప్రక్రియలో అధికారులు రైతుల అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారు. రికార్డు భూములు మరియు దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న కబ్జా భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం, ప్రస్తుత నూతన మార్కెట్ విలువను బట్టి పరిహారం చెల్లించాలి. రెవెన్యూ అధికారులు, కొంతమంది స్థానిక నాయకులు కుమ్మక్కై రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చట్టాలను అమలు చేయనప్పుడు వాటిని రూపొందించడం ఎందుకు?" అని ప్రశ్నించారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించకపోతే బాధితులతో కలిసి హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు.
ఈ భూ సేకరణలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఏడీ సర్వేయర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా రీ-సర్వే నిర్వహించాలని, ఈ ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే రికార్డు భూములు, కబ్జా భూములకు సంబంధించిన నష్టపరిహార చెక్కులను ఒకేసారి పంపిణీ చేయాలన్నారు. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ, ఎస్ఐలతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. రైతులు, నాయకుల సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్న ఏసీపీ, సమస్యల పరిష్కారానికి తన వంతుగా అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని సమితి నాయకులు తేల్చిచెప్పారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి యత్నం

### మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులపై కరీంనగర్ సీపీకి బీజేపీ ఫిర్యాదు



**కరీంనగర్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజ య్ కుమార్ స్థానిక కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు దాడికి యత్నించారు. ఈ ఘటనకు బాధ్యు లైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరు తూ, కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం ప్రకాష్ , కో-ఆప్షన్ సభ్యులు, బీజేపీ నాయకులు కరీంనగర్ పోలీస్ కమిషన ర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుధవారం రోజు మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో పాటు సుమారు 50 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలోకి అక్రమంగా చొరబడ్డా రు. కార్యాలయ సిబ్బంది పై దాడికి యత్నించడంతో పాటు, వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు గురిచేశారు. వి ధి నిర్వహణలో ఉన్న కార్యాలయ సిబ్బందికి ప్రాణహాని కలిగిం చేలా ప్రవర్తించారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులను సైతం అడ్డుకుని, వారి విధులకు ఆటంకం కలిగించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ఎంపీ కార్యాలయంలోకి చొరబడి సిబ్బంది పై దాడికి యత్నించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహా ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఈ ఫిర్యాదును స్వీకరించింది.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- ఆరుతడి, స్వల్పకాలిక పంటలు వేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వాన నీటిని సంరక్షించాలి...నీటి వృథాను అరికట్టాలి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** ఎల్-నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్-నినో పరిస్థితుల ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు పై చందుర్తి మండలం మల్యాలలో బుధవారం గ్రామసభ నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నీటి పారుదల శాఖ అధికారి రిజర్వాయర్లలో నీటి నిల్వలపై వివరించారు. ఇప్పుడు ఉన్న నీరు తాగునీటికే వినియోగిస్తామని, పంటల సాగుకు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు.
అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావం అందరిపై ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఎల్-నినో ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు. చందుర్తి మండలంలో గత ఏడాది 328 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయిందని తెలిపారు. ఈ ఏడాది 230 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని వివరించారు. భూగర్భ జలాలు గత ఏడాది 4.38 మీటర్ల లోతులో ఈ ఏడాది 8.53 మీటర్ల లోపలికి వెళ్లాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్కల తిరుపతి, వేములవాడ ఆర్డీవో కే.ఎస్.బీ. కుమారి, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయి కుమార్, హౌసింగ్ డీఈ సాజిద్, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, సర్పంచ్ శారద పాల్గొన్నారు.

# న్యాయం అడిగితే లాఠీలతో సమాధానమా?

- ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దమనకాండకు, నిరసనగా, షాద్ నగర్‌లో ప్రజాసంఘాల నిరసన




**ఫరూఖ్ నగర్ జూలై 22 (జనంసాక్షి) :** పరీక్షల నిర్వహణలో అవక తవక లు జరిగి పేపర్ లీకేజీలపై బాధ్యత వహించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన చలో సంసద్, నిరసన కార్యక్రమంలో విద్యార్థులు యువత మరియు ఇతర నిరసనకారులపై పోలీసుల లాఠీ ఛార్జ్ చేయడం భాష్పా వాయువు ప్రయోగించడం న్యాయం అడిగితే లాఠీలతో సమాధానం చెప్పడమా అంటూ ప్రజాసంఘాల నాయకులు నిరసన చేపట్టారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని అమరవీరుల స్థూపం నుండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యలు పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల ప్రజాస్వామ్య హక్కు విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి గొంతులను పోలీసు బల ప్రయోగంతో అణచివేయడానికి ప్రయత్నించడం ఆందోళనకరం ముఖ్యంగా యువత భవిష్యత్తును ప్రభావితం చేసే పరీక్షల నిర్వహణలో పారదర్శకత జవాబుదారి తన ఉండాలని కోరడం నేరం కాదు ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై స్వతంత్ర నిష్పక్ష విచారణ జరిపి నిరసనకారులపై జరిపిన అనవసరమైన లేదా మితిమీరిన బల ప్రయోగానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం గాయపడిన ఇతర విద్యార్థులు మరియు నిరసనకారులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అదుపులోకి తీసుకున్న వారిపై చట్ట విరుద్ధమైన చర్యలు జరగకుండా వారి హక్కులకు భంగం కలగకుండా పరిరక్షించాలని డిమాండ్ చేశారు విద్యార్థుల ప్రశ్నలకు లాఠీలు సమాధానం కాదని ప్రభుత్వం మౌనం వీడి సందేహాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు యువత గొంతును అణచివేయడం ప్రజాస్వామ్యనీ బలహీనపరచడమేనని కేంద్ర ప్రభుత్వం విద్యార్థి ప్రతినిధులతో తక్షణమే చర్చలు జరిపి వారి యొక్క న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ఉపాధ్యాయ సంఘాల ప్రజాసంఘాల నాయకులు వెంకటరమణ, నర్సింలు గౌడ్, తిరుమలయ్య, రవీంద్రనాథ్, శ్రీకాంత్, పవన్ చౌహన్ ,కరుణాకర్ శివారెడ్డి, వెంకటయ్య, బిజిలీ సత్యం, వలిగే కృష్ణ చంద్రశేఖర్, రాములు ,శ్రీను నాయక్, నక్క బాల్ రాజ్ అర్జునప్ప, జనార్ధన్, లక్ష్మీదేవమ్మ, అరుణ, కవిత, కళ్యాణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## వరద కాలువలో నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలి

**కథలాపూర్, జూలై 22(జనం సాక్షి) :** వర్ద కాలువ ఆయకట్టు రైతుల జాయింట్ యాక్షన్ కమిటీ బాల్కొండ, మెట్టుపల్లి కోరుట్ల, కథలా పూర్, మేడిపల్లి ప్రాంత రైతుల సమావేశం. కథలాపూర్ మండల కేంద్రంలో వారు మాట్లా డుతూ వరదకాలువలో నీళ్లు మరో రెండు రోజుల్లో డెడ్ స్టోరేజీ కి వచ్చే ప్రమాదం ఉంది ఇప్పటికే రైతులు ఇప్పటికే పుట్టెడు కష్టాల్లో కొట్టుమిట్టాడు తున్నారు కనుక ప్రభుత్వం అధికార పార్టీ నాయకులు వెంటనే స్పందించి రాజకీయాలు పక్కన పెట్టి రైతుల ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని వరదకాలువ లో నీళ్లు నింపి పంటలు కాపాడి రైతులను ఆదుకోవాలి అని వరదకాలువ ఆయకట్టు రైతుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ప్రభుత్వంను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, ఇట్టేడి ప్రకాష్ రెడ్డి, బద్ధం మహేందర్ రెడ్డి, రిక్కల సంజీవ్,కందర్ లాలీ పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు రోడ్డు భద్రత చర్యలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాలు
- స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు ఏర్పాటు
- ప్రమాదాలను తగ్గించేందుకు సమన్వయం
- 60 రోజుల్లో పనులు పూర్తి చేయాలి



**జగిత్యాల బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలను కట్టుదిట్టం గా అమలు చేసి, అవసరమైన అన్ని చర్యలను 60 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్‌పర్సన్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధ వారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై జిల్లా కలెక్టర్ సంబం ధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను వివరించారు. జాతీయ రహదారులపై పార్కింగ్ నిషేధం, ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి వ్యవస్థ ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, హైవే భద్రతా పరిధిలో అనధికార వ్యాపారాల నియంత్రణ, హైవే సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, హైవే సర్వేలెన్స్ పెట్రోలింగ్, అత్యవసర స్పందన వ్యవస్థ, వే సైడ్ అమెనిటీస్ (ఔూూ), స్పీడ్ డిటెక్టర్లు, సీసీ కెమెరాలు, సైన్‌బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు, ప్రతి 75 కిలోమీటర్లకు ట్రక్ లే-బై సదుపాయాలు, బ్లాక్‌స్పాట్ల అభివృద్ధి, హైమాస్ట్ లైటింగ్, అంతర్రాష్ట్ర సమన్వయం, సమగ్ర స్పందన నివేదికలపై సమావేశంలో వివరించారు.

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో డిస్ట్రిక్ట్ హైవే సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టులకు పసుపు రంగు గుర్తులు వేయించి ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.


సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు జాతీయ రహదారుల వెంట ఆక్రమణలను తొలగించి నిఘా, పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. స్పీడ్ డిటెక్టర్లు, సీసీ కెమెరాలు, సైన్‌బోర్డు లు, ఎమర్జెన్సీ కాల్ బాక్సుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ మొత్తం 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీసు శాఖ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు సమావేశమై రోడ్డు ప్రమాదాల నివార ణ చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వారి కోసం అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నంబర్-1033పై విస్తృత అవగాహ న కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించక పోవడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై నిరంతర అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆర్‌డబీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫైర్ భద్రతా ప్రమాణాలు ఉన్న ఆసుపత్రులకే ఎన్‌ఓసీ ఇవ్వాలి: ఏఐఎఫ్‌బి

**కరీంనగర్ టౌన్, జూలై 22, (జనం సాక్షి) :** ప్రైవేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలకు పూర్తి స్థాయి అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు ఉంటేనే ఫైర్ ఎన్‌ఓసీ మంజూరు చేయాలని, రెన్యూవల్ చేయాలని అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీం నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.నేషనల్ బిల్డింగ్ కోడ్, తెలంగాణ అగ్నిమాపక చట్టం ప్రకారం ఫైర్ స్ప్రింక్లర్లు, అలారాలు, అండర్‌గ్రౌండ్ వాటర్ ట్యాంకులు, అత్యవసర నిష్క్రమణ ద్వారాలు వంటి భద్రతా ప్రమాణాలు ఉన్న భవనాలకు మాత్రమే అనుమ తులు ఇవ్వాలని కోరారు. స్పందించిన జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి, క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించిన సంస్థలకే కొత్త అనుమతులు, రెన్యూవల్స్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ, భద్రతా ప్రమాణాలు లేని ఆసుప త్రులు, విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేస్తే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## రూ 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల

- అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు ఒకే వేదిక
- ఏడాదిన్నర లోపు ప్రారంభం



**బోధన్, జూలై 22 (జనంసాక్షి) :** బోధన్ నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఒకే వేదిక వద్ద విద్యాభ్యాసం, వసతి కల్పించే విధంగా 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టనున్నట్లు బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పంచాయతీరాజ్ శాఖ ఈఎన్సీ గణపతి రెడ్డితో కలిసి బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా పాఠశాల స్థలాన్ని పరిశీలించడంతో పాటు పాఠశాలల గదుల నిర్మాణం, వసతులు, ఇండోర్ మైదానం ఇతర సౌకర్యాలపై డెమోనో పరిశీలించారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణంతో నియోజకవర్గంలోని అన్ని వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన విద్యార్థినిలు ఇక్కడ విద్యాభ్యాసం పొందే అవకాశం ఉందన్నారు. ఒకేసారి 1300 మంది విద్యార్థినిలు భోజనం చేసే విధంగా అలాగే 2500 మంది విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు బోధించే ఉపాధ్యాయులకు సైతం వసతి సౌకర్యం కల్పించే విధంగా నిర్మాణం చేపట్టినట్లు ఆయన వివరించారు. చిన్న తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఎక్కడికి వెళ్లకుండా ప్రభుత్వమే చదివించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఏడాదిన్నర లోపు ఈ పాఠశాల ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సల హాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీల శాఖ ఈఎన్సి గణపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హాందాన్, బోధన్ ఆర్డీవో విజయ కుమారి, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, బోధన్ పట్టణ పార్టీ అధ్యక్షులు అంకు దాము, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ నేతలు, డిసిసి చీఫ్ మేడిపల్లి సత్యం
- నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించాలి - ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



**కరీంనగర్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ రోడ్డులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఈ దేశంలో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తే ఆ పరీక్ష లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే క్యాబినెట్ నుండి తొలగించాలని, ఈ లీకేజీ అంశంపై పార్లమెంటులో సుదీర్ఘమైన చర్చ జరపాలని, మొన్న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు శాంతియుత నిరసన చేపడితే ఈ దేశంలోని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ప్రభుత్వం ఆ విద్యార్థి యువతపై విచక్షణ రహితంగా దాడులు చేసినట్లు మనమంతా చూశామన్నారు. ఈ విషయంపై స్పందిస్తూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం స్వయంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులు ప్రధాని ఇంటి ముందు బైఠాయించి జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువతపై దాడులు చేసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, నీట్ పేపర్ లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, అమిత్ షా క్షమాపణ చెప్పాలని, నరేంద్ర మోడీ పదవి నుండి తప్పుకోవాలని డిమాండ్ చేస్తే రాహుల్ గాంధీతో పాటు ఇతర నాయకులపై దాడులకు పాల్పడి అరెస్టులు చేయడం జరిగిందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, ఎండి తాజ్, ముత్యం శంకర్ గౌడ్, గడ్డం విలాస్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, కొరివి అరుణ్ కుమార్, మడుపు మోహన్, వెన్నం రజిత రెడ్డి, కల్లపల్లి బాలరాజు, గంట శ్రీనివాస్ కళ్యాణి, చాడ గొండ బుచ్చిరెడ్డి, నునావత్ భాస్కర్ నాయక్, పర్వత మల్లేశం, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, వరాల నర్సింగం, కాంతల జగన్ రెడ్డి, పడాల అజయ్ గౌడ్, బండారు రమేష్ గౌడ్, ముక్క భాస్కర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తగ్గుతున్న భూగర్భ జలాలు

*అర్బన్ మండలంలో అత్యధిక లోతులో నీరు : జిల్లా ఇంచార్జి భూగర్భ జల అధికారి నాగరాజు*



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 22 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూలై 2026 భూగర్భజల శాఖ నిర్వహించిన పరిశీలనల ప్రకారం జిల్లాలో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని జిల్లా ఇంచార్జి భూగర్భజల అధికారి నాగరాజు తెలిపారు. జిల్లాలో సగటు భూగర్భ జల మట్టం 12.26 మీటర్లు నమోదైందన్నారు. బోయినపల్లి మండలంలో 7.82 మీటర్లతో అత్యల్ప లోతులో భూగర్భ జల మట్టం నమోదు కాగా, వేములవాడ అర్బన్ మండలంలో 21.38 మీటర్లతో అత్యధిక లోతులో భూగర్భ జల మట్టం నమోదైందన్నారు. జూన్ 2026తో పోలిస్తే జిల్లాలో సగటున 0.71 మీటర్ల మేర భూగర్భ జల మట్టం క్షీణత నమోదైందని, జూలై 2025తో పోలిస్తే 2.91 మీటర్లు నమోదైందన్నారు.

మండలాల వారీగా భూగర్భ జల మట్టాలు జూలై 2025లో భూగర్భ జల మట్టాలు, జూలై 2026 భూగర్భ జల మట్టాలు (మీటర్లలో), జూలై 2025తో పోల్చగా జూలై 2026లో క్షీణత (మీటర్లలో): వేములవాడ అర్బన్: 18.50, 21.38, -2.88, సిరిసిల్ల: 11.51, 18.38, -6.87, వీర్నపల్లి: 12.36, 18.06, -5.70, ఎల్లారెడ్డిపేట: 16.26, 17.74, -1.48, గంభీరావుపేట: 10.82, 13.16, -2.34, తంగళ్లపల్లి: 9.40, 12.54, -3.15, ముస్తాబాద్: 11.49, 12.04, -0.55, కోనరావుపేట: 9.12, 11.54, -2.42, రుద్రంగి: 4.92, 10.44, -5.52, ఇల్లంతకుంట: 7.01, 9.22, -2.21, చందుర్తి: 4.38, 8.53, -4.15, వేములవాడ రూరల్: 5.43, 8.10, -2.67, బోయినపల్లి: 5.82, 7.82, -2.00 భూగర్భ జల వనరుల పరిరక్షణ, నీటి సంరక్షణ చర్యలను తీసుకోవాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, పంట కుంటలు, రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా ఇంచార్జి భూగర్భజల అధికారి నాగరాజు కోరారు.

**ఈ సీజన్‌లో పంటలకు నీరు ఇచ్చే అవకాశం లేదు**

ఎల్-నినో ప్రభావంతో జిల్లాలో వర్షాలు సక్రమంగా కురవకపోవడం వల్ల తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ప్రాజెక్టులలో నీటి లభ్యత తక్కువగా ఉన్న కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం నీరు ఇచ్చే అవకాశం లేదని నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ సీఈ సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఎగువ మానేరు, శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు), మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లలో తక్కువ వర్షపాతంతో జలాశయాల్లో నీరు తక్కువ ఉండడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు నీరు ఇచ్చే అవకాశం లేదని, రైతులు గమనించగలరని ఆయన కోరారు.

## వేములవాడను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

*రూ 49.50 లక్షలతో డంపింగ్ యార్డు సీసీ రోడ్డుకు భూమి పూజ*

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 22 (జనంసాక్షి) :** వేములవాడ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ పరిశుభ్రతకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా బుధవారం రూ 49.50 లక్షలతో నిర్మించనున్న డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి సీసీ రోడ్డు నిర్మాణానికి,టాయిలెట్ బ్లాక్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో తడిచెత్త,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే విధానాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.చెత్త నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో అమలు చేయడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణంతో పాటు ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. డంపింగ్ యార్డుకు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉ ఒడేందుకే సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,రోడ్ల విస్తరణ, మురుగునీరు మూలవాగు, గుడి చెరువులోకి చేరకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే 45 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

దాదాపు 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ,నాలుగు లైన్ల మూడో వంతెన నిర్మాణం తుది దశకు చేరుకుందని, భూసేకరణకు రూ 6.90 కోట్లకు పైగా వ్యయం చేశామన్నారు.ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ మౌలిక వసతులను కూడా సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సామాజిక భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎస్టీ భవన్,బీసీ భవన్,అంబేద్కర్ భవన్,క్రిస్టియన్ భవన్, షాదీఖానా తదితర భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లు పలు సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.



వేములవాడ పట్టణాభివృద్ధి,రాజన్న ఆలయాభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఆలయ అభివృద్ధి పూర్తయిన తర్వాత ఉ పాధి అవకాశాలు, పర్యాటక రంగం మరింత విస్తరిస్తాయన్నారు.ప్రజల సహకారంతో వేములవాడను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,మున్సిపల్ కౌన్సిలర్లు,ఏఈ అనన్య,ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## భూసేకరణ పనులు వేగవంతంగా చేపట్టాలి

- రెవెన్యూ-ఇరిగేషన్ సహా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- సాగునీటి, రైల్వే, రహదారి ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష
- పరిహారం చెల్లింపులు, పునరావాసం త్వరగా పూర్తి చేయాలి



**కరీంనగర్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి) :** జిల్లాలో చేపట్టిన కీలక సాగునీటి, రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారుభూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ విభాగం, నేషనల్ హైవేస్ అధికారులతో జిల్లా కలెక్ట ర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి - మనోహ రాబాద్ రైల్వే లైన్, కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలి ంచారు. ఇప్పటి వరకు ఎంత మేర భూసేకరణ పూర్తయింది, ఎంత పెండి ంగ్‌లో ఉంది, ఎదురవుతున్న సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకు ంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్ - జగిత్యాల ఫోర్‌లేన్ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత సేకరించారు, ఇంకా ఎంత మిగిలి ఉంది, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని వివరాలు తెలుసుకున్నా రు. అలాగే కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ భూసేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీలు) నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడు తూ, రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంద న్నారు. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాసం (ఆర్ అండ్ ఆర్) వంటి అంశాలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశిం చారు. భూములు, ఇళ్లు కోల్పోతున్న రైతులు, ప్రజలకు నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందించి, పునరావాస చర్యలను వేగవంతం చేయా లని స్పష్టం చేశారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటిక ప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించా రు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, కరీంనగర్ ఆర్డీవో షర్మిల, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నాలను సహించబోము

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్
- గోదావరిఖనిలో కాంగ్రెస్ ధర్నా
- రూ.7.81 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రామగుండం నగరానికి మరిన్ని మౌలిక సదుపాయాలు

**గోదావరిఖని, జూలై 22 (జనంసాక్షి) :** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన నిరసన కార్యక్రమంలో నిరుద్యోగ యువతపై దాడి చేయడాన్ని నిరసిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బుధవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం ఎదుట రాజీవ్ రహదారిపై ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ను కల్పించిందని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, విమర్శిస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం బీజేపీ ప్రభుత్వంలో నిత్యకృత్యం గా మారిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయా లను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షించేందు కు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.



**రూ.7.81 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డిఎంఎఫ్‌టి) నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం రాంనగర్‌లో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శంకుస్థాపన చేశారు. డివిజన్ నంబర్లు 2, 3, 4, 5, 6, 7, 10, 11, 12, 13, 21, 22, 23తో పాటు ఇతర డివిజన్లలో మొత్తం రూ.781 లక్షల (రూ.7.81 కోట్లు) అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఆధునికీకరించడం ద్వారా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగడంతో పాటు నగరంలో పరిశుభ్రమైన వాతావర ణం నెలకొంటుందని తెలిపారు. ప్రతి డివిజన్‌కు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి, నాణ్యమైన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంథని పట్టణ అభివృద్ధికి, మాస్టర్ ప్లాన్

- నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథనిలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు రోడ్డు విస్తరణ పనులను అధికారులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...మంథని పట్టణ సుందరికరణలో భాగంగా మంథని ప్రధాన రహదారి విస్తరణకు స్వచ్ఛందంగా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంథని పట్టణంలోకి ప్రవేశం నుండి రహదారి మూల మలుపులు లేకుండా చూడాలని, ప్రతి చోటా, దుకాణాల ముందు సైన్ బోర్డులను ఏర్పాటు చెయ్యాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. మంథని పట్టణ సుందరీకరణ కొరకు ప్రజలు వచ్చే అవసరమైన సలహాలు సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా దుకాణాలు, భూములు కోల్పోయిన చిరు వ్యాపారులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని శ్రీధర్‌బాబు చిరు వ్యాపారులకు హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉ ంచుకొని వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. పుష్కరాల సమయం వరకు మంథని మున్సిపల్ పరిధిలో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను అవకతవకలు జరగ కుండా పూర్తి చేయాలని, నాసిరకం పనులు చేపట్టవద్దని ఇరిగేషన్ రహదారులు భవనాలు రెవెన్యూ అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. పనులలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హెచ్చరించారు. బాధలో సైతం, బాధ్యతను మరవని అమాత్యుడిపై మంత్రపురి ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చెర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, తోట్ల తిరుపతి యాదవ్, కొత్త శ్రీనివాస్, శశి భూషణ్ కాచే, ఐలీ ప్రసాద్, సెగ్గం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# త్రికరణశుద్ధితో విధులు నిర్వహించి లోక్‌భవన్ ప్రతిష్టను మరింత పెంచాలి

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- లోక్‌భవన్ పరివార్‌తో గవర్నర్ ఆత్మీయ సమావేశం



**హైదరాబాద్, జూలై 22 (జనంసాక్షి) :** త్రికరణశుద్ధితో విధులు నిర్వహించి లోక్‌భవన్ ప్రతిష్టను మరింత పెంచాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌భవన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగితో వ్యక్తిగతంగా మాట్లాడిన గవర్నర్, వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లోక్ భవన్ లో పనిచేసే ఉద్యోగులకు హోదాలతో నిమిత్తం లేకుండా లోక్ భవన్ ఉద్యోగిగా ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. లోక్‌భవన్‌లో పనిచేసే అవకాశం రావడం గర్వించదగ్గ విషయమని, ప్రతి ఉద్యోగి లోక్ భవన్ ప్రతిష్ఠను కాపాడే బాధ్యతతో పనిచేయాలని సూచించారు. త్రికరణశుద్ధితో, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ లోక్‌భవన్ గౌరవం, ప్రతిష్ట మరింత పెరిగేలా కృషి చేయాలన్నారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంకు ప్రాధాన్యం ఇవ్వాలని గవర్నర్ సూచించారు. లోక్‌భవన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించాలని లోక్ భవన్ వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరాణాచారి, డిప్యూటీ సెక్రటరీ జి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ

- సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు
- విచారణకు రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డిసిపి లావణ్య



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ట్రైనీ ఐపీఎస్ గా ఉన్నారని.. అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ అతని తరపు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారని, ఆ కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌లో కోరారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు మేరకు అతనిపై అత్తాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు బదిలీ అనంతరం డీసీపీ లావణ్య బుధవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి చేరుకుని దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించారు. కేసులో ఫిర్యాదు చేసిన ట్రైనీ ఐపీఎస్ అధికారి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఆమె అకాడమీకి వెళ్లారు. అకాడమీలో ఉన్నతాధికారుల సమక్షంలో ట్రైనీ ఐపీఎస్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, అందుబాటులో ఉన్న డిజిటల్, ఇతర ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. మహిళా భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు దర్యాప్తు సమయంలో అకాడమీలోని అధికారులు, సహచర ట్రైనీలు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలను కూడా సేకరించే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను ప్రత్యేక దర్యాప్తు బృందం వెలుగులోకి తీసుకురానుంది. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈ విచారణలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చే వాంగ్మూలం కీలక ఆధారంగా మారనుంది. ఈ తాజా పరిణామాలతో ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.

# ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధత

- రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం
- శాస్త్రీయ విశ్లేషణ ఆధారంగా కార్యాచరణ ప్రణాళిక
- చిన్నారెడ్డి అధ్యక్షతన కమిటీ అధ్యయనం




**హైదరాబాద్, జూలై22 (జనంసాక్షి) :** వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడం కోసం నిపుణుల కమిటీ భేటీ అయ్యింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల కోసం రాష్ట్ర స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం, ఉపశమన, అనుసరణ చర్యలను సిఫారసు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యులతో కూడిన బహుళ విభాగాల నిపుణుల కమిటీ తొలి సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. కమిటీలో భారత వాతావరణ శాఖ, ఇక్రిశాట్, ఐసీఏఆర్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, మార్క్ ఫెడ్, ఆయిల్‌ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా డా. జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని చాలా మంది భావించారని, అయితే జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున సుమారు 30 శాతం వర్షపాత లోటు నమోదైందని, 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 23 జిల్లాల్లో వర్షపాత లోటు ఉందని తెలిపారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

- ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు
- సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ
- పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు
- గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు



**న్యూఢిల్లీ, జూలై22 (జనంసాక్షి) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. ఈరోజు(బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి - కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి - కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.



# నీట్‌పై కేంద్ర వైఖరి దారుణం

- విద్యార్థులపై లాఠీఛార్జ్ అమానుషం
- రాహుల్‌కు మద్దతుగా నిత్యం ఆందోళనలు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి

**సంగారెడ్డి, జూలై22 (జనంసాక్షి) :** మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు.

విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని.. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీకి మద్దతుగా మంగళవారం హైదరాబాద్ - ముంబై నేషనల్ హైవే ముట్టడించామన్నారు. బుధవారం నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేశామని చెప్పారు. గురువారం కూడా ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ టీషర్ట్‌లు ధరించిన వెయ్యి మంది కాంగ్రెస్ కేడర్‌తో ఈ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్ర సరిహద్దు రోడ్లకు మోక్షమెన్నడు!

- 15 సంవత్సరాలుగా పట్టించుకోని పాలకులు
- 9 కిలోమీటర్ల వందల సంఖ్యలో ప్రమాదకర గుంతలు
- అతిదారుణంగా చాల్కి, చీకూర్తి - బీదర్ ఆర్ అండ్ బీ రోడ్డు
- ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజానీకం ఆగ్రహం






**న్యాల్‌కల్, జూలై 22 (జనంసాక్షి) :** ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికార యంత్రాంగం మారుతున్న రాష్ట్ర సరిహద్దు రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదు. కనీసం మరమ్మత్తులకు సైతం నోచుకోలేక పోతున్నాయి. రోడ్డుపై వందల సంఖ్యలో ఏర్పడ్డ ప్రమాదకర బీటలు, గోతులతో.. ప్రయాణికులు, వాహన చోదకులు అనునిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన రోడ్డు దుస్థితి మాత్రం మారకపోవడంతో ప్రయాణికులు వాహన చోదకులు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగంపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యంతో.. అతి దారుణంగా మారిన తెలంగాణ - కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు, న్యాల్ కల్ మండలం, చాల్కి, చీకూర్తి - బీదర్ ఆర్‌అండ్‌బి రోడ్డు దుస్థితిపై "జనం సాక్షి" ప్రత్యేక కథనం..

### 9 కి.మీ.. వందల సంఖ్యలో ప్రమాదకర గోతులు

నారాయణఖేడ్ - జహీరాబాద్ జాతీయ రహదారి, న్యాల్ కల్ మండలం, చాల్కి గ్రామ ప్రధాన కూడలి నుండి చీకూర్తి, హుస్సేన్ నగర్ గ్రామాల మీదుగా.. కర్ణాటకలోని బీదర్ పట్టణానికి అనునిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, వాహన చోదకులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. చాల్కి కూడలి నుండి కర్ణాటక సరిహద్దు వరకు కేవలం 9 కి.మీ. దూరంలో ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డు అతిదారుణంగా మారింది. అటువైపుగా రాకపోకలు సాగించే పలువురు ప్రయాణికులు, అధికార, విపక్ష శ్రేణులు పలుమార్లు ప్రజావాణికి, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, పలువురు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు.

### 15 సంవత్సరాలుగా కనీస మరమ్మతులు కరువు

పాతిక సంవత్సరాల క్రితం న్యాల్ కల్ మండలం నారాయణఖేడ్ నియోజకవర్గంలో కొనసాగింది. అప్పటి ఎమ్మెల్యే చొరవతో చాల్కి, చీకూర్తి - కర్ణాటక సరిహద్దు వరకు దాదాపు 9 కి.మీ మేర ఉన్న జిల్లా పరిషత్ రోడ్డును బీటిగా మార్చారు. అనంతరం జడ్పీ రోడ్డును పదోన్నతి కల్పిస్తూ.. ఆర్‌అండ్‌బి రోడ్డుగా మార్చారు. దాదాపు 2010 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టింది. అనంతరం దాదాపు15 సంవత్సరాలుగా రోడ్డుపై ఏర్పడ్డ చిన్నపాటి మరమ్మత్తులను సైతం పూడ్చ లేకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు.

### సమీప గ్రామాల ప్రజలకు సరైన మార్గం

నారాయణఖేడ్, న్యాల్ కల్ మండలం, మంజీరా నది పరివాహక ప్రాంతంలోని గ్రామ ప్రజలు వివిధ అవసరాల కోసం చాల్కి, చీకూర్తి, హుస్సేన్ నగర్ గ్రామాల మీదుగానే కర్ణాటకలోని బీదర్ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు, వ్యాపారులు, నిత్య శ్రామికులు, విద్య, వైద్యం, తదితర అవసరాల కోసం.. వచ్చి పోతుంటారు. న్యాల్ కల్, డప్పూర్,గంగువార్ గ్రామాల మీదుగా.. బీదర్ కు వెళ్లేందుకు అధిక సమయం, కి.మీ. దూరం అధికమవడంతో.. చీకూర్తి గ్రామం మీదుగానే బీదర్ కు రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్ద కాలం క్రితం ఈ మార్గాన నారాయణఖేడ్, బీదర్, బాన్సువాడ, తదితర ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం రెండు, మూడు బస్సులు మాత్రమే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించి రోడ్డును బీటిగా మార్చి ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

# ట్రాన్స్‌కో డీఈ ముత్యం ఇంటిపై ఏసీబీ దాడులు

- భారీగా ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు



**హైదరాబాద్, జూలై22 (జనంసాక్షి) :** హైదరా బాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. గత 12 గంటలుగా కొనసాగుతున్న ఈ తనిఖీల్లో రెండు ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అధికారులు, నగదు, కీలక పత్రాలు, బంగారం, వజ్రాభరణాలు, విదేశీ మద్యం బాటిళ్లతో పాటు కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముత్యం వెంకటరమణ ప్రస్తుతం రెడ్‌కోలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తు న్నారు. సోదాల్లో ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఆంజనేయనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో 10 ప్లాట్లు, నాలుగు రెసిడెన్షియల్ ప్లాట్లు, కమర్షియల్ భవనాలు, ఖానామెట్ గుట్టల బేగంపేట్‌లో 5 కమర్షియల్ భవనం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2019లో రూ.26 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముత్యం వెంకటరమణపై అప్పటి నుంచే నిఘా కొనసాగుతోందని, విద్యుత్ శాఖలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో అక్రమా స్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాల ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370